RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 68 గురువారం 3 ఏప్రిల్ 2025 పేజీలు : 4

### త్వరలో మీడియా కౌన్సిల్ ఏర్పాటు

న్యూఢిల్లీ : దేశంలో డిజిటల్ వేదికలు, ప్రసార మాధ్యమాలు, సోషల్ మీడియా యాప్‌లు భారీ సంఖ్యలో పుట్టుకొస్తున్నాయి. వీటి నియంత్రణ ప్రభుత్వాలకు సంక్లిష్టంగా మారింది. ఈ నేపథ్యంలో మీడియా కౌన్సిల్ అనివార్యమని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కేంద్రానికి ఇటీవలే నివేదించింది. ముద్రణ, ప్రసార, డిజిటల్ మీడియాలు అన్నింటినీ ఒకే గొడుగు కిందకు చేర్చేందుకు కొత్తగా మీడియా కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది. ప్రస్తుతం డిజిటల్ వేదికలు ఐటీ చట్టం, 2021 కింద ఉన్నాయి. ప్రింట్ మీడియాను ప్రెస్ కౌన్సిల్ నియంత్రిస్తున్నది. టీవీ చానళ్లు కేబుల్ టీవీ నెట్‌వర్క్ చట్టంలోని మార్గదర్శకాల ప్రకారం నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో వీటన్నింటినీ మీడియా కౌన్సిల్ ఏర్పాటు ద్వారా ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని స్టాండింగ్ కమిటీ స్పష్టం చేసింది.

# బీసీ రిజర్వేషన్ పై... ఇక ధర్మయుద్ధమే...



## ఢిల్లీలో బీసీ గర్జన

## 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామంటే మోదీకి ఏంటి సమస్య..?

## ఢిల్లీ బీసీ పోరు గర్జనలో సీఎం రేవంత్!

బీసీలకు రిజర్వేషన్ 42శాతం పెంచుతూ తెలంగాణ తీర్మానం చేసిందని ఆ బిల్లును కేంద్రం ఆమోదించాలని లేదంటే ధర్మయుద్ధం తప్పదని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఇవాళ ఢిల్లీ లోని జంతర్మంతర్ వద్ద బీసీ రిజర్వేషన్ల సాధనకు చేపట్టిన బీసీ సంఘాల ధర్నాకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. స్థానిక సంస్థలు, చట్ట సభల్లో రిజర్వేషన్లు కావాలంటే జనాభా లెక్క తేలాలన్నారు. అదేవిధంగా రిజర్వేషన్ల అంశాన్ని రాహుల్ గాంధీ దృష్టికి తీసుకొచ్చామని అన్నారు. జనాభా లెక్కలు తెలియకపోతే రిజర్వేషన్లు ఇచ్చేందుకు లేదని కోర్టులే చెప్పాయని తెలిపారు. దీంతో జనగణనతో పాటు కులగణన చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించిందని అన్నారు. జనగణనలో కులగణన చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేసినందుకే బీజేపీ కుట్రపూరితంగా జనగణన వాయిదా వేస్తోందని రేవంత్ ఆరోపించారు. తెలంగాణలో కులగణన చేసి బీసీల లెక్క 56.36 శాతం అని తేల్చింది. గుజరాత్ సహా దేశంలో ఏ రాష్ట్రంలోనూ కులగణన చేయలేదు.రాహుల్ గాంధీ మాట ప్రకారం తెలంగాణ మొట్టమొదటి సారి కులగణన చేసింది.

స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచమన్న డిమాండ్ మాత్రమే కాదు, ఉద్యోగ, విద్య రంగంలో కూడా ఈ పెంపు ఉండాలని నిర్ణయించాం.రిజర్వేషన్ల పెంపు కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న వ్యవహారం. అందుకే మేము తీర్మానం చేసి కేంద్రానికి పంపించాం. మేము మా రాష్ట్రంలో పెంచుకుంటాం అన్నాం. మీ (మోదీ) రాష్ట్రంలో చేయమని మేము అడగలేదని సీఎం గుర్తు చేశారు. మా రాష్ట్రంలో రిజర్వేషన్లు పెంచితే నరేంద్ర మోదీకి వచ్చిన కష్టమేంటి? మా పిల్లల చదువులు, ఉద్యోగాలు, రాజకీయ అవకాశాల కోసం 42 శాతం ఇవ్వాలని మేం ప్రయత్నం చేస్తుంటే.. మీకు ఏం కష్టం వచ్చింది? మా తీర్మానం ప్రకారం రిజర్వేషన్లు పెంచమని కోరుతూ బీజేపీ నేతలను బీసీ సంఘాలు కలిశాయి. అయినా ఉలుకు లేదు. పలుకు లేదు.అందుకే ఢిల్లీలో బీసీ మహా ధర్నా చేపట్టాల్సిన పరిస్థితి బీసీ సంఘాలకు ఏర్పడిందని రేవంత్ రెడ్డి అన్నారు.కురుక్షేత్ర యుద్ధంలో చెప్పినట్టు "అయిననూ హస్తిన పోయి రావలె".. ఢిల్లీకి వచ్చి ధర్నా చేస్తున్నారు. మా మీద ఆధిపత్యం చెలాయించాలని చూడొద్దు. నిజాం పాలకులకు ఏ గతి పట్టిందో చూశారు. ఆంధ్రా పాలకులకు ఏం జరిగిందో చూశారు.మీరెప్పుడూ ఢిల్లీలో ఉండరు. గల్లీలోకి రావాల్సిందేనని తేల్చి చెప్పారు. చిన్న సాయం చేస్తే జీవితాంతం గుర్తుపెట్టుకునే జాతులు మా బీసీ జాతులు. ఈ జాతులకు అన్యాయం చేస్తే ఎలా మర్చిపోతారు?దేశమంతటా మీరు అమలు చేస్తారా లేదా అని నేను అడగడం లేదు. మా తెలంగాణలో తీర్మానం చేసిన ప్రకారం పెంచమని మాత్రమే అడుగుతున్నామన్నారు.రాజకీయ పార్టీలన్నీ వ్యతిరేకించినా సరే అనేక బిల్లులు తెచ్చి చట్టాలు చేశారని ఆరోపించారు.ట్రిపుల్ తలాఖ్ తెచ్చారు. ఆర్టికల్ 370 రద్దు చేశారు. వ్యవసాయంపై నల్ల చట్టాలు తెచ్చారు. మరి రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడానికి ఏం సమస్య వచ్చింది? అంటూ నరేంద్రమోదీని సీఎ నిలదీశారు.బీసీల కోసం ప్రాణాలు ఇస్తామని బండి సంజయ్ అంటారు. మాకు మీ ప్రాణాలు వద్దు. 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వండి చాలు అంటు గుర్తు చేశారు.? మీరు మా డిమాండ్లకు దిగి రావాలి. లేదంటే మీరు దిగిపోవాలి, బీసీలు ధర్మయుద్ధం ప్రకటించాలి. నరేంద్ర మోదీ గారు వినండి. మేము ఇక ఢిల్లీకి రాం. మీరే మా గల్లీకి రావాలంటూ సంచనల ప్రకటన చేశారు సీం రేవంత్ రెడ్డి,. కురుక్షేత్ర యుద్ధంలో 5 గ్రామాలు ఇవ్వాలని సంధి ప్రయత్నం జరిగింది. కానీ దుర్యోధనులు వినలేదు. తర్వాత ఏం జరిగిందో అందరికీ తెలుసు. మేము కూడా ఇప్పుడు సయోధ్యకు వచ్చాం. మా రిజర్వేషన్ల పెంపునకు ఆమోదం చెప్పండి లేదంటే ధర్మయుద్ధం తప్పదని సీఎం రవంత్ రెడ్డి హెచ్చరించారు.

## హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ.. ఏ పార్టీ బలం ఎంతంటే?




హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన విషయం తెలిసిందే. మార్చి 28న నోటిఫికేషన్ విడుదల కాగా, ఏప్రిల్ 4వ తేదీ నుంచి నామినేషన్లు దాఖలు చేయనున్నారు. ఏప్రిల్ 23వ తేదీన పోలింగ్ జరుగనుంది.

ఏప్రిల్ 25వ తేదీన ఫలితాలు వెలువడనున్నాయి. ప్రస్తుతం ఇక్కడి నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న ఎమ్మెల్సీ ఎం.ఎస్.ప్రభాకర్ పదవీ కాలం ఈ ఏడాది మే 1వ తేదీకి ముగియనుంది. ఈ నేపథ్యంలోనే ఈసీ నోటిఫికేషన్ విడుదల చేసింది. అంతేకాదు.. ఈ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో కోడ్ అమలులోకి వచ్చింది. ఇదిలా ఉండగా.. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు దాదాపు ఏకపక్షంగానే జరిగే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఈ ఎన్నికల్లో ఎవరి బలం ఎంతో ఓసారి తెలుసుకుందాం.. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో మొత్తం ఓట్లు 110 ఉన్నాయి. అందులో 81 మంది కార్పొరేటర్లు, 29 మంది ఎక్స్అఫీషియో సభ్యులు.. ఉండగా.. ప్రస్తుతం 3 డివిజన్లకు కార్పొరేటర్లు లేరు. ఇందులో ఎంఐఎం పార్టీకి 49 ఓట్ల బలం ఉంది. అందులో ఒక ఎంపీ, ఏడుగురు ఎమ్మెల్యేలు, ఒక ఎమ్మెల్సీతో పాటు 40 మంది కార్పొరేటర్ల మద్దతు ఉంది. ఇక బీఆర్ఎస్‌కు 25 ఓట్లు ఉన్నాయి. ఇందులో ముగ్గురు రాజ్యసభ ఎంపీలు, ఇద్దరు ఎమ్మె ల్సీలు, ఐదుగురు ఎమ్మెల్యేలు, 15 మంది కార్పొరేటర్లు ఉన్నారు. బీజేపీకి 19 మంది మద్దతుంది. వీరికి ఒక ఎంపీ, ఒక ఎమ్మెల్సీ, 19 మంది కార్పొరేటర్లు ఉన్నారు. ఇక అధికార కాంగ్రెస్‌కు కేవలం 14 ఓట్లే ఉన్నాయి.

ఇందులో ఒక రాజ్యసభ ఎంపీ, నలుగురు ఎమ్మె ల్సీలు, ఇద్దరు ఎమ్మెల్యేలు, ఏడుగురు కార్పొరేటర్లు ఉన్నారు. ప్రస్తుతం 49 ఓట్లతో ఎంఐఎం పార్టీ బలంగా ఉంది. దీనికి కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇస్తే.. విజయం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది.




## తెలంగాణలో మరో ఎయిర్ పోర్టుకు గ్రీన్ సిగ్నల్

ఆదిలాబాద్ ఎయిర్ పోర్టుకు భారత వాయుసేన గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పౌర విమాన సేవలను ప్రారంభించేందకు అనుమతులు మంజూరు చేసింది. ఆరు నెలల వ్యవధిలోనే రెండు ఎయిర్ పోర్టులకు అనుమతులు రావడం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అవిశ్రాంత కృషికి దక్కిన ఫలితమన్నారు మంత్రి కోమటిరెడ్డి. ఆదిలాబాద్ ఎయిర్ పోర్టునుఅభివృద్ధి చేసి పౌర విమానయాన సేవలను అందుబాటులోకి తీసుకురావాలని కేంద్రానికి తెలంగాణ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తికి భారత వాయుసేన అంగీకరించింది.

త్వరలోనే అక్కడ వాయుసేన శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేసే యోచనలో కేంద్రం ఉన్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. జాయింట్ యూజర్ ఎయిర్ ఫీల్డ్ గా అభివృద్ధి చేయాలని వాయుసేన లేఖ ద్వారా సూచించిందని కోమటిరెడ్డి తెలిపారు. రన్ వే పునర్నిర్మాణ , పౌర టర్మినల్ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఎయిర్ క్రాఫ్ట్ ఎప్రాన్ సహా మౌలిక వసతులను అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు కోమటిరెడ్డి. వీటికి అవసరమైన భూమిని ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకు ఇవ్వాలని వాయుసేన సూచించినట్లు చెప్పారు. ఈ విషయంపై అధికారులతో సమీక్షిస్తున్నామని...త్వరలోనే అన్ని వివరాలతో కూడిన నివేదికను కేంద్రానికి పంపిస్తామన్నారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.




# వక్ఫ్ బిల్లుకు లోక్‌సభ ఓకే

## అనుకూలంగా 226 ఓట్లు.. వ్యతిరేకంగా 163

న్యూఢిల్లీ : వక్ఫ్ సవరణ బిల్లు-2024ను లోక్‌సభ ఆమోదించింది. ఈ బిల్లుకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో ఆందోళనకు దిగాయి. వారి నిరసనల నడుమ బుధవారం కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. వక్ఫ్ బిల్లు పేరును 'యూనిఫైడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్ ఎంపవర్‌మెంట్, ఎఫిషియన్సీ అండ్ డెవల్‌పమెంట్ (యూఎంఈఈడీ-ఉమీద్)'గా మార్చినట్లు వెల్లడించారు. సంయుక్త పార్లమెంటు కమిటీ (జేపీసీ) చేసిన అనేక సిఫారసులను కూడా బిల్లులో పొందుపర్చినట్లు తెలిపారు. జేపీసీ సిఫారసులను బిల్లులో చేర్చలేదన్న ప్రతిపక్షాల వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమన్నారు. ఈ బిల్లుపై అన్ని వర్గాల అభిప్రాయాలు తీసుకున్నామని వెల్లడించారు. ఈ బిల్లును తీసుకురాకపోతే.. పార్లమెంట్ భూమిని కూడా వక్ఫ్ ఆస్తిగా చెబుతారని విమర్శలు గుప్పించారు. బిల్లుపై అర్ధరాత్రి వరకూ అధికార, ప్రతిపక్షాల మధ్య వాడీవేడి చర్చ జరిగింది. అనంతరం మూజువాణీ ఓటుతో 'ఉమీద్'ను ఆమోదించేందుకు స్పీకర్ ప్రయత్నించారు. అందుకు విపక్షాలు అభ్యంతరం తెలపడంతో ఓటింగ్ జరిపారు. అనుకూలంగా 226, వ్యతిరేకంగా 163 ఓట్లు వచ్చాయి. విపక్ష సభ్యులు తాము ప్రతిపాదించిన ప్రతి సవరణపైనా ఓటింగ్ జరగాలని పట్టుబట్టారు. అన్ని సవరణలపై ఓటింగ్ జరపడంతో ఆమోదం లభించేసరికి అర్ధరాత్రి దాటింది. బిల్లుపై చర్చ సందర్భంగా కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. ఈ బిల్లు మతానికి సంబంధించినది కాదని, కేవలం ఆస్తుల విషయాలకు సంబంధించినదేనని స్పష్టం చేశారు. వక్ఫ్ బిల్లులోని అత్యంత క్రూరమైన సెక్షన్ 40 రద్దు కానుందన్నారు. ఈ సెక్షన్ కారణంగా ఏ భూమినైనా తమదేనని ప్రకటించుకునే హక్కు వక్ఫ్ బోర్డు, ట్రైబ్యునల్‌కు ఉందని.. దీన్ని కొందరు తమ స్వార్థ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ఇంతటి దారుణమైన సెక్షన్‌ను తాము తొలగించామని చెప్పారు. కొందరు ప్రతిపక్ష నేతలు చెబుతున్నట్లుగా ముస్లిం వర్గాలకు చెందిన ఏ భూమినీ తాము లాగేసుకోబోమని స్పష్టం చేశారు. "పేద ముస్లింల కోసం వక్ఫ్ ఆస్తులను ఉపయోగించాలి. వారిని అలా వదిలేయకూడదు. వారి ఉన్నతి కోసం మోదీ ప్రభుత్వం ఏవైనా చర్యలు తీసుకుంటే ఎందుకు వ్యతిరేకిస్తున్నారు? ముస్లిం ప్రతినిధులు ఆ బిల్లును ఆహ్వానించారు. వీలైనంత త్వరగా దీనికి ఆమోదం లభించాలని ఆ వర్గంలోని పేదలు కోరుకుంటున్నారు. అలాగే రిజిస్టర్ చేసిన ఆస్తి విషయంలో ఎవరూ జోక్యం చేసుకోరు. ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలతో ముస్లిం మహిళలు, పిల్లలకు హక్కులు దక్కుతాయి. ప్రభుత్వ భూమి విషయంలో వివాదం తలెత్తితే కలెక్టర్ కంటే పైస్థాయి అధికారి తీర్పు ఇవ్వాలంటూ జేపీసీ చేసిన ప్రతిపాదనను మేం అంగీకరించాం" అని రిజిజు స్పష్టం చేశారు. "బిల్లు గురించి విపక్షాలు అసత్య ప్రచారం చేశాయి.

1954లో తొలిసారి వక్ఫ్ చట్టం అమల్లోకి వచ్చింది. అది అప్రజాస్వామికం అని ఆనాడు ఎవరూ చెప్పలేదు. తాజా బిల్లును పరిశీలించిన జేపీసీకి అభినందనలు.

ఈ బిల్లు తీసుకురాకపోతే.. కొందరు పార్లమెంట్ భవనాన్ని కూడా వక్ఫ్ ఆస్తిగా పేర్కొంటారు" అని కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు. పార్లమెంట్ భవనం, దాని పరిసర ప్రాంతాలు వక్ఫ్ ఆస్తికి సంబంధించినవని గతంలో ఏఐయూడీఎఫ్ చీఫ్ బద్రుద్దీన్ అజ్మల్ అన్నారు. దానికి స్పందనగానే రిజిజు ఈ వ్యాఖ్యలు చేశారు. టెక్నాలజీని ఉపయోగించుకునేందుకు ఈ బిల్లు తోడ్పడుతుందని, వక్ఫ్ ఆస్తులన్నీ డిజిటల్ పోర్టల్‌లో ఉంటాయని, ఎవరూ ఆక్రమించేందుకు ఆస్కారం ఉండదని రిజిజు చెప్పారు. బిల్లును గురువారం రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు.

**దౌర్జన్యపూరితం: కాంగ్రెస్** .... వక్ఫ్ సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా కాంగ్రెస్ సభ్యుడు కేసీ వేణుగోపాల్ కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బిల్లును వ్యతిరేకించారు. కేంద్రం దౌర్జన్యపూరితంగా బిల్లును తెస్తోందని ఆరోపించారు. సభలో ప్రవేశపెట్టే బిల్లుకు సవరణలు ప్రతిపాదించే హక్కు సభ్యులకు ఉంటుందన్నారు. సవరణలకు కనీస సమయం ఇవ్వకుండా హడావుడిగా ప్రవేశపెట్టారని ఆక్షేపించారు. మోదీ సర్కారు ఆరెస్సెస్ అజెండాను అమలు చేస్తోందని విమర్శించారు. లోక్‌సభలో కాంగ్రెసపక్ష ఉప నేత గౌరవ్ గొగోయ్ మాట్లాడుతూ.. వక్ఫ్ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని చెప్పారు.

బిల్లు కేవలం పాలనాపరమైన మార్పులకు సంబంధించినది కాదని.. మైనారిటీ వర్గాలను అవమానించడం, భారత సమాజాన్ని విభజించడమేనని చెప్పారు.కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలను కేంద్ర హోం మంత్రి అమిత్ షా తిప్పికొట్టారు. "జేపీసీ వేయాలన్నదే మీరు. కమిటీ సూచించిన మార్పులుచేర్పులను అంగీకరించకపోతే జేపీసీని ఎందుకు ఏర్పాటు చేయమన్నారు" అని ప్రశ్నించారు.

వక్ఫ్ భూముల విషయంలో అవినీతిని అడ్డుకొని, పేద ముస్లింల భూమిని కాపాడడమే ఈ బిల్లు ఉద్దేశమని తెలిపారు. వక్ఫ్ అంటే అరబిక్‌లో అల్లా పేరుతో దానం అని అర్థమని, అది దాతృత్వ కార్యక్రమని చెప్పారు. మీది కాని భూమిని దానం చేయడాన్ని దాతృత్వమని అనరని గుర్తుచేశారు.

**అమిత్ షా, అఖిలేశ్ వ్యంగ్యాస్త్రాలు...** వక్ఫ్ సవరణ బిల్లుపై లోక్‌సభలో చర్చ సందర్భంగా సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ మాట్లాడారు. "ప్రపంచంలో అతిపెద్ద పార్టీ తన అధ్యక్షుడిని ఎన్నుకోలేకపోతోంది" అని బీజేపీని ఉద్దేశించి ఎద్దేవా చేశారు. "అఖిలేశ్ నవ్వుతూ ఓ విషయం చెప్పారు. నేను కూడా అలాగే సమాధానం ఇస్తా. కొన్ని పార్టీల నాయకత్వం ఐదుగురి చేతుల్లోనే ఉంటుంది. వారి నుంచే అధ్యక్షుడిని నియమించుకుంటారు. కానీ, మేం 12-13 కోట్ల మంది పార్టీ సభ్యుల నుంచి ఒకరిని ఎంపిక చేసుకోవాలి. అందుకు సమయం పడుతుంది. మీకు అలాంటిదేం అక్కర్లేదు. ఎందుకంటే మరో 25 ఏళ్లు మీరే పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతారు" అని షా బదులిచ్చారు.

# సంపాదకీయం

## కాపులకు ఒక పార్టీ ఉండాల్సిందేనా ?

ఏపీలో మళ్ళీ రాజకీయ మధనం సాగుతోంది. అది సామాజిక రాజకీయ మధనంగా ఉంది. నిజం చెప్పాలంటే దేశంలోని అనేక రాష్ట్రాల్లో రాజకీయం ఒక ఎత్తు. ఏపీలో రాజకీయం మరో ఎత్తు. ఏపీలో పాలిటిక్స్ అంటేనే కులాల సంకుల సమరం. లెక్కలు అన్నీ ఇక్కడ పక్కాగా ఉంటాయి. తేడా వస్తే అంతా రివర్స్ కూడా అవుతుంది మరి. ఉమ్మడి ఏపీలో కానీ విభజన ఏపీలో కానీ రాజకీయం ఎపుడూ హాట్ గానే సాగుతూ వస్తోంది. ఇక చూస్తే కనుక ఉమ్మడి ఏపీని అనేక మంది సీఎంలు పాలించారు. కానీ వారిలో కాపుల నుంచి ఒక్కరూ ప్రాతినిధ్యం అయితే లేదు. నిజానికి ఏపీలో కాపులు చాలా డామినేటింగ్ రోల్ ప్లే చేస్తూ ఉంటారు. జనాభా పరంగా చూసినా వారు చాలా చోట్ల బలంగా ఉంటారు. సుమారు డెబ్బై అయిదు అసెంబ్లీ నియోజకవర్గాలలో వారి పాత్ర ప్రత్యక్షంగా పరోక్షంగా కీలకంగా ఉంటుంది. అంటే గెలుపు ఓటములను తీవ్రంగా ప్రభావితం చేస్తారన్న మాట. అంతవరకూ ఎందుకు చరిత్ర ఒక్కసారి తిరగేస్తే చాలు కాపులు మద్దతు ఇచ్చిన పార్టీలే గెలిచాయి. వారి ఆగ్రహానికి గురి అయినవి ఓటమి బాట పట్టాయి. మరీ ముఖ్యంగా 1983 నుంచి చూస్తే కాపుల పాత్ర ఏపీలో అతి కీలకంగా మారింది. వారు ఏ పార్టీతో కలిసి నడిస్తే వారికి అధికారం దక్కి తీరుతుంది అన్నది రుజువు అయింది. 1983, 1985లలో టీడీపీతో నడచిన కాపులు 1989లో కాంగ్రెస్ వెంట ఉండి గెలిపించారు. అలాగే 1994, 1999లలో టీడీపీ వైపు ఉన్నారు. 2004లో కాంగ్రెస్ ని గెలిపించిన కాపులు 2009లో ప్రజారాజ్యం వెంట సాగారు. 2014లో తిరిగి టీడీపీ బీజేపీ కాంబోని ఏపీలో గెలిపించడంలో వారిది ముఖ్య పాత్ర. ఇక 2019లో వైసీపీ గెలుపు వెనక కాపులది అతి ప్రధాన పాత్ర. 2024 వచ్చేసరికి సీన్ రివర్స్ అయింది. కూటమిని గెలిపించిన కాపులు వైసీపీని గద్దె దించేశారు. ఇవన్నీ కూడా కాపుల రాజకీయ ప్రాబల్యాన్ని పలుకుబడిని తెలియచేస్తాయి. ఇదిలా ఉంటే ఏపీలో కాపులకు అధికారం మాత్రం అందని పండు అవుతోంది. విభజన ఏపీలో వారు సులువుగా అధికారం అందుకోవచ్చు. మ్యాజిక్ ఫిగర్ 88 అయిన చోట 75 అసెంబ్లీ నియోజకవర్గాలలో రాజకీయ పలుకుబడి కలిగిన కాపులకు సీఎం పీఠం దక్కడం ఒక విధంగా ఈజీనే అని అంటారు. కానీ ఏపీలో చూస్తే రాజకీయ సమీకరణలు మాత్రం వారిని ఇబ్బంది పెడుతున్నాయి. ఏదో ఒక ప్రధాన పార్టీకి మద్దతుగా ఉంటూ పదవులు అందుకోవడమే తప్పించి ముఖ్యమంత్రి సీటుని తాము దక్కించుకోలేకపోతున్నామన్న వేదన వారిలో ఉంది. ఈ రోజు ఏపీలో కూటమి గెలుపు వెనక కాపులు ఉన్నారు. కానీ ఉప ముఖ్యమంత్రి పదవి జనసేనకు దక్కింది. ఈ ఉప ముఖ్యమంత్రి పదవి కోసం కాపులు ఆలోచించడంలేదు ఈ పదవి వైసీపీ టీడీపీలు గతంలోనూ ఇచ్చి ఉన్నాయి అని గుర్తు చేస్తున్నారు. కాపులు రాజకీయంగా కీలకం అయినపుడు గెలుపులో వారి పాత్ర అతి ముఖ్యమైనపుడు రాజకీయ బేరసారాలతో సీఎం సీటుని సాధించుకోవాలన్నదే కాపు పెద్దల ఆలోచన. జనసేన అయితే సీఎం చంద్రబాబుని మరింతకాలం ఆ పదవిలో చూడాలని అనుకుంటోంది. ఆయనను సత్తా ఉన్న నాయకుడిగా చూస్తోంది. ఆయన వల్లనే ఏపీ అభివృద్ధి అని భావిస్తోంది. దాంతో ఏపీలో కాపులు అందరూ ఎక్కాలీ అంటే మరో దశాబ్దన్నర కాలం వేచి చూడాలా అన్న చర్చ కూడా వస్తోంది. ఇక రాజకీయంగా చూసినా ఒకరిద్దరికి పదవులు ఇచ్చేస్తే మొత్తం సామాజిక వర్గం మేలు జరిగింది అన్న భావన సరికాదు అన్నది కూడా ఉంది. తాము కూడా ముఖ్యమంత్రులు కావాలని తమ హవా కొనసాగాలన్నదే కాపుల ఆలోచనగా చెబుతున్నారు. ఇంకో వైపు చూస్తే కాపులకు పదవులు అంటే జనసేనకు కోటా ఇచ్చేసి మిగిలిన సామాజిక వర్గాలకు టీడీపీలో సర్దుతున్న నేపథ్యం ఉంది. దాంతో టీడీపీలో కాపులు రగులుతున్నారు అన్న ప్రచారం కూడా సాగుతోంది. అలాగే వైసీపీలో కూడా కాపులు దారి తెన్నూ తెలియక ఉన్నారని కూడా అంటున్నారు. ఈ నేపథ్యంలో వంగవీటి రంగా తనయుడిగా ఒక బలమైన సామాజిక వర్గానికి సంబంధించిన చరిష్మాటిక్ లీడర్ గా ఉన్న వంగవీటి రాధాకృష్ణ నేతృత్వంలో కాపుల కోసం కొత్త పార్టీ మొదలవుతుందా అన్న చర్చ అయితే ఉంది. మొదట ఇది పుకారుగా బయల్దేరినా ఇది ఇపుడు చర్చకు తావిస్తోంది. దాంతో మరో నాలుగేళ్ళలో ఏపీలో జరిగే ఎన్నికల లోగా ఈ పుకారు నిజమవుతుందని బలమైన రాజకీయ బీజం పడి కాపుల కోసం ఒక పార్టీగా ముందుకు వచ్చే చాన్స్ ఉందని అంటున్నారు అదే జరిగితే కనుక ఏపీలో రాజకీయ సమీకరణలు మొత్తం సామాజిక పరంగా మారిపోతాయని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

## సంబంధిత అర్హతలు లేకుండా ఆసుపత్రులలో ఇష్టానుసారం వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవు... జిల్లా వైద్య సిబ్బంది




జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) : అర్హత కలిగిన డాక్టర్లు లేకుండా సేవలను ప్రకటన చేయడం, అర్హత కలిగిన మెడికల్ డైరెక్టర్ లేకపోవడం, అర్హత లేని సిబ్బందిని నియమించడం, అధిక శక్తి కలిగిన వైద్య మాత్రలు తప్పుడు వినియోగం, అనధికార వైద్య చికిత్సలు, మరియు లైసెన్స్ పొందిన పారా మెడికల్ సిబ్బందిని నియమించకపోవడం నందున మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా చెంగిచెర్లలోని భవిష్యా వెల్ విషర్ హాస్పిటల్ పై తీవ్రమైన చర్యలు తీసుకున్నట్లుగా వారు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డా. సి ఉమా గౌరీ ,క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డా. గీతా, మరియు అసిస్టెంట్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డా. వినోద్ పాటు రెవిన్యూశాఖ , పోలీసు అధికారుల సమక్షంలో యి రోజు హాస్పిటల్ లోని అనేక నియమ ఉల్లంఘనలు గుర్తించారు. ఈ ఉల్లంఘనల ఆధారంగా, జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు తక్షణ చర్యలు తీసుకోవడం జరిగినట్లుగా మరొక పక్కన ఉంటే తెలిపారు. ఆసుపత్రి యాజమాన్యానికి రూ. 5,00,000 జరిమానా విధించబడింది, అదనంగా, హాస్పిటల్ రిజిస్ట్రేషన్ 60 రోజులపాటు తాత్కాలికంగా సస్పెండ్ చేయబడింది. అలాగే, హాస్పిటల్ మేనేజ్మెంట్ పై క్రిమినల్ కేసులు నమోదు చేసందుకు ఆదేశాలు. హాస్పిటల్ ప్రాంగణాన్ని తక్షణమే స్వాధీనం చేసుకుని, అనధికార వైద్య పద్ధతులు కొనసాగించకుండా అన్ని వైద్య పరికరాలు మరియు డయగ్నోస్టిక్ ఉపకరణాలు జప్తు చేయడం జరిగిందని ఓ ప్రకటనలో తెలిపారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో వృద్ధురాలు మృతి

శామీర్ పేట, (గరుడ వార్త) : ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో వృద్ధురాలు మృతి చెందిన సంఘటన శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీ సులు తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట జిల్లా, ములుగు మండలం, లక్ష్మక్క పల్లి గ్రామానికి చెందిన శిరబోయిన శివమ్మ (70) అనే వృద్ధురాలు బుధవారం శామీర్ పేట బస్ స్టాప్ లో బస్సు ఎక్కడానికి వస్తుండగా నగరం నుంచి దుబ్బాక వెళ్లే ఆర్టీసీ బస్సు శివమ్మను ఢీ కొట్టింది. దీంతో శివమ్మకు తీవ్ర గాయాలయి అక్కడికక్కడే మృతి చెందింది.

ఈ విషయం తెలిసిన పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని శివమ్మను పరిశీలించారు. శివమ్మ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించిన పోలీసులు మృతదేహానికి పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శామీర్ పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పొలం బాటల ప్రగతి అంతంతే!



పెద్దపల్లి : పల్లెల్లో వ్యవసాయ క్షేత్రాల వద్దకు వెళ్లడానికి దారులు సరిగ్గా లేక ఎరువులు, విత్తన బస్తాలు తరలించేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వారి కష్టాలు తీర్చేందుకు మూడు నెలల కిందట ఉపాధిహామీలో చేపట్టిన 'పొలం బాట'ల నిర్మాణానికి గ్రహణం వీడటం లేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియడానికి మరో 30 రోజుల సమయమే ఉండగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. యాసంగి పంటల సాగు పనులు రహదారి నిర్మాణానికి ఆటంకాలు ఎదురవుతున్నాయంటూ అధికారులు సాకులు చెబుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో పనులు చేసేందుకు అవకాశాలున్నా శ్రద్ధ చూపడం లేదన్న ఆరోపణలున్నాయి.

**రూ.1.70 కోట్ల కేటాయింపు**

పొలాల వద్దకు వెళ్లే దారులు ఇరుగ్గా ఉండటంతో బస్తాలు మోసుకొని రాకపోకలు సాగించే సమయంలో రైతులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఎరువులు తరలించేందుకు అదనపు కూలీల ఖర్చు భరించాల్సి వస్తోంది. ఇలాంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు 'పొలం బాట'లో జిల్లావ్యాప్తంగా రూ.1.70 కోట్లతో 63 పనులను ప్రతిపాదించగా 50 చోట్ల నిధులు కేటాయించారు. కాలి బాటలను ఫార్మేషన్ రోడ్లుగా మార్చడం, మొరం చల్లే పనులకు ప్రతిపాదనలు రూపొందించారు. ప్రతి నియోజకవర్గానికి 20 కి.మీ. చొప్పున రహదారులు నిర్మించాలని మొదట భావించినా జిల్లాలో అనువైన ప్రాంతాలను గుర్తించి నిధులు మంజూరు చేశారు.

**హద్దులు చూపక జాప్యం**

పొలాలకు వెళ్లే అధికారిక దారులను పక్కనున్న రైతులు సాగు చేస్తుండటంతో ఆక్రమణకు గురవుతున్నాయి.

ప్రస్తుత దారులు ఇరుగ్గా ఉండటంతో రాకపోకలకు రైతులు అవస్థలు పడుతున్నారు. రహదారి స్థలాలను పొలాలుగా మార్చడంతో పనులు చేయడం కష్ట సాధ్యమవుతోంది. రెవెన్యూ అధికారులు హద్దులు చూపకపోవడంతో పనుల్లో జాప్యం జరుగుతోంది.

పూర్వం నుంచి ఉన్న దారులే అయినా పలు చోట్ల పనులు చేయడానికి పక్కనున్న రైతులు అభ్యంతరం చెబుతున్నారు.


**గడువులోగా సాధ్యమేనా!**

జిల్లాలోని 266 పంచాయతీల్లో మొత్తం 63 పనులను ప్రతిపాదించగా ఆమోదం లభించింది. మూడు నెలల కిందట పనులు ప్రారంభించినా పురోగతి అంతగా లేదు. ఇప్పటివరకు కేవలం 50 చోట్ల మాత్రమే ప్రారంభించారు. ధర్మారం మండలంలో 10 పనులు గుర్తించగా అదనంగా 14 చోట్ల పనులు చేస్తున్నారు. జూలపల్లిలో 7, ఎలిగేడులో 6, శ్రీరాంపూర్‌లో 5, సుల్తానాబాద్‌లో 9, కమాన్‌పూర్‌లో 2 చొప్పున పనులు ప్రారంభించగా మిగిలిన ఏడు మండలాల్లో ఒక పని మాత్రమే ప్రారంభించారు. మార్చి గడువు ముంచుకొస్తుండటంతో ప్రగతిపై నీలినీడలు కమ్ముకున్నాయి. వరి కోతల తర్వాతే పనులు చేసే అవకాశాలుండటంతో నిధుల వ్యయంపై సందిగ్ధం నెలకొంది.

**వేగం పెంచుతున్నాం**

జిల్లాలో పొలం బాట పనుల్లో ఎదురవుతున్న సమస్యలను గుర్తిస్తూ పరిష్కరిస్తున్నాం. కూలీల భాగస్వామ్యంతో పనుల్లో వేగం పెంచుతున్నాం. గడువులోగా మంజూరైన పనులన్నింటినీ ప్రారంభిస్తాం. త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. –కాళిందిని, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

## ఆన్‌లైన్‌లో దినుసుల వివరాలు




జగిత్యాల : ఇది వరకు చాలామంది వ్యాపారులు రైతుల వద్ద నుంచి కొన్న పంట ఉత్పత్తులను జీరోకింద తరలించేవారు లేదా పంట విలువను తక్కువచేసి చూపేవారు. దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పండటం, అక్రమ నిల్వలకు ఆస్కారం, రైతులను మోసగించేలా ఉన్న ఈ తంతును అరికట్టేలా మార్కెటింగ్‌శాఖ ఈ–పర్మిట్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. నూతన విధానం ప్రకారం వ్యాపారులు రైతుల వద్ద నుంచి దినుసులు కొన్న తరువాత 1 శాతం మార్కెట్ ఫీజు చెల్లిస్తారు. సరకును ఇతర ప్రాంతాలకు తరలించాల్సి వచ్చినపుడు ఆన్‌లైన్ ద్వారా మార్కెటింగ్‌శాఖ వెబ్‌సైట్‌లోకి లాగిన్తై సరకు వివరాలు నమోదు చేయాలి. ఎక్కడ కొన్నది, రైతు నుంచి ఎంత కొన్నది, చెల్లించిన ధర, ఎక్కడికి తరలిస్తున్నది, ఎంత ఎగుమతి చేస్తున్నారనే వివరాలన్నీ నమోదు చేయాలి. రైతు చరవాణి నంబరుతో సహా వివరాలన్నీ అప్‌లోడ్ చేసిన తరువాతనే సరకు ఎగుమతికి ఆన్‌లైన్ అనుమతి వస్తుంది. ప్రతి పర్మిట్‌కు ఒక నంబరు ఆటోమెటిక్‌గా జనరేట్ అవుతుంది. ఈ ఆన్‌లైన్ పర్మిట్ తీసుకొని వాహనాల్లో సరకును తరలిస్తున్నపుడు తనిఖీ అధికారులకు ఆన్‌లైన్‌లో పర్మిట్ నంబరును పరిశీలించినపుడు వివరాలన్నీ కనిపించాలి. ఒకే పర్మిట్‌తో దేశంలో ఎక్కడికైనా సరకులను తరలించే వీలుంటుంది.

మక్కలు, బియ్యం సహా అన్ని పంట ఉత్పత్తుల తరలింపునకు ఈ–పర్మిట్ తప్పనిసరి కానుండటంతో రైతులనుంచి సరకు ఎక్కడికి తరలింది, ఏ ప్రాంతంలో నిల్వచేశారు, గోదాముల్లోని నిల్వలను ఎక్కడికి తీసుకెళ్లారనే వివరాలన్నీ ప్రభుత్వం వద్ద ఉంటాయి కాబట్టి అక్రమ నిల్వలకు అవకాశముండదు. ఈ–పర్మిట్ పద్ధతిని అతిక్రమించిన వ్యాపారులకు అధికారులు భారీగా జరిమానాలు విధించవచ్చు. జిల్లాలో దొడ్డు ధాన్యం మాత్రమే పూర్తిస్థాయిలో ప్రభుత్వం సేకరిస్తుండగా మిగిలిన ఉత్పత్తుల్లో 20–95 శాతం వరకు జీరోగానే తరలటంతో తూకంలో మోసాలు, డబ్బుల ఎగవేత, అక్రమ నిల్వలతో ఉపఉత్పత్తుల ధరలను అమాంతం పెంచటం తదితరాలు చోటు చేసుకుంటున్నాయి. పత్తి, సన్నధాన్యం, నువ్వులు, మక్కలు, అలసందలు, మామిడి, కందులు, పసుపు, పెసలు, మినుము, సోయాబీన్ తదితర చాలా ఉత్పత్తుల క్రయవిక్రయాల్లో ఇకపై ఈ–పర్మిట్ విధానాన్ని అమలు చేయటం, గ్రామాల్లో జీరో కొనుగోళ్లను అరికట్టడం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత సీజన్‌లో ఈ–పర్మిట్ విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలి. దీనిపై ఏఎంసీ కార్యదర్శి టి.రాజశేఖర్ వివరిస్తూ ఇప్పటికే ఈ చలానాను అమలు చేస్తుండగా పరిశీలన పూర్తయిన కొన్నింటికి ఈ–పర్మిట్లు జారీ అవుతున్నాయన్నారు. మున్ముందు అన్నిరకాల ఉత్పత్తులు ఈ–పర్మిట్ ద్వారానే తరలించేలా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.

## మసక బారిన హెచ్ఎండీఏ విజి'లెన్స్'

హైదరాబాద్: శివారు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు పెద్దఎత్తున అక్రమ భవంతులకు అడ్డాగా మారుతున్నాయి. భూముల ధరలకు రెక్కలు రావడం, నివాస, వాణిజ్య భవనాల అద్దెలు భారీగా పెరగడంతో చాలామంది ఉన్న తక్కువ స్థలంలోనే బహుళ అంతస్తులు నిర్మిస్తున్నారు. దీంతో పెద్దఎత్తున అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. వాస్తవానికి మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు 1000 చ.మీ. విస్తీర్ణంలో జీ౦5 వరకు అనుమతులు ఇచ్చేందుకు అధికారం ఉంది. అయితే స్థానిక అధికారుల అండదండలతో కొందరు మరో 3 అంతస్తులు అదనంగా, అక్రమంగా నిర్మిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో 200 చ.మీ. విస్తీర్ణంలోనూ 5 అంతస్తుల భవనాలు చేపడుతున్నారు. అందుకు ప్రతిఫలంగా స్థానిక యంత్రాంగానికి భారీగా ముడుతోంది. దీంతో ఏటా రూ.కోట్లల్లో హెచ్ఎండీఏ ఆదాయానికి గండిపడుతోంది. అనుమతులు ఇతరత్రా ఫీజుల ద్వారా హెచ్ఎండీఏకు నెలకు రూ.100 కోట్ల వరకు సమకూరుతుండగా.. అక్రమ నిర్మాణాలతో రూ.50–60 కోట్లు ఆదాయం కోల్పోతోంది.

**ఎక్కడెక్కడంటే..**శంషాబాద్, బోడుప్పల్, బడంగ్‌పేట్, మీర్‌పేట్, జవహర్‌నగర్, ప్రగతినగర్, బండ్లగూడ జాగీర్ తదితర పురపాలికల్లో భారీఎత్తున అక్రమాలు జరుగుతున్నట్లు ఇప్పటికే హెచ్ఎండీఏ





గుర్తించింది. గతంలో ఆయా ప్రాంతాల్లో 600 అక్రమ భవనాలున్నట్లు తేల్చగా వాటిలో 200 పది అంతస్తుల వరకు ఉన్నాయి. వీటిని అధికారులు పాక్షికంగా కూలగొట్టి వదిలేశారు. దీంతో వాటికి యజమానులు మరమ్మతులు చేయించి విక్రయించినట్లు తెలుస్తోంది. మరికొందరు ఇప్పటికే వాటిని వ్యాపార, వాణిజ్య సంస్థలకు అద్దెకు ఇచ్చారు. అక్రమ నిర్మాణాలకు ఊతమిచ్చిన అధికారులపై ఎలాంటి చర్యలు లేకపోవడంతో దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది.

**తెలిసినా ఫిర్యాదులేవీ?**

హెచ్ఎండీఏలో ఓ డీసీపీ స్థాయి అధికారి ఆధ్వర్యంలో విజిలెన్స్ విభాగం పనిచేస్తోంది. ఓ సీఐ, ఎస్ఐ కానిస్టేబుళ్లు, హోంగార్డుల ఆధ్వర్యంలో గతంలో విజిలెన్స్ వింగ్ ఏర్పాటు చేశారు. జీహెచ్ఎంసీ, జలమండలి మాదిరిగా హెచ్ఎండీఏ విజిలెన్స్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం లేకపోవడంతో స్వయంగా నిర్ణయాలు తీసుకోలేని పరిస్థితి. అక్రమ నిర్మాణాలు గుర్తించినా వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాలతో ముందుకు వెళ్లాల్సి ఉంటుంది. ఎక్కడికక్కడ కొందరు అధికారులు ఈ అక్రమాల్లో భాగస్వాములు కావడంతో అక్రమ భవనాల గురించి సమాచారం అందించినా ప్రయోజనం లేదు. విజిలెన్స్ విభాగంలో కొంతకాలంగా సీఐ పోస్టు ఖాళీగానే ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కల్పించుకొని అక్రమ భవనాలపై కొరడా ఝళిపించాల్సిన అవసరం ఉంది.

## సమాఖ్య స్ఫూర్తి.. స్వశక్తి కీర్తి

గంగాధర : స్వశక్తి ఉద్యమంలో మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నా రు. పొదుపు మంత్రంతో బ్యాంకుల నుంచి రుణాలు పొంది కుటుంబాలను చక్కదిద్దుకుంటున్నారు. పిల్లలకు ఉన్నత చదువులు చెప్పిస్తూ నిలదొక్కుకునేలా జాగ్రత్త పడుతున్నారు. నెలనెలా ఆదాయ మార్గాలు అభివృద్ధి చేసుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. గంగాధర మండలంలో గతేడాది 491 సంఘాలకు రూ.57.78 కోట్ల రుణాలు బ్యాంకులు మంజూ రు చేశాయి. ఆయా సంఘాలకు 548 యూనిట్లు కేటాయించి స్వశక్తిపై ఎదిగేలా చర్యలు తీసుకుంటున్నారు. స్వశక్తిపై రాణించి కుటుంబాలకు అండగా ఉంటున్న పలువురి విజయగాథపై



స్ఫూర్తిదాయక కథనం.

**ఏడాదిన్నరగా చేతినిండా పని**

గంగాధరకు చెందిన మెరుగు గంగాభవానీ, అమిరిశెట్టి విజయ, తాళ్ల నిర్మల మండల కేంద్రంలో ఏడాదిన్నరగా ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. రూ.1.50 లక్షలు బ్యాంకు ద్వారా రుణం పొందారు. ఆర్డరుపై పిండి వంటలు తయారు చేసి ఇతర ప్రదేశాలకు పంపిస్తున్నారు. ఖర్చులు పోగా రోజుకు రూ.1000 మిగులుతున్నాయని, సొంత పనులు చేసుకుంటున్నామని సభ్యులు తెలిపారు.

**లేడీస్ ఎంపోరియం, కంప్యూటర్ మగ్గం వర్క్**

ర్యాలపల్లికి చెందిన బొజ్జ స్వాతి గంగాధరలో లేడీస్ ఎంపోరియం, కంప్యూటర్ మగ్గం వర్క్ యూనిట్‌తో నెలకు రూ.30 వేలు సంపాదిస్తున్నా రు. బ్యాంకు ద్వారా రెండు విడతల్లో రూ.3.05 లక్షల రుణం పొందారు. నెలకు రూ.7 వేల చొప్పున బ్యాంకుకు చెల్లిస్తూ రుణం తీరుస్తుండగా కుటుంబ ఖర్చులు పోను నెలకు రూ.15 వేలు పొదుపు చేస్తున్నారు. 1998 నుంచి సంఘంలో పొదుపు చేస్తూ పిల్లలను చదివిస్తున్నారు.

**ఇతరులకు ఉపాధినిస్తూ..**తాడిజెర్రికి చెందిన గుంటుకు అరుణ కూలీ పనులకు వెళ్లేవారు. 2016లో స్వశక్తి ఉద్యమంలో చేరాక పిల్లల చదువుకు బ్యాంకు ద్వారా రుణం పొందారు. గ్రామైక్య సంఘం ద్వారా రూ.లక్ష, బ్యాంకు లింకేజీ ద్వారా రూ.2 లక్షలు తీసుకొని భర్త శేఖర్‌కు బైక్ మెకానిక్ షాపు ఏర్పాటు చేశారు. ఇందులో మరో ఇద్దరికి ఉపాధి కల్పిస్తున్నారు. బ్యాటరీలు కూడా విక్రయిస్తున్నారు. నెలకు రూ.20 వేల ఆదాయం వస్తోందని అరుణ తెలిపారు.

**కుటుంబానికి అండగా..**

ఉప్పరమల్యాలకు చెందిన శ్రీలత కుటుంబంతో వచ్చి గంగాధరలో కిరాణ దుకాణం నడిపించుకుంటున్నారు. 2020లో రూ.లక్ష రుణం తీసుకొని దుకాణం ప్రారంభించారు. బ్యాంకు రుణం తీర్చి పిండిగిర్ని, కొవ్వొత్తుల తయారీతో వ్యాపారాన్ని విస్తృతం చేశారు. రూ.2 లక్షల రుణం తీసుకొని భర్త లక్ష్మీకాంతంకు ట్రాలీ ఆటో కొనుగోలు చేసి ఇచ్చారు. ఆయిల్ డీలర్‌షిప్ తీసుకొని దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. పిల్లలను చదివించుకుంటూనే స్వశక్తి ద్వారా నెలకు రూ.35 వేలు సంపాదిస్తున్నట్లు శ్రీలత ఆత్మవిశ్వాసం వెలిబుచ్చారు.

# యువత లక్ష్యంగా సైన్స్ రీల్స్

హైదరాబాద్ : సామాజిక మాధ్యమాల్లో ప్రస్తుతం సందడంతా రీల్స్‌దే. వినోదం పంచడమే కాదు.. వ్యాపార ప్రకటనలు, ప్రచారాల వరకు వీటిదే హవా. ప్రభుత్వాల వైఫల్యాలపై వ్యంగ్యాస్త్రాలు, రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలు ఏవైనా రీల్స్‌లోనే. పిల్లలు, కుర్రకారు మొదలు పెద్దల వరకు మొబైల్‌లో వీటి వీక్షణలో గంటల సమయం గడుపుతున్నారు. ఇంతటి జనాదరణ కలిగిన రీల్స్‌ను వినియోగించి సైన్స్‌ను జనంలోకి తీసుకెళ్లేందుకు హైదరాబాద్‌లోని కేంద్ర పరిశోధన సంస్థలు సమాలోచనలు చేస్తున్నాయి.

నగరంలో తార్నాక నుంచి ఉప్పల్ వరకు సైన్స్ కారిడార్‌లో పలు కేంద్ర పరిశోధన సంస్థలు ఉన్నాయి. ఐఐసీటీ, సీసీఎంబీ, ఎన్‌జీఆర్‌ఐ, సర్వే ఆఫ్ ఇండియా, సీడీఎఫ్‌డీ కేంద్రాలు ఇక్కడ ఉన్నాయి. ఇన్నర్‌రింగ్ రోడ్డు మీదుగా చంద్రాయణగుట్ట వరకు వెళ్తే డీఆర్‌డీవో ల్యాబ్‌లు ఉన్నాయి. ప్రజల పన్నులతో నడుస్తున్న ఈ సంస్థలు తమ పరిశోధనల గురించి ముఖ్యమైన వాటిని ఎక్స్‌లో పంచుకుంటున్నాయి. సీసీఎంబీ యూట్యూబ్ సిరీస్‌లు చేస్తోంది. సైన్స్‌పై కొత్తతరంలో ఆసక్తి పెంచడంతో పాటూ తమ చుట్టుపక్కల ఉన్న ప్రయోగశాలల్లో ఏమి చేస్తున్నారనే విషయాలను ప్రజలకు చేరవేసేందుకు సామాజిక మాధ్యమాలను ఉపయోగిస్తున్నారు. కానీ ఇవి చాలా తక్కువ మందికే చేరుతున్నాయి. దీంతో కొన్ని సంస్థలు వినూత్న ఆలోచన చేస్తున్నాయి. సృజనాత్మకంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు..ముఖ్యంగా యువత లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తున్నాయి.

**30 నుంచి 90 సెకన్లలో..**

గంటల తరబడి వీడియోలను చూసే వారి సంఖ్య తక్కువ. అందునా సైన్స్‌పై అంటే ఇంకా తక్కువ. అందుకే రీల్స్ చేసి సామాన్య జనానికి చేరువకావొచ్చన్న ఆలోచనలను పరిశోధన సంస్థలు చేస్తున్నాయి. రీల్స్‌ను 30 సెకన్లలో తీస్తారు. గరిష్ఠంగా 90 సెకన్లకు మించదు.



ఈ తక్కువ సమయంలోనే సూటిగా, సుత్తిలేకుండా పరిశోధనలతో సాధించిన విజయాలను చెప్పాల్సి ఉంటుంది. ఇందుకోసం భారత ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని ఫిల్మ్, టెలివిజన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌టీఐఐ)తో చర్చిస్తున్నామని హైదరాబాద్‌లోని సీడీఎఫ్‌డీ డైరెక్టర్ ఆచార్య ఉల్లాస్ తెలిపారు.

**విజ్ఞాన సమాజం కోసం..**

సైంటిఫిక్ టెంపర్ ఉన్న సమాజం ఉండాలనేది మా ప్రయత్నం. సైన్స్‌లో చాలా ఆవిష్కరణలు సామాన్య మానవులకు చేరడం లేదు. ప్రస్తుతం సైన్స్ లిటరసీ ఒక సవాల్‌గా ఉంది. అక్షరజ్ఞానంతో ఆగిపోకుండా వైజ్ఞానిక అక్షరాస్యతను పెంపొందించాల్సి ఉంది. అప్పుడే రాజ్యాంగంలోని ఆర్టికల్ 51 ఏహెచ్ ప్రకారం సమాజంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం సాధ్యమవుతుంది. ప్రస్తుతం యువత సమాజంలో మూఢనమ్మకాలకు ఎక్కువ బలవుతున్నారు. వీరిలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచేందుకు రీల్స్ ఆలోచన వచ్చింది. ప్రస్తుతం యువత ఎక్కువగా ఇన్‌స్టాలోని రీల్స్ చూస్తున్నారు. తక్కువ నిడివితో రీల్స్ చేశాం. లక్షల సంఖ్యలో చూస్తున్నారు. జనంలోకి తీసుకెళ్లగలిగాం. స్పందన బాగుంది. ఈ తరానికి చేరేందుకు సంప్రదాయపద్ధతుల్లో సాధ్యం కాదు. కొత్త పద్ధతులను అన్వేషించాలి. రీల్స్ అలాంటివే. ఇంకా ఏమైనా ఉంటే కూడా ప్రయత్నించవచ్చు.
రమేశ్, అధ్యక్షుడు, విజ్ఞానదర్శిని

# సేవ ముసుగులో సైబర్ మాయగాళ్ల దందా

హైదరాబాద్ : సైబర్ మాయగాళ్లు ఏ అవకాశాన్ని వదలుకోవట్లేదు. ప్రజల భావోద్వేగాలతో ముడిపడిన ప్రతిదాన్ని సొమ్ము చేసుకుంటున్నారు. పేద పిల్లలకు విద్యా బుద్ధులు, విద్యార్థులకు ఉపకార వేతనాలు, ప్రార్థనామందిరాలకు విరాళాలు, తీవ్ర అనారోగ్యంతో బాధపడేవారికి ఉచిత వైద్య చికిత్సలంటూ సామాజిక మాధ్యమాల ద్వారా ఆకట్టుకుంటున్నారు. సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలనే ఆలోచన ఉన్నవారు ఇది నిజమనే ఉద్దేశంతో స్పందించి డబ్బులు నష్టపోతున్నారు. మరోవైపు విదేశాలకు చెందిన స్వచ్ఛంద సంస్థలు, ప్రముఖ కంపెనీలు, ట్రస్ట్‌లు భారత్‌లో వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధమైందంటూ ఫోన్ నంబర్లకు సందేశాలు, లింక్‌లు పంపుతున్నారు. వాటికి స్పందించిన వారి ఫోన్లను హ్యాక్ చేసి బ్యాంకు ఖాతాల లావాదేవీలు తమ ఆధీనంలోకి తీసుకుంటున్నారు. తొలుత నమ్మకం కలిగించేందుకు రూ.5-10వేలు బాధితుల



ఖాతాల్లో జమ చేస్తున్నారు. పెద్దమొత్తంలో నగదు బదిలీ చేసేందుకు ముందుగా పన్నులు చెల్లించాలంటూ రూ.లక్షలు కొట్టేస్తున్నారు. నెల రోజుల వ్యవధిలో నగర సైబర్‌క్రైమ్ పోలీసులు 5-6 కేసులు నమోదు చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు, సంస్థల పేరిట వచ్చే లింక్‌లు, సేవ, విరాళాల పేరిట వచ్చే ప్రకటనలు నమ్మొద్దని సైబర్‌క్రైమ్ పోలీసులు సూచిస్తున్నారు. మాయగాళ్ల చేతిలో సొమ్ము నష్టపోయిన బాధితులు టోల్‌ఫ్రీ నం.1930కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

**సాయం పేరుతో మోసం**విదేశాల్లో ఉన్న తమ వర్గానికి చెందిన ప్రజలకు సాయం చేయాలంటూ సామాజిక మాధ్యమాల్లో పోస్టు ఒక యువకుడిని ఆకట్టుకుంది. అవతలి వారిని యాప్ ద్వారా సంప్రదించి వివరాలు సేకరించాడు. మిత్రుల సహకారంతో నిధులు సేకరించి వారు సూచించిన బ్యాంకు ఖాతాలో జమచేశాడు. ఆ తరువాత వాస్తవం తెలియటంతో మోసపోయినట్టు గ్రహించాడు. పాతబస్తీకి చెందిన ఒక వ్యక్తి ఫోన్‌కు వచ్చిన లింక్‌ను క్లిక్ చేశాడు. ప్రార్థనామందిరం నిర్మాణానికి తాము సాయం చేస్తామని మాయగాళ్లు చెప్పటంతో నిజమని భావించాడు. బ్యాంకు ఖాతా వివరాలు పరిశీలించేందుకు కొంత నగదు జమచేయాలంటూ దఫాలవారీగా రూ.1.50లక్షలు కొట్టేశారు. అనంతరం ముఖం చాటేయటంతో నగర సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

# వరికి తెగులు.. అన్నదాతల్లో గుబులు



ఎల్లారెడ్డిపేట: మెట్ట ప్రాంతమైన జిల్లాలో అన్నదాతలకు గడ్డు పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఓ వైపు సాగునీటి కొరత నెలకొనగా మరోవైపు వరిపంటకు తెగుళ్లు సోకుతుండటంతో దిగులు చెందుతున్నారు. కాండం తొలుచు(మొగి) పురుగుతో ఇప్పటికే పైరు తెలుపురంగులోకి మారుతుండగా అగ్గితెగులు విజృంభిస్తోంది. తెగుళ్ల నివారణకు క్రిమిసంహారక మందులను పిచికారీ చేస్తుండటంతో అదనంగా పెట్టుబడి వ్యయమవుతోంది. కాండం తొలుచు పురుగు నారు దశలో వరిపై చేరి, కంకి ఏర్పడే దశలో బయటపడుతుంది. పంటచేతికందే దశలో గింజలు తాలు పోతున్నాయి. ఈ ప్రభావం జిల్లా వ్యాప్తంగా నెలకొంది. అగ్గితెగులు వల్ల తొలుత ఆకులపై ఎర్రటి మచ్చలేర్పడుతున్నాయి. క్రమేణా కండె ఆకారంలో పెద్దగా మారడం వల్ల ఆకులు ఎండిపోతున్నాయి. ఈ కారణంగా వరిగొల పూర్తిగా విరిగిపోయి, నేలరాలిపోతుంది. వీటితోపాటు గింజ దశలో కంకినల్లి పురుగు ఆశిస్తోంది. గింజల నుంచి రసం పీల్చడం వల్ల గింజలు తాలుపోతున్నాయి.

**అన్నదాతలకు నష్టం** ఈ యాసంగిలో జిల్లాలో 1,78,350 ఎకరాల్లో వరి సాగు చేశారు. సన్నరకాలను 17,505 ఎకరాల్లో, దొడ్డు రకాలను 1,60,845 ఎకరాల్లో సాగుచేశారు. మొత్తం కలుపుకొని 4,38,872 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. జిల్లాలోని ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, గంభీరావుపేట, కోనరావుపేట, ఇల్లంతకుంట, ముస్తాబాద్ తదితర మండలాల్లో తెగుళ్ల ప్రభావం తీవ్రంగా ఉన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

**పెట్టుబడి చేతికందని పరిస్థితి**

ఈ యాసంగిలో ఏడెకరాల విస్తీర్ణంలో దొడ్డు రకం వరి సాగుచేశాను. పంటమొత్తం ఈని, గింజలు గట్టిపడే దశకు చేరుకుంది. దాదాపు 40 శాతానికి పైగా పైరు తాలుపోయి, తెలుపురంగులోకి మారిపోయింది. రెండుమూడు సార్లు పురుగు మందులను పిచికారీ చేసినా ఎలాంటి ఫలితం లేకపోయింది. పెట్టుబడి కూడా చేతికందని పరిస్థితి నెలకొంది. ఇప్పుడు ఎలాంటి రసాయన మందులు వాడినా ప్రభావం ఉండదని అధికారులు అంటున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలి.
అరికాల రామచంద్రం, రైతు, రాచర్ల బొప్పాపూర్

**సస్యరక్షణ చర్యలు పాటిస్తే మేలు**

తెగుళ్ల నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలి. కంకి బయటకు వచ్చిన తర్వాత ఊసపోవడాన్ని గమనిస్తే క్లోరాంతనిలిప్రోల్ 60 మిల్లీలీటర్ల మందును 200 లీటర్ల నీటికి కలిపి ఎకరానికి పిచికారీ చేయాలి. కార్టాఫ్‌క్లోరైడ్ గుళికలను చల్లుకున్నా సరిపోతుంది. అగ్గితెగులు లక్షణాలు బయటపడితే యూరియా చల్లడం నిలిపివేయాలి. గట్లపై గడ్డిలేకుండా పూర్తిగా పరిశుభ్రపరచాలి. వ్యవసాయ అధికారులను సంప్రదించి తగిన సలహాలు తీసుకోవాలి. కాసం రాజశేఖర్, వ్యవసాయాధికారి, ఎల్లారెడ్డిపేట

# నిధులు రావు.. పనులు పూర్తికావు



సిరిసిల్ల: జిల్లాలో పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న వివిధ రకాల పనులకు అవసరంమేరకు నిధులు రాక, అసంపూర్తిగా మిగిలిపోతున్నాయి. చందుర్తి మండలంలో ఆరోగ్య ఉపకేంద్రం నిర్మాణం పూర్తయింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు అధికారులు, ప్రజాప్రతినిధులు హడావుడిగా ప్రారంభించారు. బిల్లులు చెల్లించకుండా ఆరోగ్యకేంద్రం వినియోగిస్తుండటంతో ఇటీవల గుత్తేదారులు దానికి తాళం వేసే ప్రయత్నం చేశారు. గ్రామస్థులు నచ్చజెప్పడంతో వెనక్కితగ్గారు. వీర్నపల్లి మండల కేంద్రంలో ఎస్సీ సామాజిక భవన నిర్మాణం అసంపూర్తిగా వదిలేశారు.

**సామాజిక భవనాలే అధికం** జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు డీఎంఎఫ్‌టీ, ఎన్‌హెచ్‌ఎం, సంక్షేమశాఖలు, ఎంపీల్యాడ్స్‌లో సామాజిక భవనాల నిర్మాణాలకు నిధులు కేటాయించారు. ఆయా పనులకు ప్రొసీడింగ్స్ సైతం ఇచ్చారు. వీటిలో ఎన్‌హెచ్‌ఎం (జాతీయ ఆరోగ్యమిషన్ పథకం)లో ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణాలు చేపట్టారు. ఇందులో ఎనిమిది చోట్ల దాదాపు పనులు పూర్తయ్యాయి. మరో నాలుగు గ్రామాల్లో కొద్దిమేరకు పనులు మాత్రమే మిగిలాయి. అద్దెభవనాల్లో కొనసాగుతున్న గ్రామాల్లో పనులు పూర్తయిన చోట ఉపకేంద్రాల్లోకి వెళ్లి.. ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నారు. వీటిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఒక్కో ఆరోగ్య కేంద్రానికి రూ.16 లక్షలతో పనులు చేపట్టారు. వీటిలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఎన్‌హెచ్‌ఎంకు జమచేసినట్లు గుత్తేదారులు చెబుతున్నారు. కాగా అధికారులు మాత్రం నిధులు విడుదల కాలేదంటూ కాలం వెళ్లదీస్తున్నారని వాపోతున్నారు.

**ప్రతిపాదనల దశలోనే**వర్షాలకు దెబ్బతిన్న గ్రామీణ రహదారుల మరమ్మతుకు డీఎంఎఫ్‌టీ కింద వీర్నపల్లి, గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట మండలాల్లో ఏడు పనులకు రూ.3.99 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. ఇందులో చేసిన పనులకు రూ.43.07 లక్షలు మంజూరు కావాల్సి ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల వసతి కల్పించేందుకు వివిధ మండలాల్లో 36 నిర్మాణాలకు రూ.72 లక్షలు మంజూరయ్యాయి. అలాగే 50 అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.4 కోట్లు, ఎనిమిది పంచాయతీ భవనాలకు రూ.1.60 కోట్లు మంజూరయ్యాయి. ఆరు చోట్ల అంగన్‌వాడీ కేంద్రాల పనులు నామమాత్రంగా ప్రారంభించారు. మిగతా పనులకు గుత్తేదారులు ముందుకు రాకపోవడం గమనార్హం. బిల్లుల విడుదలపై పీఆర్ ఈఈ సుదర్శన్‌ను 'ఈనాడు' సంప్రదించగా పనులు పూర్తయిన వాటికి రికార్డులు పూర్తిచేసి ప్రభుత్వానికి పంపామన్నారు.

# చీకట్లో సౌర.. బిల్లు పెరిగి బేరా!



సిద్దిపేట: 'ఏంది రామయ్యా.. దిగులుగా ఉన్నవు?' 'ఏం లేదే లక్ష్మయ్యా.. గతంలో మా ఇంటికి కరెంటు బిల్లు రూ.100 నుంచి రూ.150 వచ్చేదే. ఇప్పుడు రూ.300 నుంచి ఒక్కోసారి రూ.700 వస్తోందే.' 'నాక్కూడా కరెంటు బిల్లు గట్లనే ఎక్కువొస్తున్నదే. సోలార్ ప్లేట్లు బాగా పనిచేసిన కాలంలో బిల్లు తక్కువొచ్చేది' 'అవును కదనే. ఆ సోలార్ ప్లేట్లు ఖరాబాయె. రిపేర్ చేసేటందుకు ఎవరూ పట్టించుకోకపాయె. మరమ్మతు చేస్తే మనకు.. ఊరికి మంచిగుండేది' ... ఇలా నారాయణరావుపేట మండలం బంజేరుపల్లిలో గ్రామస్థుల ఆవేదన.

**రెండేళ్లుగా పనిచేయని తీరు**

రెండేళ్లుగా నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో గ్రామంలోని దాదాపు ప్రతి ఇంటికి అమర్చిన సౌర ఫలకలు పనిచేయడం లేదు. మరమ్మతులకు గురవడంతో వినియోగంలో లేవు. పెరిగిన విద్యుత్తు బిల్లులతో సతమతమవుతున్నారు. కొందరికి మాత్రమే 200 యూనిట్ల లోపు కరెంటు కాల్చిన వారికి గృహజ్యోతి కింద ఉచితంగా వర్తిస్తోంది. ఈ గ్రామ ప్రజలంతా ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. 2017లో అప్పటి మంత్రి తన్నీరు హరీశ్‌రావు గ్రామంలో సౌర ఫలకలు ఏర్పాటు చేయించారు. ఆరు సంవత్సరాల తర్వాత వివిధ కారణాలతో పని చేయడం మానేశాయి. నాడు తక్కువ విద్యుత్తు బిల్లులు వచ్చేవి. జిల్లా కేంద్రానికి 20 కిలో మీటర్ల దూరంలో నారాయణరావుపేట మండలం బంజేరుపల్లి గ్రామం ఉంది. సహజ వనరు అయిన సూర్యకాంతి వినియోగంతో విద్యుత్తు ఉత్పత్తితో ఇంటి అవసరాలకు విద్యుత్తు వినియోగించుకోవడానికి గ్రామస్థులంతా ఒక్కటై సౌర ఫలకలు ఏర్పాటు చేయించుకున్నారు. ఆన్‌డోమెడ్, టాటా కంపెనీ సహకారంతో నాడు బిగించారు. సౌర వెలుగుతో ఉత్పత్తి అయిన విద్యుత్తును చక్కగా ఇంటి అవసరాలకు వినియోగించుకునేవారు.

పునరుద్ధరిస్తే మేలు: చందు, గ్రామస్థుడు

గ్రామంలో ఏర్పాటు చేసిన సోలార్ ఫలకలు నిర్వహణ లేకపోవడంతో పని చేయడం లేదు. ప్రభుత్వం మరమ్మతు చేపట్టి అందుబాటులోకి తీసుకువస్తే ప్రజలకు ఎంతో ఉపయోగం. వాటిని వినియోగించుకున్న సమయంలో తక్కువ విద్యుత్తు వినియోగించుకునే వాళ్లం. ప్రస్తుతం అవి పని చేయక పోవడంతో విద్యుత్తు యూనిట్ల వినియోగం పెరిగింది. ఖర్చు పెరిగింది.

బంజేరుపల్లి జనాభా: 600
గ్రామంలో గృహ విద్యుత్తు కనెక్షన్లు: 118
ప్రస్తుతం యూనిట్ల వినియోగం: 9285
ఊరంతా బిల్లు మొత్తం (రూ.లో): 40,000
సౌర ఫలకలు ఉన్న ఇళ్లు: 100
పని చేసిన సంవత్సరాలు: 6

# నేతన్న ఆదాయం ఆర్జించేలా..

దుబ్బాక: ప్రస్తుతం చేనేత రంగంలోనూ ఎన్నో మార్పులు సంతరించుకున్నాయి. అధునాతన యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. విభిన్నమైన చేనేత వస్త్రాలకు డిమాండ్ పెరిగింది. అందులోనూ పోచంపల్లి ఇక్కత్ కాటన్ చీరలు అంటే ప్రపంచవ్యాప్తంగా అత్యధికులు ఇష్టపడుతున్నారు. దీన్ని అందిపుచ్చుకొని వీటిని తయారుచేసి దుబ్బాక నేత కార్మికులు ఆదాయం ఆర్జించేలా తెలంగాణ రాష్ట్ర చేనేత సహకార సంఘం (టెస్కో) కార్యాచరణ రూపొందించి అడుగేయడం విశేషం.

**ముడి సరకు ఇచ్చి..**

దుబ్బాక చేనేత సొసైటీలో 1734 మంది కార్మికులు సభ్యులుగా ఉన్నారు. ప్రస్తుతం 50 మంది మాత్రమే 40 మగ్గాలపై వస్త్రాలు నేస్తూ ఉపాధి పొందుతున్నారు. ఈ తరుణంలో వీరిని మరింత ప్రోత్సహించేందుకు టెస్కో ఆదేశాలతో తక్కువ బరువు, మృదువుగా ఉండే పోచంపల్లి ఇక్కత్ కాటన్ చీరలు నేయిస్తున్నారు. నెల రోజుల కిందట ఈ ప్రక్రియ మొదలవవగా, టెస్కో కావాల్సిన ముడి సరకును అందించడంతో పాటు నేసిన చీరలను సైతం కొనుగోలు చేసి విక్రయిస్తోంది. సంప్రదాయ టై అండ్ డై టెక్నిక్‌ను ఉపయోగించి, పేక (అడ్డు-వెఫ్ట్) 80 సింగిల్, వార్ప్ (నిలువు) 120 డబుల్ పద్ధతిలో వీటిని



రూపొందిస్తున్నారు. ఇందుకు వినియోగించే నూలు దారాలకు రంగు వేసే ప్రకియనూ చేపడుతున్నారు.

**రెండు రోజుల సమయం..**

ప్రస్తుతం ఒకే మగ్గంపై సాధారణ డిజైన్లలో ఇక్కత్ చీరలను ఇద్దరు కార్మికులు నేస్తున్నారు. ఒక చీర తయారీకి రెండు రోజుల సమయం పడుతోంది. ఇందుకు వారికి రూ.800, దారాలను కండెలపై చుట్టిన వారికి రూ.100 కూలీగా చెల్లిస్తున్నారు. ఇప్పటి వరకు వివిధ డిజైన్లలో 15 చీరలను తయారుచేశారు. కూలీ ఖర్చులు రూ.900, ముడి దారాలకు రూ.1000 ఖర్చవుతోంది.

**తువాళ్లను తయారు చేస్తాం**

నేత కార్మికులు ఆదాయం ఆర్జించేందుకు టెస్కో ఆదేశాలతో పోచంపల్లి ఇక్కత్ మస్‌రేస్డ్ కాటన్ చీరలను నేయిస్తున్నాం. వచ్చే ఆర్డర్లను వీటి తయారీకి ఏర్పాట్లు చేస్తున్నాం. రానున్న రోజుల్లో ఇక్కత్ కాటన్ తువాళ్లను సైతం తయారుచేయనున్నాం. జి.భాస్కర్, సొసైటీ బాధ్యుడు

# అంగన్వాడీ కేంద్రం.. ఆరోగ్య భాగ్యం

నర్సాపూర్: చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఈ నేపథ్యంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రాల్లో సేంద్రియ విధానంలో పెరటితోటల పెంపకం చేపట్టారు. జిల్లాలోనే నర్సాపూర్ ప్రాజెక్టు ఈ విషయంలో స్ఫూర్తిగా నిలుస్తోంది. ప్రాజెక్టు పరిధిలో నర్సాపూర్, శివ్వంపేట, కౌడిపల్లి, చిలప్‌చెడ్, తూప్రాన్, మనోహరాబాద్ మండలాలున్నాయి. వీటి పరిధిలో 288 అంగన్వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. 80 శాతం కేంద్రాల్లో వివిధ ఆకు కూరలు పెంచుతున్నారు. పక్కా భవనాలు, విశాలమైన ఆవరణ ఉన్న చోట ఈ ప్రక్రియ చక్కగా కొనసాగిస్తున్నారు. ఎక్కడ ఖాళీ స్థలం కనిపించినా, ఆకు కూరలు, పండ్ల మొక్కలు నాటేస్తున్నారు. స్థలం లేనివారు చిన్ననీటి తొట్లు, కుండీలు, బకెట్లు, పగిలిపోయిన బిందెల్లో పెంచుతున్నారు. టీచర్లు, ఆయాలు సంరక్షణ చర్యలు చేపడుతున్నారు.

**ఉచిత విత్తనాలు**

పాలకూర, మెంతి, గోంగూర, బచ్చలి, చామ, కరివేపాకు వంటి వివిధ రకాలైన ఆకు కూరలు పండిస్తున్నారు. జిల్లాలో దక్కన్ సొసైటీ, కృషి విజ్ఞాన కేంద్రం(తునికి) విత్తనాలను ఉచితంగా అందజేస్తున్నాయి. ప్రాజెక్టు పరిధి అంగన్వాడీ టీచర్లకు తోటల పెంపకంపై అవగాహన కల్పించారు. ఆరు నెలలకోసారి అయిదు కేంద్రాలను ఎంపిక చేసుకుని తోటల పెంపకం చేపడుతూ పౌష్టికాహారం అందిస్తున్నారు. జామ, బొప్పాయి, దానిమ్మ, గుమ్మడి వంటి పండ్ల మొక్కలను సంరక్షిస్తూ కేంద్రాలకు వచ్చే వారికి పంపిణీ చేస్తున్నారు. సీడీపీవో పర్యవేక్షణలో 11 మంది పర్యవేక్షకులు కేంద్రాలను సందర్శిస్తూ పెంపకం దారులను



ప్రోత్సహిస్తున్నారు.

**ఈ కేంద్రాలు ఆదర్శం**

నర్సాపూర్ మండలం కాగజ్‌మద్దూర్, రెడ్డిపల్లి తదితర గ్రామాలు, కౌడిపల్లి ఉమ్మడి మండలంలో జగ్గంపేట, కొత్త చెరువు తండా, కౌడిపల్లి-4, శివ్వంపేట మండలం దొంతి, లింగోజిగూడ, చెన్నాపూర్, పిల్లుట్ల, తూప్రాన్ ఉమ్మడి మండలంలో కాళ్లకల్, అగ్రహారం, లింగారెడ్డిపేట, పోతురాజ్‌పల్లి తదితర కేంద్రాలు. కొన్ని కేంద్రాలకు కంచెను ఏర్పాటు చేయగా, మరికొన్ని చోట్ల గేట్లను అమర్చారు. కొందరు ఒకేచోట తోటల సాగు చేపడుతున్నారు. సేంద్రియ ఎరువులు వాడి, పౌష్టికాహారం అందించడంతో వచ్చేవారి సంఖ్య పెరిగిందని, తద్వారా లోపపోషణను అధిగమించగలుగుతున్నామని అధికారులు చెబుతున్నారు.

**పోషకాహార లోపాన్ని అధిగమిస్తున్నాం**చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు పెరటి తోటల పెంపం ఎంతగానో దోహదపడుతోంది. మూడునెలల పాటు ఆకుకూరలు, పండ్లు, రాగి జావ వంటివి ఇస్తే చిన్నారుల ఎదుగుదలలో కొంత మార్పు కనిపిస్తోంది. జిల్లాలోనే ప్రాజెక్టు పరిధిలో తోటల పెంపకంలో ఆదర్శంగా నిలవడం ఆనందంగా ఉంది. హేమాభార్గవి, సీడీపీవో

# సాగునీటి అవసరాలకు ఎల్లంపల్లి జలాలు

ధర్మారం : శ్రీపాద ఎల్లంపల్లి జలాశయం నీటిని జిల్లా సాగు అవసరాలకు వాడుకునేందుకు ప్రభుత్వం అనుమతించింది. స్థానిక సాగునీటి అవసరాల కోసం ఎల్లంపల్లి జలాలను వినియోగించు కోవడం ఇదే మొదటిసారి. రాష్ట్ర పరిశ్రమలు, ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చొరవతో ఎల్లంపల్లి నీటిని వరద కాలువలోకి చేర్చి.. అక్కడి నుంచి పంటపొలాలకు తరలించేందుకు ప్రభుత్వం అనుమతి చింది. ప్రభుత్వ ఆదేశాలతో శనివారం ఉదయం 8 గంటలకు నందిమేడారం పంపుహౌస్‌లో ఒక మోటారును ఆన్‌చేసి నందిమేడారం జలాశయంలోకి 3,150 క్యూసెక్కులను తరలిస్తున్నారు. రాత్రి 8 గంటలకు రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రి పంపుహౌస్ లోనూ ఒక మోటారును ఆన్‌చేసి 3,150 క్యూసెక్కుల చొప్పున వరద కాలువలోకి ఎత్తిపోస్తున్నారు. వరద కాలువ నుంచి మధ్యమానేరు జలాశయం వైపునకు జలాలు వెళ్లకుండా గేట్లను మూసివేసి కాలువలో నిలువ చేస్తున్నారు. వరదకాలువకు మల్యాల మండలం ర్యాలపల్లి వద్ద నున్న లింక్ కాలువ ద్వారా ఈ జలాలను కాకతీయ కాలువలోకి చేర్చి పెద్దపల్లి జిల్లాలోని పంట పొలాలకు మళ్లిస్తున్నారు.



**ప్రభుత్వ చర్యలతో మేలు**

ఎస్సారెస్పీ నుంచి చొప్పదండి మండలం రేవెల్ల వరకు కాకతీయ కాలువలో కనీసం 3,300 క్యూసెక్కుల ప్రవాహం ఉంటేనే పెద్దపల్లి, మంథని నియోజకవర్గాలకు సాగునీరందుతుంది కానీ.. కేవలం 2,200 క్యూసెక్కులు మాత్రమే వస్తున్నాయి. ఎస్సారెస్పీ అధికారులు ఇదివరకే ప్రకటించిన వారబంధీ షెడ్యూలు ప్రకారం ఏప్రిల్ 2 వరకు చివరి తడి అందించాల్సి ఉంది. కాకతీయ కాలువలో నీటి ప్రవాహం తక్కువగా ఉండటంతో చివరి వరకూ అందించలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో పొలాలు ఎండుతాయనే ఆలోచనతో ప్రత్యామ్నాయంగా ఉన్న ఎల్లంపల్లి జలాశయం నుంచి అర టీఎంసీ తరలింపునకు చర్యలు తీసుకున్నారు. ఎల్లంపల్లిలో 10.03 టీఎంసీల నీటి నిలువ ఉంది. సోమవారం ఉదయం 8 గంటలకు నంది, గాయత్రి పంపుహౌస్‌లలో మోటార్లను నిలిపివేయనున్నారు. ధర్మారం, వెల్గటూరు మండలాల తాగునీటి అవసరాల కోసం జూన్ 30 వరకు సరిపడా 228 మీటర్ల నీటిమట్టం ఉండేలా నిలువ ఉంచనున్నట్లు నీటిపారుదలశాఖ డీఈఈ విష్ణుప్రసాద్ తెలిపారు.

# ఉత్సవ ఏర్పాట్లలో జాప్యం

మల్యాల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో మరో రెండు వారాల్లో నిర్వహించనున్న హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాల ఏర్పాట్లు ఇప్పటికీ పూర్తికాలేదు. ఉత్సవాలకు పొరుగు రాష్ట్రాలతోపాటు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 4 లక్షల వరకు దీక్షాపరులు తరలివస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ పరిసరాల్లో తడిసిల పందిళ్ల నిర్మాణం చేయాల్సి ఉన్నప్పటికీ ఇప్పటి వరకు పూర్తికాలేదు. ఆలయం ముందుభాగంలో పందిళ్ల నిర్మాణం చేపట్టినప్ప టికీ వెనక భాగంలో పందిళ్లు, క్యూలైన్ నిర్మాణం ప్రారంభించలేదు. దీక్షాపరులు మాలవిరమణ చేసే కళ్యాణకట్ట భవనం ముందు గతేడాది ఏర్పాటు చేసిన బారికేడ్లు, దీక్షాపరులు వేచిఉండేందుకు కంపార్ట్‌మెంట్లు సరిచేయలేదు. ఏప్రిల్ 11 నుంచి 13 వరకు నిర్వహించే చిన్న జయంతి ఉత్సవాలను హనుమత్ విజయోత్సవంగా వర్ణిస్తారని ఆలయ స్థానాచార్యులు కపీందర్ తెలిపారు. ఏటా చైత్ర శుద్ధ పౌర్ణమి రోజున ఈ ఉత్సవాలు నిర్వహిస్తారని, వీటి తర్వాత 41 రోజులకు హనుమాన్ పెద్ద జయంతిని అధికారికంగా నిర్వహించడం ఇక్కడి ఆనవాయితీగా వస్తోంది.



**భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు**

హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలకు తరలివచ్చే భక్తులు, దీక్షాపరులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేయిస్తాం. మిషన్ భగీరథ పైపులైను ద్వారా కొండపై నీటి వసతి కల్పించడంతోపాటు భక్తుల కోసం దాదాపు 150 వరకు తాత్కాలిక మరుగుదొడ్లు, అదనంగా 14 ప్రసాద విక్రయ కౌంటర్లు ఏర్పాటు చేస్తాం. మూడు రోజులపాటు అన్నదానం నిర్వహిస్తాం. ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్ల నిర్మాణానికి సంబంధించి టెండర్లలో జాప్యం కారణంగా పనులు పూర్తికాలేదు. పుష్కరిణిలో ఎప్పటికప్పుడు శుభ్రమైన నీటిని నింపడంతోపాటు పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఉత్సవాలను విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.శ్రీకాంతరావు, ఈవో

# సాంకేతిక లోపం.. పనులు తాత్సారం

సంగారెడ్డి : సాంకేతిక లోపంతో ఎల్ఆర్ఎస్ పనులు ముందుకు సాగడం లేదని దరఖాస్తుదారులు వాపోతున్నారు. అంతర్జాలంలో డబ్బులు చెల్లించేందుకు వెళితే వెబ్‌సైట్ తెరుచుకోవడం లేదంటున్నారు. అతికష్టంపై రుసుం చెల్లించినా వారం రోజులైనా ప్రొసీడింగ్ కాపీ రాకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. గడువు తేదీ దగ్గర పడడంతో అందరూ ఒకేసారి వస్తుండడంతో అంతర్జాలంలో సాంకేతిక లోపం ఏర్పడుతోందని అధికారులు చెబుతున్నారు. ఈనెల 31వ తేదీలోపు ఎల్ఆర్ఎస్ గడువు ముగుస్తుండడంతో పరిస్థితి ఏంటని డబ్బులు చెల్లించిన వారు ఆందోళన చెందుతున్నారు. **వారం రోజులుగా సర్వర్ డౌన్** జిల్లాలోని 8 పురపాలికల్లో ఎల్ఎర్ఎస్‌కు సంబంధించి వారం రోజులుగా సర్వర్ డౌన్ అవుతోంది. ఈనెల 31లోపు రుసుం చెల్లిస్తే 25 శాతం రాయితీని ప్రభుత్వం ప్రకటించింది. త్వరలో గడువు ముగుస్తుండడం.. సర్వర్ పనిచేయకపోవడంతో అధికారులకు ఇబ్బందిగా మారింది. ఫీజు చెల్లించినా ప్రొసీడింగ్ కాపీ ఎందుకు రావడం లేదని దరఖాస్తుదారులు పురపాలికలోని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను నిలదీస్తున్నారు. సాంకేతిక లోపంతో పనిచేయలేకపోతున్నామని అధికారులు చెబుతున్నా ఎవరూ వినడం లేదని ఆవేదన చెందుతున్నారు. 8 పురపాలికల్లో 7వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎల్1 రూపంలోనూ దరఖాస్తులు పెండింగ్ చూపుతున్నాయి. దీంతో చాలా మంది ఎల్ఎర్ఎస్ రుసుం చెల్లించకుండానే వెనుదిరిగి వెళుతున్నారు.

# యాసంగి ప్రణాళిక కరవు



సిరిసిల్ల : వానాకాలంలో వర్షాలు.. వరదలకు మధ్యమానేరు నిండుకుండలా మారింది. ఇంకేం.. జిల్లాలో రెండు పంటలకు సాగునీటికి ఢోకా లేదనుకున్నారు రైతులంతా. ప్యాకేజీ-9 పరిధిలో మల్కపేట జలాశయం నుంచి నీరొస్తుందని కోనరావుపేట, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, గంభీరావుపేట మండలాల రైతులు ఆశలు పెట్టుకున్నారు. తీరా నీటివిడుదల సమయానికి ఈ ప్యాకేజీకి యాసంగి ప్రణాళిక లేకపోవడంతో ఆయకట్టు రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

జిల్లాలో యాసంగిలో రికార్డు స్థాయిలో 1,76,500 ఎకరాల్లో వరి సాగు చేయగా కోనరావుపేట, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట మండలాల్లోనే సుమారు 60వేల ఎకరాల్లో పంట విస్తీర్ణం ఉంది. ఆయకట్టుకు నీరివ్వాలంటే వానాకాలం సీజన్ చివరిలోనే వివరాలు ఈఎన్‌సీకి పంపాలి. నవంబరులో ప్రాజెక్టులవారీగా ఉన్నతాధికారుల సమావేశంలో నీటి కేటాయింపులు నిర్ణయిస్తారు. వర్షాకాలం మధ్యమానేరుకు వచ్చే వరదనీటిని మల్కపేటకు, అక్కడి నుంచి మైసమ్మ, సింగసముద్రం జలాశయాల్లో నిల్వచేసుకోవాలి. కాగా ముందస్తు ప్రణాళికలేక నీటిని నిల్వచేయలేదు. తర్వాతకూడా ఆయకట్టుకు నీటి విడుదలపై ఉన్నతాధికారులకూ నివేదిక పంపలేదు. ఇప్పుడు పంట ఎండుతుంటే.. రైతులు మొరపెట్టుకుంటే ఇంజినీర్లు కదిలారు. మల్కపేటలోని ఒక టీఎంసీ నీరు కాల్వలో నాలుగు కిలోమీటర్లకే చేరింది. సింగసముద్రం చేరాలంటే 1.5 టీఎంసీలు ఉండాలి.

ప్యాకేజీ-9లో ఆయకట్టుకు నీరిచ్చే మేజర్, మైనర్ కాల్వల భూసేకరణ జరగక పనులు నిలిచిపోయాయి. దీంతో అధికారులు ఆయకట్టును అధికారికంగా నిర్ణయించలేదు. ఇదే విషయం ఈఎన్‌సీ దృష్టికి తీసుకెళ్లడంలో ఇంజినీర్లు జాప్యం చేశారు. మధ్యమానేరులో ప్రస్తుతం 19.89 టీఎంసీల నీరుంది. ఇక్కడి నుంచి 2 టీఎంసీల నీటిని మల్కపేటకు తరలించి... అక్కడి నుంచి మైసమ్మ చెరువు, సింగసముద్రంకు తరలించాలి. దీంతో కోనరావుపేట, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, గంభీరావుపేట మండలాల్లో గొలుసుకట్టు చెరువులను నింపవచ్చు. దీనివల్ల 35 గ్రామాల్లో సాగునీటి ఇబ్బందులు తీరతాయి.

**నీరు లేక నెర్రెలు**

మల్కపేట జలాశయం నుంచి నీటిని తరలిస్తారని ఏడు ఎకరాల్లో వరి సాగుచేశా. మైసమ్మచెరువులో నీరు అడుగంటింది. బోరుబావుల ద్వారా సరిపడా నీరందక 1.20 ఎకరాల్లో భూమి నెర్రెలు బారింది. ఇప్పటికీ మా చుట్టుపక్కల అయిదు గ్రామాల్లో నాలుగు వందల ఎకరాల్లో ఇదే పరిస్థితి. నీటి విడుదలలో జాప్యం జరిగితే మరింత నష్టం వాటిల్లే అవకాశం ఉంది.

**గుగులోతు పెంటయ్య, దేవునిగుట్ట తండా**

రెండు టీఎంసీలు నింపాలి

నాకున్న అయిదెకరాల్లో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేశాను. మార్చిలో పంట పొట్టదశకు వస్తుంది. నీటి వినియోగం ఎక్కువ. భూగర్భజలాలు ఒక్కసారిగా పడిపోతాయి. జలాశయంలో రెండు టీఎంసీల నీరు నిల్వ ఉంటే పక్కనే ఉన్న ఆరు గ్రామాలకు మేలు జరుగుతుంది.వంగపల్లి మల్లేశం, నిజామాబాద్

అనుమతులు రావాలి

రైతుల సమస్య మా దృష్టికి వచ్చింది. ఈ విషయం ఈఎన్‌సీ దృష్టికి తీసుకెళ్లాం అక్కడి నుంచి అనుమతులు వస్తే మధ్యమానేరు నుంచి మల్కపేట రిజర్వాయర్‌లో నీటిని నింపి ఆయకట్టుకు విడుదల చేస్తాం. ఇందుకోసం పంపుహౌజ్‌ను సిద్ధం చేస్తున్నాం. కిశోర్, 9వ ప్యాకేజీ ఈఈ

# ప్రభుత్వ భూముల్లో అసైన్డ్‌దారుల హల్‌చల్





హైదరాబాద్ : ప్రభుత్వం తమకు కేటాయించిన భూములను రవాణాశాఖకు ఇవ్వడంపై దుండిగల్‌కు చెందిన అసైన్డ్‌దారులు ఆందోళన చేపట్టారు. రూ.2 వేల కోట్ల విలువైన 50 ఎకరాల భూములపై హక్కులున్నాయంటూ హల్‌చల్ చేస్తున్నారు. వాటిని స్వాధీనం చేసుకునేందుకు మేడ్చల్ జిల్లా ప్రాంతీయ రవాణా కార్యాలయ అధికారులు పనులను కొద్దిరోజుల నుంచి అడ్డుకుంటున్నారు.

బాహ్యవలయ రహదారి ఎగ్జిట్-5కు సమీపంలో ఈ భూములు ఉండడం.. నర్సాపూర్ రహదారికి 2 కిలోమీటర్ల దూరం కావడంతో ప్రాంతీయ రవాణా కార్యాలయం ఏర్పాటు చేస్తే మేడ్చల్ జిల్లా మొత్తానికి అందుబాటులో ఉంటుందని భావించిన ప్రభుత్వం నాలుగు నెలల క్రితం యాభై ఎకరాలు ఇచ్చింది. కొన్ని రోజుల క్రితం రవాణాశాఖ అధికారులు అక్కడికి వెళ్లి మట్టి చదును చేయడం, చెత్తను తొలగించి శుభ్రం చేస్తుంటే అసైన్డ్‌దారులు అడ్డుకున్నారు. రవాణాశాఖ అధికారులు అక్రమంగా భూముల్లోకి చొరబడిన వారిపై చర్యలు తీసుకుంటామంటూ అక్కడ బోర్డు ఏర్పాటు చేసి తాత్కాలికంగా పనులను నిలిపివేశారు.

**సాగు కోసం ఇచ్చారంటూ వాదన..** దుండిగల్ మండలంలోని సర్వే నంబర్ 454లో 365.17 ఎకరాల సర్కార్‌భూములున్నాయి. వాటిలో యాభై ఎకరాలకుపైగా భూములను దుండిగల్ పరిసర ప్రాంతాల్లోని రైతులకు దశాబ్దాల క్రితం ప్రభుత్వం కేటాయించింది. రైతులు వర్షాలు కురిసినప్పుడే పంటలు వేసేవారు. ఇరవైఏళ్ల క్రితం సర్వే నంబర్ 253లో 67ఎకరాలను అవుటర్ కోసం హెచ్ఎండీఏ తీసుకోవడంతో వారు సాగు చేయడంమానేశారు. కొన్ని నెలల క్రితం రెవెన్యూ అధికారులు ఈ భూములను నిషేధిత జాబితాలోకి మార్చారు. దీంతో రైతులు నిరసన వ్యక్తంచేస్తున్నారు.

# పరీక్షలు ఉచితం.. నిర్ధారణలో వేగం



పెద్దపల్లి :తెలంగాణ(టీ) డయాగ్నొస్టిక్ కేంద్రాల్లో అత్యాధునిక యంత్రాలతో ఉచిత పరీక్షలు అందుబాటులోకి వచ్చాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి రక్త నమూనాలు సేకరించి ప్రత్యేక వాహనాల్లో జిల్లాకేంద్రంలోని టీ డయాగ్నొస్టిక్ సెంటర్లకు తరలిస్తున్నారు. ఉచిత సేవలపై అవగాహన కల్పిస్తే మరింత ఎక్కువ మంది వినియోగించుకొనే అవకాశం ఉంది.

**134 రకాల పరీక్షలు**

వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టీ డయాగ్నొస్టిక్ కేంద్రాల్లో 134 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాలల్లో నాలుగేళ్ల కిందట ఏర్పాటు చేయగా పెద్దపల్లిలో ఏడాదిన్నర కిందట అందుబాటులోకి వచ్చాయి. బయోకెమిస్ట్రీ విభాగంలో కాలేయం, మూత్రపిండాలు, గుండె వ్యాధులు, మోకాళ్ల నొప్పులు, యూరిక్ ఆసిడ్, జీర్ణక్రియ, విటమిన్స్ లోపంతో గుర్తించే పరీక్షలు, థైరాయిడ్, మధుమేహం.. పాథాలజీలో రక్తహీనత, తలసేమియా, తెల్ల రక్త కణాలు, ప్లేట్‌లెట్స్, టీబీ, క్యాన్సర్.. మైక్రో బయోలజీలో టైఫాయిడ్, మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు.

**రాష్ట్రంలోనే వేగంగా పెద్దపల్లిలో..** టీ డయాగ్నొస్టిక్ కేంద్రం నిర్వహణలో పెద్దపల్లి ఆదర్శంగా నిలుస్తోంది. జిల్లా, గోదావరిఖని సార్వజనిత ఆసుపత్రుల్లో సేకరించిన నమూనాలను ఎప్పటికప్పుడు కేంద్రానికి తీసుకొస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి ప్రత్యేక వాహనాల్లో త్వరగా చేరుకొనేలా కలెక్టర్ శ్రీహర్ష పర్యవేక్షిస్తున్నారు. రోజుకు మూడు షిఫ్టుల్లో టెక్నీషియన్లు, సిబ్బంది పని చేస్తుండగా రాష్ట్రంలోనే అత్యంత వేగంగా ఆరు గంటల్లోనే ఫలితాలు వెల్లడిస్తున్నారు.

**నిత్యం ఆరు వేలకు పైగా..**

ఉమ్మడి జిల్లాలో 67 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 498 ఉప కేంద్రాలు, 309 పల్లె దవాఖానాలు, 15 బస్తీ దవాఖానాలు, 15 వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులున్నాయి. వీటి పరిధిలో ప్రతి రోజూ ఆరు వేలకు పైగా నమూనాలు సేకరిస్తున్నారు.

ప్రత్యేక వాహనాల్లో నమూనాలు

ప్రాథమిక, ఆసుపత్రుల నుంచి ప్రత్యేక వాహనాల్లో రక్త నమూనాలు తరలిస్తున్నారు.

శాంపిళ్లను ప్రత్యేకమైన శీతలీకరణ డబ్బాల్లో భద్రపరుస్తూ దాదాపు రెండు గంటలు పాడవకుండా చూస్తున్నారు.

రోగుల ఆధార్, ఫోన్ నంబర్లను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తూ ఫలితాలను సంక్షిప్త సందేశాల రూపంలో పంపిస్తున్నారు.

రోగులు ఆసుపత్రులకు వెళ్తే రాతపూర్వక నివేదికలు కూడా ఇస్తున్నారు.

ఉచిత పరీక్షలపై అవగాహన లేక చాలా మంది ప్రైవేటు కేంద్రాలకు వెళ్లి నష్టపోతున్నారు.

ప్రభుత్వ సేవలను వినియోగించుకుంటే ఒక్కో రోగికి కనీసం రూ.5 వేల వరకు ఖర్చు తగ్గుతుంది.

ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు డయాగ్నొస్టిక్ సేవలపై విస్తృతంగా అవగాహన కల్పించాలి.

రూ.4 వేల భారం తగ్గింది

గుండె సంబంధ సమస్య, కీళ్లు, మెడ నొప్పులతో బాధ పడుతూ ఆరోగ్య కేంద్రానికి వెళ్లా. టీ డయాగ్నొస్టిక్ కేంద్రంలో ఎనిమిది రకాల పరీక్షలు చేసుకున్నా. ఇవే పరీక్షలకు ప్రైవేటులో రూ.4 వేల ఖర్చవుతుందని చెప్పారు.

రాజేశ్వరి, గోదావరిఖని

రాత్రి 11 గంటల వరకు విధులుజిల్లాలో ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అనుసంధానిస్తూ నాలుగు మార్గాల్లో వాహనాలు సమకూర్చి నమూనాలు తరలిస్తున్నాం. డయాగ్నొస్టిక్ కేంద్రంలో మూడు షిఫ్టుల్లో సిబ్బందిని నియమించాం. రాత్రి 11 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నారు.ప్రసన్నకుమారి, జిల్లా వైద్యాధికారి, పెద్దపల్లి

# మత్తు వదిలిస్తున్నారు!

సిరిసిల్ల: మద్యం తాగడం వ్యసనంగా మారి చాలామంది జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.. గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసలవుతున్నవారూ ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్నారు.. నాలుగు జిల్లాల్లో నెలకు రూ.200 కోట్ల మద్యం వ్యాపారం సాగుతుండటం.. ఏటా 20వేలకు పైగా డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదవుతుండటం మద్యానికి బానిసలవుతున్న తీరును తెలియజేస్తోంది. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల్లో 2024 ఏప్రిల్‌లో డీ-అడిక్షన్ కేంద్రాలను ప్రారంభించడంతో ఉచితంగా సేవలు అందుతుండగా, ప్రత్యేకంగా సిబ్బందిని నియమించకపోవడం లోటుగా ఉంది. దీంతోపాటు ఈ కేంద్రాలపై ప్రచారం లేకపోవడంతోనూ కొంతమంది ఎక్కువ డబ్బులు వెచ్చించి ఇతర ప్రాంతాల్లోని ప్రైవేటు డీ అడిక్షన్ కేంద్రాలకు వెళ్తున్నారు.ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల్లో నేషనల్ యాక్షన్ ప్లాన్ ఫర్ డ్రగ్ డిమాండ్ రిడక్షన్ (ఎన్ఏపీడీడీఆర్) పథకంలో డీ-అడిక్షన్ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. నాలుగు ఆసుపత్రుల్లోనూ ఎన్‌సీడీ (అసాంక్రమిక వ్యాధుల) విభాగం సైకియాట్రిస్టులే సేవలను అందిస్తున్నారు. ఎక్కడా ప్రత్యేకంగా విభాగం లేదు. ఈ చికిత్సలకు ప్రతి ఆసుపత్రిలో ప్రత్యేకంగా పది పడకలు ఏర్పాటు చేశారు. మద్యానికి బానిసలైన వారు సిరిసిల్లలో నెలకు సగటున 140, రామగుండంలో 120 మంది వస్తున్నారు. జగిత్యాల, కరీంనగర్ ఆసుపత్రుల్లో అందించే చికిత్సలను ఎన్‌సీడీలోని మానసిక విభాగంలో కలుపుతున్నారు. ఓపీకి వచ్చినవారిలో 30శాతం మంది మద్యం బానిసలు ఉంటున్నారని ఆ విభాగం అధికారులు చెబుతున్నారు. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో నెలకు సగటున 500ల మంది వరకు సేవలు పొందుతున్నట్లు అంచనా

సిరిసిల్లలో 40 ఏళ్ల వ్యక్తి మద్యానికి బానిసయ్యాడు. చేసే పనిలో శ్రద్ధ లేకుండా పోవడంతో పనికి పిలిచేవారు తగ్గిపోయారు. ఇంట్లో గొడవలు మొదలయ్యాయి. కాలనీలో జరిగిన అవగాహన సదస్సులో డీ-అడిక్షన్ కేంద్రం గురించి తెలుసుకున్న కుటుంబసభ్యులు సిరిసిల్ల కేంద్రానికి తీసుకెళ్లగా నెల రోజుల్లో సాధారణ స్థితికి చేరి పని చేసుకుంటున్నాడు.కరీంనగర్‌లో ఓ యువకుడికి మద్యంతోపాటు గంజాయి అలవాటైంది. కళాశాలకు దుమ్మాకొట్టడం, మిత్రులతో కలిసి మద్యం, గంజాయి తాగడం వ్యసనంగా మారింది. ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఒకసారి పోలీసులకు పట్టుబట్టాడు. కుటుంబ సభ్యులకు జనరల్ ఆస్పత్రిలో డీ అడిక్షన్ కేంద్రం ఉన్న విషయం తెలియక హైదరాబాద్‌లోని ప్రైవేటు కేంద్రానికి తీసుకెళ్లారు. చికిత్సకు రూ.వేలల్లో ఖర్చవుతోందని అతని కుటుంబం వాపోతోంది.

డీ అడిక్షన్ కేంద్రాలకు వచ్చే బాధితులకు తొలుత వైద్య పరీక్షలు చేస్తారు. హిమోగ్లోబిన్ శాతం, కాలేయం, మూత్రపిండాల పనితీరు, మానసిక స్థితులను పరిశీలిస్తారు. తీవ్రతను బట్టి మందులు ఇస్తారు. బాధితులు, కుటుంబ సభ్యులకు మద్యపానంతో వచ్చే దుష్పరిణామాలు వివరించడంతోపాటు ఆ వ్యసనాల నుంచి విముక్తి కల్పించేలా కౌన్సెలింగ్ ఇస్తారు. బాధితుని ఆరోగ్య పరిస్థితిని బట్టి అలవాటు మానడానికి 1 నుంచి 3 నెలల సమయం పడుతుందని వైద్యులు చెబుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా అందించే ఈ చికిత్స ప్రైవేటులో అయితే వేలాది రూపాయలు వెచ్చించాల్సి ఉంటుంది. చికిత్సకు వచ్చేవారిలోనూ కొందరు మధ్యలోనే వెళ్లిపోతున్నారు. ఇక గంజాయి, కల్తీ కల్లు, ఇతర మత్తు పదార్థాలు తీసుకునేవారిని ఈ కేంద్రాలకు తీసుకు రావడం చాలా తక్కువ అని సిబ్బంది చెబుతున్నారు. డీ-అడిక్షన్ కేంద్రాల్లో నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనల ప్రకారం ఇద్దరు సైకియాట్రిస్టు ప్రొఫెసర్లు, ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు, నర్సు, అటెండర్లు ఉండాలి. కాగా జనరల్ ఆస్పత్రుల్లోని కేంద్రాలకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించలేదు. నాలుగు జిల్లాల్లోని జనరల్ ఆస్పత్రి ఎన్‌సీడీ విభాగాల్లో ఒక సైకియాట్రిస్టు, ఇద్దరు నర్సులు, ఒక అటెండరు చొప్పున ఉండగా వారే డీ అడిక్షన్ కేంద్రానికి వచ్చేవారికి సేవలు అందిస్తున్నారు.

# నిషేధం.. కాగితాలకే పరిమితం

రాయికల్ : పల్లెల్లో, పట్టణాల్లో ప్లాస్టిక్ నిషేధం కాగితాలకే పరిమితమవుతోంది. కూరగాయలు, పండ్లు, పూలు, మాంసం ఇలా ఏది కొన్నా దుకాణదారులు ప్లాస్టిక్ కవర్లలో వేసి ఇస్తున్నారు. ప్లాస్టిక్ వినియోగంలో క్షేత్రస్థాయిలో కఠిన వైఖరి అవలంభించకపోవడంతో మానవ జీవితంలో నిత్యావసర వస్తువుగా మారి మానవాళి మనుగడకు సవాలు విసురుతోంది. వినియోగించడం సరికాదని తెలిసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. నియంత్రించే అధికారుల చర్యలు కాగితాలకే పరిమితం కావడంతో ప్లాస్టిక్ భూతం కరాళ నృత్యం చేస్తోంది. ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి. ప్రతి రోజు ఒక్కో ఇంటి నుంచి సుమారు 10 ప్లాస్టిక్ కవర్లు చెత్త కుప్పల్లోకి చేరుతున్నాయి. రోజుకు 8 నుంచి 10 టన్నుల చెత్త సేకరిస్తుండగా అందులో 50 శాతం ప్లాస్టిక్ కవర్లే దర్శనమిస్తున్నాయి. పురపాలక సంఘం అధికారు లు అప్పుడప్పుడు దాడులు నిర్వహిస్తుండగా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కనీసం కన్నెత్తి చూడటం లేదనే విమర్శలున్నాయి.

**సమష్టి సహకారంతోనే నియంత్రణ**

జగదీశ్వర్‌గౌడ్, కమిషనర్, రాయికల్

చెత్త సేకరణ వాహనాల ద్వారా మైకుల్లో ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే



అనర్థాలపై ప్రచారం నిర్వహిస్తున్నాం. గతంలో దాతల సహకారంతో నారసంచులు పంపిణీ చేశాం. తరచూ తనిఖీలు నిర్వహిస్తూ జరిమా నాలు విధిస్తుండటంతో ప్లాస్టిక్ విక్రయాలు కొంత మేర నియంత్రణలో ఉన్నాయి. ఇప్పటివరకు జరిమానాల రూపంలో రూ.22వేల ఆదాయం సమకూరింది. అధికారులు తనిఖీలు నిర్వహించినప్పుడు ప్లాస్టిక్ విక్రయాలు నిలిపివేసి తనిఖీలు సద్దుమనిగాక తిరిగి యథావిధిగా అమ్ముతున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి. విక్రయదారులు, వినియో గదారులు సమష్టిగా సహకరించినప్పుడే ప్లాస్టిక్ నియంత్రణ సాధ్యమవుతుంది. **వినియోగంతో అనర్థాలెన్నో..** పర్యావరణంపై అవగాహన లేని కొందరు జనావాసాల్లో, వ్యవసాయ క్షేత్రాలకు సమీప ంలో పాలిథిన్ సంచులు, ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు పడేయడం వలన వర్షాలు కురిసినపుడు నీరు భూమిలోకి ఇంకి పోకుండా ప్లాస్టిక్ వ్యర్థాలు అడ్డుగా ఉంటున్నాయి. పట్టణంలోని పలు కాలనీల్లో మురుగు కాల్వల్లోకి ప్లాస్టిక్ వ్యర్థాలు భారీగా చేరుకోవడంతో డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతింటుంది. ప్లాస్టిక్ వ్యర్థాలను పశువులు తినడం ద్వారా గర్భకోశ వ్యాధులు వచ్చి మృత్యువాత పడుతున్నాయి. భూమిపైకి చేరిన ప్లాస్టిక్ కవర్లు నాశనం కావాలంటే వేల సంవత్సరాలు పడుతుం డగా పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుంది. ప్లాస్టిక్ సంచులు, గ్లాసుల్లోని పదార్థాలు వినియోగిస్తే క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంటుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్లాస్టిక్ చెత్తను కాల్చడంతో వచ్చే వాయువులు విషపూరితమై సమీప కాలనీవా సులు శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బందులు పడే అవకాశం ఉంది.

# సీఎస్ఆర్ నిధులు... ఆధునిక సౌకర్యాలు

జిన్నారం : సీఎస్ఆర్ నిధులు గ్రామాలకు వరప్రసాదంగా మారుతున్నాయి. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులు మారేందుకు దోహదపడుతున్నాయి. జిన్నారం మండలం ఖాజీపల్లిలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కోసం నిర్మిస్తున్న భవనం పూర్తయ్యే దశకు చేరింది. ఈ నెలాఖరులో ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్నారు. స్థానిక పారిశ్రామికవాడలోని కెమ్‌టెక్ పరిశ్రమ సీఎస్ఆర్ నిధులతో దీని నిర్మాణం చేపట్టారు.

**సమస్యలు పునరావృతం కాకుండా..**

గతంలో శిథిల భవనం కావడంతో వాన కురిస్తే విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. ఆ రోజు సెలవు ఇవ్వాల్సిన దుస్థితి. మరోవైపు ఇరుకు గదులతో పాట్లు పడక తప్పలేదు. ఈ ఇబ్బందులు తీర్చేందుకు కొత్త భవనాన్ని నిర్మిస్తున్నారు. ఐదు తరగతి గదులు, గ్రంథాలయం, కార్యాలయానికి వేర్వేరుగా గదులు నిర్మించారు. గతంలో ఒక గదిలో రెండు తరగతుల వారిని కూర్చోబెట్టగా.. ఇప్పుడిక ఆ సమస్య ఉ




ండదు. విశాలమైన భోజనశాల సైతం అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ప్రస్తుతం రంగులు వేస్తున్నారు. రూ. 1.8 కోట్ల అంచనాతో నిర్మాణ పనులు చేపట్టారు.

**అంగన్‌వాడీ సైతం**

ఇదే సముదాయంలో అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులు ఎలాంటి అవస్థలు పడకుండా అన్ని వసతులు కల్పిస్తున్నారు. ప్రత్యేకంగా సామగ్రి నిల్వ కోసం ప్రత్యేకంగా గదిని నిర్మించారు. చిన్నారులకు సకల సౌకర్యాలు కల్పించారు. వారిని ఆకట్టుకునేలా కార్పొరేట్ తరహాలో గోడలపై బొమ్మలు వేయించారు. అన్ని సదుపాయాలతో..: అన్ని వసతులతో భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గతంలో ఉన్న సమస్యలు చాలా వరకు పరిష్కారం అయినట్లే. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఒనగూరనున్నాయి. అనిల్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు

# సీడీపీ నిధులేవి?

ఆదిలాబాద్ : సాధారణంగా ఎమ్మెల్యేకు ఏటా నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమం(సీడీపీ) కింద నిధులు విడుదలవుతాయి. గ్రామాల్లో ఇచ్చిన హామీలు.. కార్యకర్తలు సూచించిన పనులను మంజూరు చేసేందుకు ఎమ్మెల్యేలకు ఉన్న ఏకైక నిధి ఇదే. గెలుపొంది ఏడాది కావొస్తున్నా ఈ సీడీపీ నిధుల జాడ లేకపోవడంపై ఎమ్మెల్యేలు నిట్టూరుస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని విపక్ష ఎమ్మెల్యేల పరిస్థితి అయోమయంగా ఉందని వారి అనుచరులు వాదిస్తున్నారు. తమ వద్దకు వచ్చిన ప్రజల సమస్యలు పరిష్కరించలేకపోతున్నామని ఇటు ఎమ్మెల్యేలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు గత ప్రభుత్వ హయాంలో తొలుత సీడీపీ కింద రూ. 3 కోట్లకు పెంచారు. చివరి సంవత్సరం 2022-23లో ఆ నిధి ఏకంగా రూ. 5 కోట్లకు పెరిగింది. నిధులు పెంచినా అందులో ఒక నిబంధనను తీసుకొచ్చారు. రూ. 3 కోట్లు ఎమ్మెల్యే కోటా కింద విడుదల చేసి మిగతా వారి ప్రమేయం లేకుండానే రూ. 2 కోట్లు నేరుగా ప్రభుత్వమే విద్యాశాఖ కింద 'మన ఊరు - మన బడి'కి కేటాయించింది. దీంతో కోటా పెంచినా అంతగా ప్రయోజనం లేకుండా పోయిందని అప్పట్లో కొందరు ఎమ్మెల్యేలు ఆవేదన వెలిబుచ్చారు. ఆఖరుగా 23.05.2023న జిల్లాలకు సీడీపీ కింద రూ. 3 కోట్ల చొప్పున ఒక్కో నియోజకవర్గానికి విడుదలయ్యాయి. ఇది ఇంతకు ముందున్న ఎమ్మెల్యేలు వినియోగించారు. కొత్తవారికి ఇప్పటి వరకు ఏమీ రాలేదు.

**పదిలో ఆరుగురు విపక్ష ఎమ్మెల్యేలే**

గత డిసెంబరు 7న ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేశారు. తాజాగా సంవత్సరం కావొస్తోంది. సీడీపీ నిధుల జాడలేక విపక్ష ఎమ్మెల్యేలు నిరాశలో ఉన్నారు. అధికార కాంగ్రెస్‌కు సంబంధించి మంచిర్యాల, ఖానాపూర్, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో ప్రేంసాగర్‌రావు, వెడ్మబొజ్జు, వివేక్, వినోద్‌లు గెలుపొందారు. బోథ్, ఆసిఫాబాద్‌లలో భారాసకు చెందిన అనిల్‌జాదవ్, కోవలక్ష్మి విజయం సాధించారు. ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, సిర్పూర్ నియోజకవర్గాల్లో భాజపా నుంచి పాయల్‌శంకర్, మహేశ్వర్‌రెడ్డి, రామారావుపటేల్, పాల్వాయి హరీష్‌బాబులు గెలుపొందారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మాత్రం ఇతర నిధులతో పనులు మంజూరు చేయించుకుంటున్నా ఆరురుగు విపక్ష ఎమ్మెల్యేలు ఉండటంతో నిధుల కేటాయింపు సమస్యగా మారింది.

**నిరాశే..**

అసలే సీడీపీ నిధుల విడుదల లేక అయోమయంగా ఉన్న విపక్ష ఎమ్మెల్యేలకు ఇతర నిధుల్లోనూ ప్రాధాన్యం లభించకపోవడం ఇబ్బందికరంగా మారింది. నియోజకవర్గానికి రూ. 10 కోట్ల చొప్పున ప్రత్యేక అభివృద్ధి నిధి(స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్) మంజూరుకాగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నచోట వారే పనులు ప్రతిపాదించారు. విపక్ష ఎమ్మెల్యేలు ఉన్నచోట మాత్రం వారు ప్రతిపాదించిన పనులను పక్కనపెట్టడం రాజకీయ చర్చకు తెరలేపింది. ఈ పనులను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదించాల్సి ఉండటంతో అన్ని చోట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జులు సూచించిన పనులకు అధిక ప్రాధాన్యమిచ్చినట్లు తెలుస్తోంది. గెలిచిన కొత్తలో ఉపాధిహామీ కింద రోడ్లు, మురుగుకాలువల కోసం నిధులు రాగా కాంగ్రెస్ కార్యకర్తలకు కొన్ని కేటాయించి మిగతా సగం విపక్ష ఎమ్మెల్యేలకు సైతం రూ. 3.50 కోట్ల చొప్పున మంత్రి కేటాయించడంతో అంతా సంతృప్తిచెందారు.

అభివృద్ధి కోసం కలిసి పనిచేద్దామని మంత్రి చెప్పడంతో ఇతర నిధుల కేటాయింపుల్లోనూ ప్రాధాన్యం ఉంటుందని విపక్ష ఎమ్మెల్యేలు భావించినా ఎస్‌డీఎఫ్ పనుల్లో నిరాశే మిగలడంతో కథ మొదటికొచ్చింది. దీంతోనే సీడీపీ నిధుల విడుదలకు పట్టుబడుతు న్నారు. కేవలం కల్యాణలక్ష్మి చెక్కులు, సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీకే పరిమితమవుతున్నామని విపక్ష ఎమ్మెల్యేలు ఆవేదన వెలిబుచ్చుతున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో ప్రజాప్రతినిధులు లేక అన్ని నిధుల్లో ఎమ్మెల్యేల ప్రతిపాదనలే తీసుకోవాల్సి ఉన్నా తమ హక్కులను కాలరాస్తున్నారని విపక్ష ఎమ్మెల్యేల్లో ఒకరైన భారాసకు చెందిన బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ పేర్కొనడం ఇక్కడ ప్రస్తావించాల్సిన అంశం.

# ఉపయోగం వెన్నంటే ఉపద్రవం!



గోదావరిఖని : కర్ణాటక రాష్ట్రంలోని హోటళ్లలో ప్లాస్టిక్‌ను నిషేధించారు. ఇడ్లీల తయారీకి ప్లాస్టిక్ వినియోగిస్తున్నట్లు అక్కడి ప్రభుత్వం గుర్తించింది. 250 నమూనాలు సేకరించి పరీక్షలు జరిపారు. 52 నమూనాల్లో క్యాన్సర్ కారకాలను గుర్తించి హోటళ్లలో ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను కేంద్ర ప్రభుత్వం గతంలోనే నిషేధించింది. 120 మైక్రాన్‌ల కన్నా ఎక్కువ మందం ఉన్న వాటినే అనుమతిస్తున్నారు. ఈ నిబంధనలు ఉమ్మడి జిల్లాలో అమలుకు నోచుకోవడం లేదు. ప్లాస్టిక్ సంచుల వినియోగం అధికంగా ఉంది. మార్కెట్‌కు వెళ్లే వెంట వస్త్ర సంచులు తీసుకెళ్లాలన్న ఆలోచన జనంలో ఉండటం లేదు. ప్లాస్టిక్ వినియోగం ఇటు ఆరోగ్యానికి అటు పర్యావరణానికి పెనుముప్పుగా మారుతుందన్న కనీస స్పృహ కరవైంది. అధికారులు అప్పుడప్పుడు దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తూ ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్నా.. వినియోగిస్తున్నా జరిమానాలు విధిస్తున్నారు. అయినా పూర్తి స్థాయి నియంత్రణ సాధ్యపడటం లేదు. సాధారణ వస్తువులతోపాటు ఇటీవల కాలంలో వేడి పదార్థాలను కూడా ప్లాస్టిక్ సంచుల్లోనే ప్యాకింగ్ చేసి తీసుకెళ్తున్నారు. దీంతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు చెబుతున్నా జనం పెడచెవిన పెడుతున్నారు. ఎటైనా వెళ్లినప్పుడు ప్రత్యేకంగా సంచి తీసుకెళ్లాల్సిన అవసరం ఉండదన్న ఒక్క కారణంతో ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని రెండు నగరపాలికలు, 14 పురపాలక సంఘాల పరిధిలో ప్లాస్టిక్ నియంత్రణకు అడపాదడపా తనిఖీలు నిర్వహిస్తున్నారు. కాని నియంత్రణకు పూర్తి స్థాయి చర్యలు తీసుకోవడం లేదు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాల్సిన అధికారులు సిబ్బంది కొరత కారణంగా మొక్కుబడిగా తనిఖీలు చేపడుతున్నారు. నగర, పురపాలక సంఘాలతోపాటు గ్రామ పంచాయతీల్లో కూడా ప్లాస్టిక్ నివారణకు ప్రత్యేక దృష్టి సారించాలి. కాని దీనిపై ప్రత్యేక పర్యవేక్షణకు సరిపడా సిబ్బంది లేకపోవడంతో నియంత్రణ సాధ్యమవడం లేదు.

**పర్యావరణానికి విపత్తు**

ప్లాస్టిక్ కవర్లలో వేడి ఆహార పదార్థాలు తీసుకెళ్లడం వల్ల రసాయనిక చర్య జరిగి హానికరమైన కణాలు తయారవుతాయి.

మైక్రో ప్లాస్టిక్‌లోని రసాయనాలు శరీరంలోని కణాలను దెబ్బతీస్తాయి. హార్మోన్ల అసమతుల్యతకు కారణమవుతాయి.

మురుగు కాలువల్లో ప్రవాహానికి ప్లాస్టిక్ వ్యర్థాలు అడ్డుపడి వర్షాలు పడినప్పుడు లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతాయి

చెత్తలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను తిని పశువులు, వన్య ప్రాణుల ఆరోగ్యం దెబ్బతింటుంది. ప్లాస్టిక్ వ్యర్థాలు కలిసిపోవడం వల్ల భూసారం తగ్గిపోతోంది. వర్షపు నీరు భూగర్భంలోకి ఇంకకుండా అడ్డుపడుతుంది. ఫలితంగా భూగర్భ జలాలు పడిపోతాయి. ఇలా చేసి చూద్దాం..ప్రతి ఒక్కరూ వస్తువులు, కూరగాయల కొనుగోలుకు వెళ్లే సమయంలో వస్త్ర సంచులు తీసుకెళ్లాలి. ఆహార పదార్థాలను తెచ్చుకోవడానికి స్టీల్ డబ్బాలు ఉపయోగించాలి. ఉమ్మడి జిల్లాలో ఏటా సగటున 750 మంది మహిళల్లో, 400 మంది పురుషుల్లో క్యాన్సర్ లక్షణాలను గుర్తిస్తున్నారు.

క్యాన్సర్ ముప్పు ప్లాస్టిక్ వల్ల క్యాన్సర్ ముప్పు పొంచి ఉంటుంది. ప్లాస్టిక్ తయారు చేసేందుకు వినియోగించే రసాయనాలు మనం తెచ్చుకునే ఆహార పదార్థాల్లోకి చేరతాయి. వాటిని భుజించడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. జీవక్రియ దెబ్బతింటుంది. ప్లాస్టిక్ వినియోగాన్ని ఎంత తగ్గించగలిగితే అంత మేలు. -డా. అశోక్‌కుమార్, సీనియర్ ఫిజిషియన్, గోదావరిఖని

# నిధులు వస్తేనే జాతర నిండుగా!



ధర్మపురి: ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలపై నిధుల ప్రభావం పడే అవకాశం ఉంది. ఈ నెల 10 నుంచి 13 రోజుల పాటు జరిగే ఉత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి భారీసంఖ్యలో భక్తులు తరలివస్తారు. కనీస వసతులు లేకపోవడంతో వారు ఇబ్బందులు పడే అవకాశం ఉంది. రెండేళ్ల నుంచి ఉత్సవాలకు ప్రత్యేక నిధులు కేటాయించడం లేదు. భారాస ప్రభుత్వం హయాంలో నాలుగేళ్ల కిందట సుమారు రూ. 50 లక్షల నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు వెలువడినా విడుదల మాత్రం కాలేదు. వసతుల కల్పనపై సమన్వయ సమావేశంలో చర్చిస్తున్నా.. నిధులు కేటాయించడం లేదు.

**పెండింగ్‌లో రూ.15 లక్షలు**

రెండేళ్లుగా దేవస్థానంలో జాతర ఏర్పాట్ల బిల్లులను అధికారులు చెల్లించడం లేదని గుత్తేదార్లు, అదనపు కార్మికులు వాపోతున్నారు. అదనపు పారిశుద్ధ్య కార్మికులకు, బ్లీచింగ్ పౌడర్, విద్యుత్తు గుత్తేదార్లకు ఇంతవరకు మున్సిపల్ నుంచి ఒక్క రూపాయి రాలేదు. సుమారుగా రూ. 15 లక్షల వరకు నిధులు రావాల్సి ఉంది. బకాయిలు చెల్లించాలంటూ బాధితులు పురపాలక కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. బకాయిలు చెల్లిస్తేనే జాతరకు ఏర్పాట్లు చేస్తామని గుత్తేదార్లు అంటున్నారు. అలాగే అదనపు కార్మికులను సుమారుగా 100 మందిని తాత్కాలిక పద్ధతిలో తీసుకుంటున్నారు.

గోదావరి ఎగువ ప్రాంతంలో సత్యవతి, బ్రహ్మగుండాల వద్ద లోతు ఉండటంతో భక్తులు స్నానానికి దిగి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఇక్కడ ప్రమాదం తెలిపేలా బోర్డులు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలి. సంతోషీమాతా, మంగళిగడ్డ ప్రాంతంలో దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేయాలి. దేవస్థానంలో తాగునీటికి కటకట ఏర్పడుతోంది. క్యూలైన్ల వద్ద తాగునీటి వసతులు కల్పించాల్సి ఉంది. పుర అధికారులు ప్రతి వాహనానికి రూ. 50 వసూలు చేస్తున్నారే తప్ప పార్కింగ్ స్థలంపై దృష్టి సారించడం లేదు. మరుగుదొడ్ల నిర్మాణం రెండు నెలలుగా నత్తనడకన సాగుతున్నాయి. రాయపట్నం నుంచి కరీంనగర్‌కు ప్రత్యేక బస్సులు నడిపించాలి. ధర్మపురి పట్టణంలో అంతర్గత రహదార్లు అధ్వానంగా మారాయి.

# అతివలకు అండ

మెదక్: పని ప్రదేశంలో వేధింపులకు గురయ్యే అతివలకు 'మహిళా సాధికారత కేంద్రం' బాసటగా నిలుస్తోంది. ప్రభుత్వ శాఖల్లో అంతర్గత ఫిర్యాదుల కమిటీ(ఐసీసీ)ల ఏర్పాటుకు కసరత్తు మొదలైంది. పలు ప్రభుత్వ శాఖలు, ప్రైవేట్ రంగంలో కమిటీలు ఏర్పాటవుతున్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు ఆయా శాఖల్లో ఐసీసీలు ఏర్పాటు కాగా, మిగిలిన వాటిల్లో పూర్తిచేసేందుకు కసరత్తు చేస్తున్నారు. జిల్లా స్థాయిలో కమిటీని ఏర్పాటు చేయనున్నారు. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టం-2013 ప్రకారం శారీరక సంబంధం, లైంగిక ప్రయోజనాలను కాంక్షిస్తూ అభ్యర్థించడం, లైంగికపరమైన వ్యాఖ్యలు, అశ్లీల చిత్రాలను చూపుతూ అసభ్య ప్రవర్తనకు పాల్పడటం నేరంగా పరిగణిస్తారు.

**జిల్లా స్థాయిలో ఎల్‌సీసీ...**

జిల్లా స్థాయిలో స్థానిక ఫిర్యాదుల కమిటీ(ఎస్‌సీసీ) పని చేయనుంది. ఇందులో కనీసం ఐదుగురు ఉంటారు. సభ్యుల్లో జిల్లా అధికారిణులు, న్యాయవాది, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, మహిళా ఉద్యోగులు భాగస్వాములు కానున్నారు. ఇది వరకు కమిటీ ఉండగా, ప్రతి మూడేళ్లకు ఒకసారి మార్పు చేయాల్సి ఉండడంతో కొత్త కమిటీ ఏర్పాటుకానుంది.

**ఫిర్యాదు ఎలా అంటే...**

లైంగికపరమైన వేధింపులకు గురైతే ఐసీసీకి ఫిర్యాదు చేస్తే గోప్యంగా విచారణ చేస్తారు. పరిష్కారం కాకుంటే ఎల్‌సీసీ వరకు వెళ్లొచ్చు. సంఘటన జరిగిన మూడు నెలల్లోపు ఫిర్యాదు చేయొచ్చు. మరికొన్ని సందర్భాల్లో అదనపు కాల పరిమితిని పరిగణనలోకి తీసుకుంటారు. విచారణ పూర్తయిన తరువాత నివేదికను ఇరుపక్షాలకు చేరవేయాలి.

**నోడల్ అధికారులుగా తహసీల్దార్లు...**

వేధింపులకు సంబంధించి మహిళలు మండల స్థాయిలో తహసీల్దార్ల దృష్టికి తీసుకెళ్లవచ్చు. తహసీల్దార్లను నోడల్ అధికారులుగా నియమిస్తూ ప్రభుత్వం ఇటీవల జీవో విడుదల చేసింది. కేసులు వచ్చినా మహిళా సాధికారత కేంద్రం దృష్టికి తీసుకురావాలి.



**అన్ని సంస్థల్లోనూ అమలు**

ప్రైవేటు, ప్రభుత్వ, ఇతర సంస్థలు సహా అన్ని ప్రదేశాల్లో 10 లేదా అంతకుమించి ఉద్యోగులున్న చోట కమిటీ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. జిల్లాలో 12 ప్రభుత్వ శాఖల్లో, 31 కంపెనీలు, ఆరు షాపింగ్ మాల్స్‌లలో ఐసీసీ కమిటీలు ఏర్పాటయ్యాయి. సీనియర్ ఉద్యోగి ప్రిసైడింగ్ అధికారిగా, మిగిలిన వారు సభ్యులుగా ఉంటారు. అవసరం మేర స్వచ్ఛంద సంస్థలు, నాయకత్వ లక్షణాలు కలిగిన మహిళలను తీసుకుంటారు. వీరు ప్రతి ఏడాది నివేదికను మహిళా సాధికారత కేంద్రంలో అందజేయాలి.

**ఉపేక్షించవద్దు**

ప్రస్తుతం ప్రభుత్వ శాఖల్లో ఐసీసీల ఏర్పాటుపై దృష్టి సారించాం. రానున్న రోజుల్లో పని ప్రదేశాల్లో ఏర్పాటు చేయిస్తాం. జిల్లా స్థాయిలో ఎల్‌సీసీ ఏర్పాటు చేస్తాం. వేధింపులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దు. సహాయం కోసం టోల్‌ఫ్రీ నంబర్లు 181, 100కు ఫోన్ చేయాలి. సంతోషి, జిల్లా సమన్వయకర్త, మహిళా సాధికారత కేంద్రం

# సంతోషాలను 'ఏరు'కో..!

భద్రాచలం : తెలుగు రాష్ట్రాల్లో పర్యాటక ప్రాంతాలంటే సాధారణంగా ఏపీలోని కోనసీమ అందాలు.. మారేడుమిల్లి పాపికొండలు.. బొర్రా గుహల పేర్లు వినిపిస్తుంటాయి. అదేస్థాయిలో అనుభూతులను పంచేందుకు 'ఏరు' ఉత్సవం వేదికవనుంది. నీటివనరులను ఆస్వాదించేందుకు భద్రాచలం మన్యం కేంద్రంగా సాగే ఈ యాత్ర పూర్తిగా ప్రకృతితో మమేకం చేస్తుంది. దైనందిన జీవితంలో అలసినవారు సంతోషాలను ఏరుకునే యాత్ర ఇది. తొలి విడతగా ఏరు ఉత్సవాన్ని గురువారం ప్రారంభించి శనివారం వరకు కొనసాగిస్తారు. ఆ తర్వాత ప్రతి మూడు రోజులకు ఒక ప్యాకేజీ కింద పర్యాటకులను ఆహ్వానిస్తారు. స్నానఘట్టాల వద్ద ఆహార పదార్థాలు, హస్త కళారూపాలను స్టాళ్లలో ఉంచారు. కలెక్టర్ జితేశ్ వి.పాటిల్, ఐటీడీఏ పీఓ రాహుల్ చొరవతో 'రివర్ ఫెస్టివల్'కు రూపకల్పన జరగటంతో భద్రాద్రి జిల్లా పర్యాటకానికి మహర్దశ పట్టనుంది.

**మూడు రోజుల యాత్ర ఇలా..**

1. గురువారం తెల్లవారుజామున 3 గంటలకు భద్రాచలంలోని గోదావరి ఒడ్డున ఏర్పాటుచేసిన క్యాంప్ కుటీరాలకు పర్యాటకులు చేరుకుంటారు. వీటిలో ఇద్దరు, ముగ్గురు, నలుగురు చొప్పున ఉండేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. టీ లేదా కాఫీ, బిస్కెట్లు ఇస్తారు. బోట్ షికారు చేయవచ్చు. సాయంత్రం 5 గంటలకు ఘాట్‌పై సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి. రాత్రి 8 గంటలకు క్యాంప్



కుటీరాలకు చేరుకుని క్యాంప్ ఫైర్‌ను ఆస్వాదించవచ్చు. అక్కడే రాత్రి భోజనం ఉంటుంది.

2. శుక్రవారం తెల్లవారుజామున 5 గంటలకు ఉత్తర ద్వార దర్శనం చేసుకోవచ్చు. 7 గంటలకు అల్పాహారం, 8 గంటలకు కిన్నెరసాని బోట్ షికారు, మధ్యాహ్నం 12కి భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలోని మ్యూజియాన్ని సందర్శిస్తారు. ఇక్కడ సృష్టించిన ఆదివాసీ పల్లెను చూడవచ్చు. అక్కడే మధ్యాహ్న భోజనం చేయాలి. సాయంత్రం 4 గంటలకు బొజ్జిగుప్ప ఆదివాసీ పల్లెను సందర్శిస్తారు. అక్కడే రాత్రి భోజనం ఉంటుంది. అక్కడి వాగులో బోటింగ్ చేయవచ్చు. ఆదివాసీ సంప్రదాయ నృత్యాలను చూడవచ్చు. రాత్రి 8కి తిరిగి క్యాంప్ కుటీరాలకు చేరుకుని బస చేస్తారు.

3. శనివారం ఉదయం 8 గంటలకు అల్పాహారం చేసి చంద్రుగొండ మండలం కనిగిరిగుట్ట ట్రెక్కింగ్‌కు చేరుకోవాలి. అక్కడ టీ, స్నాక్స్‌తో పాటు మధ్యాహ్నం భోజనం ఉంటుంది. గుట్ట పైనుంచి ప్రకృతి అందాలను ఆస్వాదించవచ్చు. మధ్నాహ్నం ఒంటి గంటకు కొత్తగూడెం చేరుకున్నాక యాత్ర పూర్తవుతుంది. మూడు రోజుల ప్యాకేజీలో టికెట్ ధర పెద్దలకు ఒక్కొక్కరికి రూ. 6వేలు, 12ఏళ్లలోపు పిల్లలకు రూ. 4వేలు నిర్ణయించారు.

మాది ములకలపల్లి మండలం. మాలాంటి పది మంది మహిళలకు ఆవులు, గేదెలు ఉండటంతో స్వచ్ఛమైన నెయ్యి విక్రయిస్తున్నాం. దీనికి అధికారుల నుంచి ధ్రువపత్రం ఉంది. రాములోరి క్షేత్రంలో ఏరు ఉత్సవాల సందర్భంగా స్టాల్ ఏర్పాటుకు అవకాశం లభించింది. ఆదరణ బాగుండటంతో ఈ రంగంలో రాణిస్తామనే నమ్మకం కలిగింది. టి.మంజుల, జి.లత

భద్రాచలం ఐటీడీఏ సహకారంతో రాగి, జొన్న, కొర్రలతో బిస్కెట్లు తయారు చేస్తుంటాం. ఏరు ఉత్సవం సందర్భంగా స్టాల్‌లో వీటిని ఉంచుతున్నాం. పర్యాటకులు తిని మెచ్చుకుంటున్నారు. పర్యాటకుల సంఖ్య పెరిగే అవకాశముంది. మాకు ఉపాధి లభిస్తుందనే భరోసా కలిగింది.


టి.లలిత, వి.వెంకటలక్ష్మి

భద్రాచలంలో బ్యూటీషియన్ శిక్షణ తీసుకున్నాం. తక్కువ పెట్టుబడితో మేం ఏర్పాటుచేసిన మెహందీ స్టాల్‌కు ఆదరణ లభిస్తోంది. ముక్కోటి, ఏరు ఉత్సవాల కోసం వచ్చేవారు మెహందీకి ప్రాధాన్యమిస్తుండటంతో స్వయం ఉపాధిపై మాకు నమ్మకం ఏర్పడింది. ఈ ప్రాంత యువతకు ఇదో చక్కని అవకాశం.

ఎం.రేణుక, కె.పావని, ఎస్.దుర్గ

# గోదావరిలోకి దారి వేసి..ఇసుకను కాజేసి

కడెం: కడెం మండలం లింగాపూర్ గోదావరి రేవు నుంచి ఇసుకను తరలిస్తున్నారు. ఇందుకు గ్రామ కమిటీకి కొంత రుసుము చెల్లించి ఆమోదం పొందినట్లు సమాచారం. అదే అదనుగా ఇలా నేరుగా దారి వేసుకుని గోదావరి నుంచి ఇసుకను తెచ్చి ఒడ్డున కుప్పలుగా పోస్తున్నారు. ఇక్కడి నుంచి వాహనాల్లో ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కడెం మండలంలోని గోదావరి రేవుల వెంట ఇలా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇలా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీని కోల్పోయే అవకాశముంది. ఇలాంటి



అక్రమ దందాపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. కాగా ఇసుక రవాణాకు ఎవరికీ అనుమతులు లేవని, తమ సిబ్బందిని అప్రమత్తం చేశామని, డంపులు ఉంటే సీజ్ చేస్తామని, తరలిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సుజాత పేర్కొన్నారు. ట్రాక్టర్‌లో మట్టిని గోదావరి నదిలోకి తీసుకెళుతున్నారు చూశారా.. గ్రామంలో అయితే ఏదో దారి వేసేందుకో, ఇంటి అవసరాలకో అనుకోవచ్చు. కానీ ఏకంగా గోదావరిలోకి మట్టి ట్రాక్టర్లను ఎందుకు తీసుకెళుతున్నారంటే గోదావరిలోనూ దారి నిర్మించేందుకే. అవును గోదావరి మధ్యలో ఇసుక తెట్టెలుగా ఉంది. అక్కడి వరకు ట్రాక్టర్లు వెళ్లాలంటే మొదట దారి వేసుకోవాలి. ఇందుకు ఎవరి అనుమతీ అక్కర లేదు. దర్జాగా మట్టి తరలించి గోదావరిలో దారి ఏర్పాటు చేసుకుని ఇసుకను అక్రమంగా తరలించడమే వీరి ఉద్దేశం.




విశాఖ: మధురవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో దారుణం చోటు చేసుకుంది. స్వయంకృషి నగర్‌లో ఓ అమ్మాయి, ఆమె తల్లిపై ప్రేమోన్మాది దాడి చేశాడు. ఈ ఘటనలో తల్లి మృతి చెందగా.. కుమార్తెకు తీవ్రగాయాలయ్యాయి. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. స్థానికుల సమాచారం ప్రకారం.. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఓ యువకుడు బాధితురాలు దీపిక ఇంట్లోకి చొరబడి యువతి, ఆమె తల్లిపై కిరాతకంగా కత్తితో దాడి చేసి పారిపోయాడు. ఈ ఘటనలో తల్లి లక్ష్మి(43) అక్కడికక్కడే మృతి చెందగా.. తీవ్ర గాయాలైన దీపికను స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

దీపిక డిగ్రీ చదువుకొని ఇంట్లోనే ఉంటోంది. యువతిని ప్రేమించిన నవీన్ అనే వ్యక్తి ఈ దాడి చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధరణకు వచ్చారు. దర్యాప్తులో భాగంగా బృందాలుగా ఏర్పడిన పోలీసులు నవీన్ కోసం గాలింపు చేపట్టారు. నిందితుడిని శ్రీకాకుళం సమీపంలో అదుపులోకి తీసుకొని విశాఖ తరలిస్తున్నట్లు సీపీ శంఖబ్రత బాగ్చీ తెలిపారు. ఘటన జరిగిన కొన్ని గంటల్లోనే నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు.

**కఠిన చర్యలు తీసుకోవాలి: పోలీసులకు సీఎం ఆదేశం...** ప్రేమోన్మాది ఘాతుకంపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత యువతికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు.

**స్పందించిన హోంమంత్రి అనిత....** ఈ ఘటనపై హోంమంత్రి అనిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విశాఖ సీపీ శంఖబ్రత బాగ్చీతో ఫోన్‌లో మాట్లాడి.. బాధితురాలు దీపిక ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. యువతికి మెరుగైన వైద్యం అందించాలన్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని పోలీసులను మంత్రి ఆదేశించారు.




పీసీ పల్లి: 'యువగళం' పాదయాత్ర సమయంలో ప్రజల కష్టాలను నేరుగా చూశానని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. గత ఐదేళ్లు రాష్ట్రంలో విధ్వంస పాలన కొనసాగిందని చెప్పారు. ప్రకాశం జిల్లా పీసీ పల్లి మండలం దివాకరపల్లి సమీపంలో రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేయనున్న కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్(సీబీజీ)కు లోకేశ్ శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. "ఉమ్మడి ప్రకాశం జిల్లా అంటే గుర్తొచ్చేది ప్రేమ, పౌరుషం. ఈ జిల్లాకు సీఎం చంద్రబాబు, తెదేపా అంటే చాలా గౌరవముంది. 2019లో ఎదురుగాలి ఉన్నా ఇక్కడి నుంచి నలుగురిని తెదేపా ఎమ్మెల్యేలుగా గెలిపించారు. 2024 ఎన్నికల్లో 10 సీట్లలో విజయం అందించారు. ఈ జిల్లాలో యువగళం పాదయాత్ర ప్రభంజనంలా సాగింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు గత ప్రభుత్వం ఏమీ చేయకపోగా వాటాలు ఇవ్వలేదని ఉన్న సంస్థలను తరిమేసింది. వైకాపా హయాంలో తీసుకొచ్చిన ఒక్క కంపెనీ పేరైనా చెప్పాలని డిమాండ్ చేస్తున్నా. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటి వరకు రూ.8లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయి. దానికి సంబంధించిన పనులు ప్రారంభించాం. దానిలో భాగంగానే బయో గ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నాం. ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నందుకు గర్వంగా ఉంది. ఈ ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు ఇవ్వాలన్నది ప్రభుత్వం ఆలోచన" అని లోకేశ్ అన్నారు.




## భక్తులకు మెరుగైన సేవలందించండి - టిటిడి పాలకమండలికి చంద్రబాబు ఆదేశం

వెలగపూడి – పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని భక్తులకు మరింత మెరుగైన సేవలదించాలని టిటిడి పాలకమండలికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.. సామన్య భక్తులకు పెద్ద పీట వేయాలని కోరారు. తిరుమల తిరుపతి దేవస్థానంపై ముఖ్యమంత్రి ఈరోజు టిటిడి పాలకమండలి సభ్యులతో సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యాలు మెరుగుపరిచేందుకు గత 9 నెలల కాలంలో తీసుకున్న చర్యలపై టీటీడీ ప్రజెంటేషన్ ఇచ్చింది. పెరుగుతున్న భక్తుల రద్దీ నేపథ్యంలో భవిష్యత్‌లో చేపట్టే చర్యలపై టీటీడీ పెద్దలతో సీఎం సమీక్ష జరిపారు. టీటీడీ దర్శనాలు, వసతితో పాటు వివిధ సేవలపై భక్తుల నుంచి సేకరించిన అభిప్రాయాలపైనా చర్చించారు. బ్రహ్మోత్సవాలు, రథసప్తమి, వైకుంఠ ఏకాదశి వంటి ప్రత్యేక సమాయాలతో పాటు%ా% సాధారణ రోజుల్లో భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు, వారి అభిప్రాయాలపైనా చర్చకు వచ్చింది. శ్రీవారి లడ్డూ ప్రసాదం, అన్న ప్రసాదంలో తీసుకువచ్చిన మార్పులపై నివేదికను సీఎం చంద్రబాబుకు టీటీడీ ఇచ్చింది. గ్యాలరీల్లో సౌకర్యాల పెంపు, మరింత మంది భక్తులకు అవకాశం కల్పించేలా మాఢవీధులలో ఏర్పాట్లు, అలిపిరిలో భక్తుల కోసం బేస్ క్యాంప్ నిర్మాణం, శ్రీ పద్మావతీ అమ్మవారి దేవాలయం అభివృద్ధి ప్రణాళిక, అమరావ తిలోని శ్రీవారి దేవాలయం అభివృద్ధి పనులు వంటి అంశాలపై సమీక్షలో చర్చించారు. తిరుమల ప్రతిష్ట పెంచడం, తిరుమల క్షేత్రాన్ని భక్తులకు మరింత దగ్గర చేయడం, సులభమైన, సౌకర్యవంతమైన సేవలకు సంబంధించి వివరాలను టీటీడీ అధికారులను అడిగి తెలుసుకున్నారు ముఖ్యమంత్రి. రాష్ట్రం వెలుపల ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న శ్రీవారి ఆలయాల పురోగతిపై సీఎంకు నివేదిక సమర్పించింది టీటీడీ. అనంతరం చంద్రబాబు భక్తుడికి, భగవంతుడికి అనుసంధానకర్తగా టిటిడి పాలకమండలి పనిచేయాలని కోరారు..

**అవసరమైన పనులే చేయండి...** ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ "తిరుమల దేవాలయంలో సేవలు బాగుంటే ప్రభుత్వానికీ మంచి పేరు వస్తుంది. గత ప్రభుత్వానికి నేటికీ ఇప్పటికే మార్పు కనిపించింది. అయితే ఆ మార్పు 100 శాతం ఉండాలి. అప్పుడే భక్తుల, ప్రజల అంచనాలను మనం అందుకోగలం. పెరుగుతున్న రద్దీ నేపథ్యంలో వచ్చే 50 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా టీటీడీని తీర్చిదిద్దాలి. ఏ పనులు అవసరమో ఆ పనులు మాత్రమే చేయాలి. శ్రీవారి డబ్బులు ఇష్టారీతిన ఖర్చు పెట్టవద్దు...మనం దేవాలయానికి ధర్మకర్తలం, నిమిత్తమాత్రులం మాత్రమే. శ్రీవారికి భక్తులు ఇచ్చే కానుకల సొమ్మును ఇష్టారీతిన ఖర్చుపెట్టే అధికారం ఎవరికీ లేదు. ఏడుకొండల వాడి సొమ్ము ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం కాకూడదు. వందల కోట్ల నిధులను అనేక కార్యక్రమలకు టీటీడీ ఖర్చు చేస్తోంది..దీనిపై ఇంటర్నల్ ఆడిటింగ్ తో పాటు....కాగ్ ద్వారా ఆడిట్ జరిపితే మంచిది. భక్తులు ఇచ్చే వితరణ, విరాళాలు ప్రతి రూపాయి సక్రమంగా ఖర్చు అవ్వాల్సిన అవసరం ఉంది. జవాబు దారీతనం ఉండాలి" అని సిఎం స్పష్టం చేశారు. "టీటీడీలో సమూల ప్రక్షాళన జరపుతాను అని నేను ఎన్నికల ముందు చెప్పాను. చెప్పిన విధంగానే అధికారంలోకి వచ్చిన తరువాత అనేక మార్పులు జరిగాయి. అయితే ఈ మార్పులు 100 శాతం ఉండాలి. ఎక్కడా పాతవాసనలు, పాత వ్యక్తులు కొనసాగకూడదు. అనుభవజ్ఞుల పేరుతో పాతవారిని ఇంకా కొనసాగించ వద్దు. ప్రక్షాళన అనేది 100 శాతం జరగాల్సిందే...దీనిలో మినహాయింపులు లేవు" అని సిఎం అధికారులకు సూచించారు.

**అలిపిరిలో బేస్ క్యాంప్...** సమీక్ష సందర్భంగా టీటీడీ బోర్డు తీసుకున్న పలు నిర్ణయాలను, పలు ప్రతిపాదనలను అధికారులు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. అలిపిరిలో భక్తుల కోసం బేస్ క్యాంప్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. 25 వేల మందికి సౌకర్యవంతంగా ఉ ండేలా ఈ బేస్ క్యాంప్ నిర్మాణం చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. అదే విధంగా 60 అనుబంధ దేవాలయాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్న విషయాన్ని, రాష్ట్రం వెలుపల ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న శ్రీవారి ఆలయాల పురోగతిని వివరించారు. శ్రీవారి సేవకుల విషయంలో కొత్తవారు 90 శాతం మంది ఉంటున్నారని అధికారులు చెప్పగా..సగం మంది పాతవారిని నియమించుకోవడం ద్వారా నాణ్యమైన సేవలు అందించవచ్చని తెలిపారు. తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి రోజుకు 25 వేల మంది వరకూ భక్తులు వస్తారని అధికారులు తెలపగా..దీనికి మరింత అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. బర్డ్ ఆసుపత్రికి డైరెక్టర్ నియామకం, జేఈవో, సివిఎస్‌వో, ఎస్వీబీసీ చైర్మన్ నియామకాలను త్వరలో చేపడతామని సీఎం చెప్పారు. టీటీడీ నుంచి 15 రకాల సేవలు వాట్సాప్‌లో అందిస్తామని అధికారులు చెప్పగా...వెంటనే వాట్సాప్ సేవలు ప్రారంభం కావాలని సీఎం సూచించారు. ప్రతి సేవకు ఆధార్, సెల్ ఫోన్ నెంబర్‌ను లింక్ చేయడం ద్వారా ఎక్కడా అక్రమాలు జరగకుండా ఉండటానికి అవకాశం ఉంటుందని సీఎం చెప్పారు. మరోవైపు పారిశుధ్య నిర్వహణపైనా దృష్టి పెట్టాలని సిఎం అన్నారు. తిరుమలలో పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు ఉన్న అన్ని అవకాశాలను వినియోగిచుంకోవాలన్నారు. టీటీడీ పరిధి మొత్తం 2,675 హెక్టర్లలో విస్తరించి ఉండగా....ఇందులో ప్రస్తుతం 68.14 శాతం పచ్చదనం ఉంది. దీనిని 80 శాతానికి తీసుకువెళ్లాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**టీటీడీ అనుబంధ ఆలయాల అభివృద్ధి :**అమరావతి రాజధానిలోని వెంకటపాలెంలో నిర్మించిన శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానాన్ని మరింత అభివృద్ధి చేయనున్నారు. చుట్టూ ప్రాకారం నిర్మాణంతో పాటు ఒక రాజగోపురం, మూడు గోపురాలు నిర్మించనున్నారు. దీనికి సంబంధించి త్వరలోనే టెండర్లు పిలుస్తారు. అలాగే ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయాన్ని విస్తరణ పనులతో పాటు సుందరంగా తీర్చిదిద్దనున్నారు. కరీంనగర్, కొడంగల్, నవీ ముంబై, బాంద్రా, ఉలుందుర్పేట, కొయంబత్తూరులో చేపట్టిన శ్రీవారి ఆలయాల నిర్మాణం-అభివృద్ధి కార్యక్రమాలపైనా ముఖ్యమంత్రి సమీక్షించారు.





గుంటూరు, ఏప్రిల్ 2: జిల్లా ఏసీబీ ఆఫీస్‌కు మాజీ సమాచార కమిషనర్ విజయ్ కుమార్ విచారణకు హాజరయ్యారు. విచారణకు తప్పనిసరిగా హాజరుకావాలని ఇటీవలే విజయ్ కుమార్‌ను హైకోర్టు ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలతో ఏసీబీ ఆఫీసుకు విజయ్ కుమార్ వచ్చారు. గత ప్రభుత్వంలో సమాచార శాఖ ద్వారా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారన్న ఆరోపణల నేపథ్యంలో ఏసీబీలో నమోదైన కేసుకు సంబంధించి ఈరోజు (బుధవారం) అప్పటి సమాచార కమిషనర్‌గా పనిచేసిన విజయ్‌కుమార్ ఏసీబీ విచారణకు హాజరయ్యారు. ఇప్పటికే కమషనర్‌గా పనిచేసిన విజయ్ కుమార్‌పై కేసు నమోదు చేసినప్పటికీ ఆయన విచారణకు రాకపోవడంతో ఇటీవలే హైకోర్టు ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ముందస్తు బెయిల్ ఇచ్చినప్పటికీ విచారణకు సహకరించాలని చెప్పామని, తప్పనిసరిగా విచారణకు హాజరుకావాల్సిందే అంటూ కొద్దిరోజుల క్రితం హైకోర్టు ధర్మాసనం ఆదేశాలు ఇచ్చింది. న్యాయస్థానం ఆదేశాల మేరకు ఈరోజు విజయ్‌కుమార్ ఏసీబీ ముందు విచారణకు వచ్చారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సమాచార శాఖ కమిషనర్‌గా పనిచేసిన విజయ్ కుమార్.. సాక్షి దినపత్రిక, సాక్షి మీడియాకు అడ్డగోలుగా ప్రభుత్వ ధనాన్ని దోచిపెట్టారని.. సాక్షి సిబ్బందికి కూడా ప్రభుత్వం నుంచి జీతాలు ఇచ్చారంటూ వచ్చిన ఆరోపణల నేపథ్యంలో కేసు నమోదు అయ్యింది. 2019 నుంచి 2024 వరకూ జరిగిన ఈ బాగోతంలో మొత్తం రూ.859 కోట్ల మేర ప్రభుత్వ ధనం విజయ్ కుమార్ చేతుల మీదుగా ఖర్చు చేశారు. ఇందులో సగానికి పైగా సాక్షి పత్రికకు అందించారన్న అభియోగాలపై గతేడాది నవంబరు 14న విజిలెన్స్ నివేదిక ఆధారంగా ఏసీబీ కేసు నమోదు చేసింది. అంతేకాకుండా మార్చి 18న విచారణకు రావాల్సిందిగా విజయ్ కుమార్‌కు నోటీసులు ఇవ్వగా... తీరిక చూసుకుని వస్తానంటూ సమాధానమిచ్చారు. ఆ వెంటనే ముందస్తు బెయిల్ కోసం విజయ్ హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ క్రమంలో విజయ్ కుమార్‌కు ఏసీబీ నోటీసులు జారీ చేసింది. ఈరోజు (ఏప్రిల్ 2) విచారణకు హాజరుకావాలని.. కేసు ప్రస్తుత దశలో ఉన్నందున అరెస్ట్ చేయబోమంటూ నోటీసుల్లో పేర్కొంది. అలాగే ఏసీబీ విచారణకు హాజరుకావాల్సిందే అంటూ హైకోర్టు కూడా స్పష్టం చేసింది. అలాగే ముందస్తు బెయిల్‌పై విచారణను ఏప్రిల్ మూడో వారానికి హైకోర్టు వాయిదా వేసింది.




పీసీపల్లి: ప్రకాశం జిల్లాలో కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్(సీబీజీ) ఏర్పాటుకు శంకుస్థాపన జరిగింది. పీసీపల్లి మండలం దివాకరపల్లి సమీపంలో రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేయనున్న ఈ ప్లాంట్‌కు ఏపీ మంత్రి నారా లోకేశ్ భూమి పూజ చేశారు. బయో ఫ్యూయల్ ఉత్పత్తిలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుంది. ప్రాజెక్టు కోసం రిలయన్స్ సంస్థ రూ.65 వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ఈ నిధులతో మొత్తం 500 సీబీజీ ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది. దీని ద్వారా సుమారు 2.5 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఈ ప్లాంట్ల ద్వారా వ్యవసాయ వ్యర్థాలను ఉపయోగించి హరిత, పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ప్రతి సీబీజీ ప్లాంట్ రోజుకు 22 టన్నుల ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉంటుంది. నిరుపయోగంగా ఉన్న దాదాపు 5 లక్షల ఎకరాల భూమిని ఎనర్జీ ప్లాంటేషన్ కోసం వినియోగించనున్నారు.

ఈ భూమి పూజ కార్యక్రమంలో మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా బాల వీరాంజనేయ స్వామి, పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రకాశం జిల్లాలో సీబీజీ ప్లాంట్‌కు శంకుస్థాపన.. సంతోషంగా ఉంది: సీఎం చంద్రబాబు



అమరావతి: పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలు ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులు, ఆవిష్కరణలకు ప్రధాన గమ్యస్థానంగా మారుస్తూనే ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రకాశం జిల్లా పీసీపల్లి మండలం దివాకరపల్లి సమీపంలో రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేయనున్న కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్(సీబీజీ)కు శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు. ఇది బయో ఇంధన రంగానికి ఒక ముఖ్యమైన ముందడుగన్నారు. రాబోయే 5 సంవత్సరాల్లో రిలయన్స్ 500 సీబీజీ ప్లాంట్‌లను స్థాపించి, బంజరు భూమిని ఆకుపచ్చ ఎరువులతో ఉత్పాదక వ్యవసాయ భూమిగా మారుస్తుందన్నారు. ఈ ప్రాజెక్టు 2.5 లక్షల మందికి ఉపాధి అవకాశాలను సృష్టిస్తుందన్నారు. ఇది ఆంధ్రప్రదేశ్ యువతకు పెద్ద ప్రోత్సాహాన్ని అందిస్తుందని తెలిపారు.

## వైసీపీ అంతా నాశనం చేసింది.. మంత్రి నారాయణ సీరియస్

విజయవాడ, ఏప్రిల్ 2: దేశంలోనే మొట్టమొదటిసారిగా సుజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సుజనా సర్వీస్ సెంటర్ మంత్రి నారాయణ ఈరోజు (బుధవారం) ప్రారంభించారు. ఈ సందర్భంగా సుజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ వాహనాలను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. 'సుజనా చౌదరి 2004 నుంచి నాకు పరిచయం. కేంద్ర మంత్రిగా ఆయనకు అపారమైన అనుభవం ఉంది. సుజనా ఫౌండేషన్ ద్వారా సుజనా మిత్రను ప్రారంభించినందుకు నా అభినందనలు. ఒక నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఆదర్శ నియోజకవర్గంగా చేసేందుకు తపన పడుతున్నారు. 2014-19లో ఇదే శాఖకు నేను మంత్రిగా ఉన్నా. ఇప్పుడు కూడా అదేశాఖకు మంత్రిగా ఉన్నాను. గతంలో మా శాఖలకు బడ్జెట్ ఉండేది పనులు జరిగేవి. ఇప్పుడు గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీల కింద బడ్జెట్ పోతుంది' అని తెలిపారు. రోజుకి 135 లీటర్ల నీరు ఇవ్వాలని రూ.5350 కోట్లు తెచ్చేలా 2019 ఫిబ్రవరిలో ఒప్పందం చేసుకున్నామన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక రాష్ట్ర వాటా చెల్లించకుండా ఆపేసిందని మండిపడ్డారు. గత ప్రభుత్వం నిధులు ఇచ్చి ఉంటే ప్రతి ఇంటికి మనిషికి 135 లీటర్ల నీరు అందేదన్నారు. మళ్ళీ సీఎం చంద్రబాబు చొరవతో నిధులు తీసుకొస్తున్నామని తెలిపారు. స్వచ్ఛాంధ్ర కింద యాభై శాతం కేంద్రం, యాభై శాతం రాష్ట్రం భరించాలన్నారు. కేంద్రం రూ.250 కోట్లు ఇస్తే... రాష్ట్రం రూ.150 కోట్లు మ్యాచింగ్ ఫండ్ ఇవ్వలేదని తెలిపారు. ఇలా అనేక పథకాలకు నిధులు రాకుండా గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిందని విమర్శించారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో ఇదే పరిస్థితి అవలంబించారన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక



ఆగిన నిధులు తెచ్చుకునేందుకు కష్టాలు పడుతోందని తెలిపారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల రాష్ట్రంలో మున్సిపాలిటీలు ఆదాయం కోల్పోయాయన్నారు. స్థానిక సంస్థలు అంటేనే సొంత నిధులతో స్వపరిపాలన చేయాలన్నారు. కానీ మూడు వేలకోట్లు గత ప్రభుత్వం దారి మళ్లించిందని ఆరోపించారు. స్థానిక సంస్థల హక్కులను కాలరాసిందని మండిపడ్డారు. నేడు ఏ మున్సిపాలిటీలో అయినా వచ్చిన ఆదాయం వారే ఖర్చు పెట్టుకునేలా సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారన్నారు. డ్రైనేజీ వర్కులు ఆగిపోతే... సీఎం అదేశాలతో మళ్లీ మొదలుపెట్టామన్నారు. ఉగాది రోజు పీ4ను చంద్రబాబు ప్రారంభించారని.. అదే స్పూర్తితో సుజనా చౌదరి తన ఫౌండేషన్ ద్వారా చేయడం గొప్ప విషయమని కొనియాడారు. తాను కూడా ఇతర నియోజకవర్గాల్లో ఈ తరహా సేవలు అందించేలా కృషి చేస్తానని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

## అక్రమ మైనింగ్ కేసు.. కాకాణి గోవర్ధన్‌కు మరోసారి నోటీసులు




హైదరాబాద్: అక్రమ మైనింగ్ కేసులో విచారణకు హాజరు కావాలంటూ వైకాపా నేత కాకాణి గోవర్ధన్ రెడ్డికి నెల్లూరు జిల్లా పోలీసులు మరోసారి నోటీసులు ఇచ్చారు. హైదరాబాద్‌లోని శ్రీనగర్ కాలనీలోని కాకాణి నివాసానికి వెళ్లిన కావలి డీఎస్పీ నేతృత్వంలోని పోలీసు బృందం.. ఆయనకు నోటీసులు ఇచ్చేందుకు ప్రయత్నించారు. కాకాణి ఇంట్లో లేరని చెప్పడంతో ఆయన బంధువులకు నోటీసులు ఇచ్చారు. అక్రమ మైనింగ్ కేసులో ఏప్రిల్ 3న (గురువారం) నెల్లూరు రూరల్ డీఎస్పీ ఎదుట విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నారు.

ఇప్పటికే రెండు సార్లు కాకాణికి నోటీసులు అందజేసినప్పటికీ ఆయన విచారణకు హాజరుకాకపోవడంతో మరోసారి నోటీసులు ఇచ్చారు.

## దేవకన్యలా.. మిత్రవిందగా.. బేబీ లుక్కు అదిరింది..!

షార్ట్ ఫిలిమ్స్ తో కెరీర్ మొదలు పెట్టి ఆ తర్వాత సినిమాల్లో సైడ్ రోల్స్ చేస్తూ బేబీతో హీరోయిన్ గా సూపర్ హిట్ అందుకున్న భామ వైష్ణవి చైతన్య. అమ్మడు హీరోయిన్ గా నటించిన ఫస్ట్ సినిమానే సూపర్ హిట్ అందుకుంది. ఐతే సెకండ్ మూవీగా చేసిన లవ్ మీ సినిమా మాత్రం ఫెయిల్ అయ్యింది. అయినా సరే అమ్మడు ఏమాత్రం జోష్ తగ్గకుండా సినిమాలు చేస్తుంది. ప్రస్తుతం సిద్ధు జొన్నలగడ్డ తో జాక్ సినిమా చేస్తుంది వైష్ణవి చైతన్య. ఆ సినిమాలో సిద్ధు తో మంచి రొమాంటిక్ ఎంటర్టైనర్ గా సినిమా చేస్తున్నట్టుగా ఉంది. బొమ్మరిల్లు భాస్కర్ డైరెక్షన్ లో వస్తున్న సినిమా కాబట్టి వైష్ణవి చైతన్య లక్కీగా ఫీల్ అవుతుంది. ఇక సినిమాలతో పాటు సోషల్ మీడియాలో తన ఫోటో షూట్స్ తో అలరిస్తుంది వైష్ణవి చైతన్య. రకరకాల ఫోటో షూట్స్ తో ఫ్యాన్స్ ని మెప్పిస్తుంది. లేటెస్ట్ గా అమ్మడు దేవకన్యగా మారి



ఫోటో షూట్ చేసింది. పండగ వైబ్ ని మరింత పెంచేలా వైష్ణవి లుక్ ఉంది. ముఖ్యంగా ఒక మహారాణి లుక్ తో కనిపిస్తుంది వైష్ణవి చైతన్య. ఈ ఫోటోలు చూసిన చాలామంది మగధీరలో మిత్రవిందకు ఏమాత్రం తీసిపోదనేలా ఉందని కామెంట్స్ చేస్తున్నారు. నిజమే అమ్మడి ఫోటో షూట్ ప్లానింగ్స్ ఎవరు ఇస్తున్నారో కానీ యువరాణి గెటప్ లో వైష్ణవి నిజంగానే దేవకన్యలానే కనిపిస్తుంది. జాక్ సినిమా హిట్ పడితే అమ్మడి కెరీర్ కు కాస్త బూస్టింగ్ వస్తుంది. ఐతే సినిమాల ఫలితాలు ఎలా ఉన్నా సోషల్ మీడియా ఫోటో షూట్స్ తో హంగామా చేస్తుంది వైష్ణవి చైతన్య. సో అందుకే ఆమె ఫోటో షూట్స్ కి స్పెషల్ క్రేజ్ ఏర్పడుతుంది. అంతేకాదు తన టీం కూడా వైష్ణవిని సోషల్ మీడియాలో బాగా బూస్ట్ చేస్తుంది. తప్పకుండా వైష్ణవికి ఇదంతా కలిసి వచ్చేలా ఉందని చెప్పొచ్చు. జాక్ సినిమా రిజల్ట్ ఏదైనా సరే వైష్ణవి తన ఫోటో షూట్స్ తో ప్రత్యేకమైన క్రేజ్ తెచ్చుకోవాలని చూస్తుంది. అందుకే ఆమె ఇలా ఫోటోస్ షేర్ చేయగానే అలా వైరల్ అవుతున్నాయి. తెలుగు అమ్మాయికి ఇక్కడ మంచి అవకాశాలు వస్తే మరికొంతమంది సినిమాల్లోకి వచ్చే ఛాన్స్ ఉంటుంది. అందుకే వారిలో కాన్ఫిడెన్స్ నింపేందుకు వైష్ణవి తన కెరీర్ బిల్డ్ చేసుకుంటుంది.

## మినీ డ్రెస్ సరే..హ్యాండ్ బ్యాగ్ ధర రూ. 3.20లక్షలు

అందానికి అందం ప్రతిభతో పూజా హెగ్డే దశాబ్ధం పైగానే కెరీర్ బండిని సజావుగా సాగించింది. ఇటీవల కొన్ని అవకాశాలు చేజారుతున్నా కానీ, తిరిగి కంబ్యాక్ అవుతున్న తీరు ఆశ్చర్యపరుస్తోంది. పూజా నటించిన యాక్షన్ డ్రామా దేవా (షాహిద్) ఓటీటీలో స్ట్రీమింగుకి వచ్చింది. ఇంతలోనే ప్రచారంలో బిజీగా ఉన్న పూజా ఇదిగో ఇలా కొత్త లుక్కుతో నెటిజనులను కవ్వించింది. ఈసారి ఫ్లోరల్ బొటానిక్ ప్రింటెడ్ గౌనులో బుట్ట బొమ్మ ప్రత్యక్షమైంది. ఇది సమ్మర్ స్పెషల్ డ్రెస్. గింగ్‌హామ్ ప్రింట్ తో 1930ల నుండి జెంజ్ ఫ్యాషన్‌వాదుల్లో చర్చగా మారిన వింటేజ్ లుక్ ఇది, ఎ-లిస్టర్ పూజా హెగ్డే ఈ ఎంపిక అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. తాజాగా పూజా అందమైన మినీ డ్రెస్‌ను



స్టైల్ చేసిన విధానం ఆకట్టుకుంటోంది. ఇక ఈ డ్రెస్ లో పూజా టోన్డ్ బాడీ అందంగా ఎలివేట్ అవుతోంది. ఇక ఈ మినీ డ్రెస్‌లో పూజా భంగిమలు ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. పూజా హెగ్డే తన తాజా పార్టీ లుక్ స్నాప్‌లను ఇన్‌స్టాలో అందంగా పోస్ట్ చేసింది. ఈ డ్రెస్‌లో అల్టిమేట్ ఐటీ-గర్ల్ వైబ్‌ను వైరల్ చేసింది. మినీ డ్రెస్ ని ఎలివేట్ చేస్తూ టాప్ యాంగిల్ షాట్‌లతో ఫోటోషూట్ ఆద్యంతం రక్తి కట్టించింది. పూజా పర్ఫెక్ట్ గింగమ్ మినీ డ్రెస్ తో రూ. 3,19,000 విలువైన ప్రాడా బ్యాగ్ ని ధరించి కనిపించింది. ఈ లుక్ కోసం పూజా హెగ్డే తెల్లటి సాక్స్ తో బ్లాక్ లోఫర్స్ ని ధరించింది. పూజా ప్రస్తుతం దళపతి విజయ్ సరసన జననాయగన్ చిత్రంలో నటిస్తోంది. రెట్రో, కాంచన 4 లాంటి చిత్రాల్లోను పూజా అవకాశాలు అందుకుంది. ఓ హిందీ చిత్రంలోను నటిస్తోంది.




# నాని గురి పెట్టాడంటే..




నేచురల్ స్టార్ నాని ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'హిట్ 3' ఇప్పుడు బాక్సాఫీస్ టార్గెట్‌గా మారింది. మే 1న ఈ సినిమా థియేటర్లలో విడుదల కాబోతున్న నేపథ్యంలో మేకర్స్ ప్రమోషన్ల వేగాన్ని పెంచారు. తాజాగా 30 డేస్ కౌంట్‌డౌన్ పోస్టర్‌ని రిలీజ్ చేశారు. ఇందులో నాని చేతిలో గన్ పట్టుకుని, నోరులో సిగార్‌తో పూర్తిగా యాక్షన్ మోడ్‌లో కనిపిస్తున్నాడు. ఈ పోస్టర్ ఒకే ఫ్రేమ్‌లో నాని పవర్ఫుల్ లుక్, కొత్త బాడీ లాంగ్వేజ్‌ను స్పష్టంగా చూపించింది. 'హిట్' ఫ్రాంచైజీలో ఇదే మూడో కేస్. గతంలో విశ్వక్ సేన్, అడివి శేష్‌లు చేసిన ఈ సిరీస్‌లో ఇప్పుడు నాని మెయిన్ లీడ్‌గా వచ్చారు. ఈ సినిమాకోసం నాని పూర్తిగా ట్రాన్స్‌ఫార్మేషన్‌కు లోనయ్యాడు. బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీలోనే కాదు.. క్యారెక్టర్ టోన్‌లోనూ మునుపెన్నడూ చూడని రఫ్ అండ్ టఫ్ స్టైల్‌ని తెచ్చారు. ఇటీవల వచ్చిన టీజర్ ఈ సంగతి చెప్పేసింది. కానీ అదే సమయంలో సినిమా మొదటి పాట మాత్రం అందరినీ ఆశ్చర్యపరిచింది. ప్రేమ బ్యాక్ డ్రాప్ లో ఫస్ట్ సింగిల్ ప్యూర్ మెలోడీగా ఆకట్టుకుంది. శ్రీనిధి శెట్టి - నాని మధ్య కెమిస్ట్రీ ఫ్రెష్‌గా అనిపించడంతో పాటు, హిట్ ఫ్రాంచైజీలో ఈసారి ప్రేమ కోణాన్ని కూడా టచ్ చేశారని తెలియజేసింది. ఈ సాంగ్‌లో నాని డిఫరెంట్ లుక్‌లో కనిపించడం, ప్రేమికుడిగా నటించడం సినిమా మల్టీ లేయర్డ్ నేరేషన్‌కి హింట్ ఇచ్చింది. దర్శకుడు శైలేష్ కొలను ఈసారి కథను మరింత పెద్ద లెవెల్‌లో ప్రెజెంట్ చేయడానికి సిద్ధమవుతున్నాడు. నాని ఇందులో వైలెంట్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నట్టు తెలుస్తోంది. ఇతని క్యారెక్టర్‌లోని బిగ్ ఛాలెంజ్ లతో ఉండే ఒత్తిడిని వేరే కోణంలో చూపించబోతున్నారని సమాచారం. ఇందుకోసం నాని తన నటనలో పెద్ద ఎత్తున మార్పులు తీసుకువచ్చాడు. ఈ సినిమా ఇప్పటికే మంచి బజ్‌ను క్రియేట్ చేస్తోంది. మే 1న రిలీజ్ కాబోతున్న నేపథ్యంలో మేకర్స్ ప్రతి వారం ఓ కొత్త అప్‌డేట్‌తో ప్రేక్షకులను ఎంగేజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ప్రొడక్షన్ వాల్యూస్, టెక్నికల్ టీమ్ విషయాల్లోనూ ఇది మరో లెవెల్‌లో ఉండబోతోంది. మిక్కీ జే మేయర్ అందించిన సంగీతం ఇప్పటికే పాజిటివ్ టాక్ తెచ్చుకుంది. వాల్ పోస్టర్ సినిమా, యునానిమస్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని భారీగా నిర్మిస్తున్నారు. మే 1న విడుదలయ్యే ఈ సినిమాపై ట్రేడ్ వర్గాల్లో మంచి అంచనాలే ఉన్నాయి. ఓ వైపు యాక్షన్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్.. మరోవైపు ఎమోషన్ మెలొడీ మిక్స్‌తో సినిమా బాక్సాఫీస్ వద్ద హిట్ అయ్యే అవకాశాలున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. మొత్తానికి, 'హిట్ 3' కౌంట్‌డౌన్ పోస్టర్‌తోనే ప్రేక్షకుల్లో హైప్ పెరిగిపోయింది. నాని గురి పెట్టాడంటే బ్లాస్ట్ అవ్వాల్సిందే అనేలా కామెంట్స్ అందుతున్నాయి.

## ప్రదీప్ మాచిరాజు అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి ట్రైలర్ టాక్..!




యాంకర్ గా సూపర్ సక్సెస్ అయిన ప్రదీప్ మాచిరాజు హీరోగా చేసిన తొలి ప్రయత్నం 30 రోజుల్లో ప్రేమించడం ఎలా. ఆ సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న ప్రదీప్ తన రెండో సినిమాకు చాలా గ్యాప్ తీసుకున్నాడు. ఇక ఫైనల్ ఆ అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి సినిమాతో మరోసారి ప్రేక్షకులను అలరించడానికి వస్తున్నాడు. ప్రదీప్ హీరోగా వస్తున్న ఈ సినిమాను దర్శక ద్వయం నితిన్ భరత్ లు డైరెక్ట్ చేశారు. ఈ సినిమాలో హీరోయిన్ గా మరో యాంకర్ దీపిక పిల్లి నటించింది. రీసెంట్ గా రిలీజైన అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి టీజర్ ఇంప్రెస్ చేయగా లేటెస్ట్ గా సినిమా నుంచి ట్రైలర్ రిలీజ్ చేశారు. ట్రైలర్ లో మెట్రో పాలిటిన్ సిటీకి ప్రాజెక్ట్ పని మీద వెళ్తాడు హీరో. అక్కడ అతని చెప్పిన పని మాత్రమే చేసే ఓని వాళ్లు. ఆ ఊళ్లో ఒక పెద్ద మనిషి అతనికి ఒక కూతురు. ఆ ఊళ్లో ఉన్న వాళ్లంతా ఆమెను ప్రేమలో పడేయాలని ట్రై చేస్తారు. కట్ చేస్తే ఒక సందర్భంలో ఆ అమ్మాయి వాళ్ల నాన్న ఈ 60 మందిలోనే ఒకరు తన కూతురిని పెళ్లి చేసుకోవాలని అంటాడు. ఇంతకీ అసలు ఆ ఊరి కథ ఏంటి.. హీరో అక్కడికి వెళ్లి ఏం చేశాడు అన్న కథతోనే అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి సినిమా వస్తుంది. ఈ సినిమా ట్రైలర్ ప్రదీప్ మాచిరాజు మార్క్ కామెడీ ఎంటర్టైనర్ గా ఉంది. ఈ రోం కాం ఎంటర్టైనర్ ట్రైలర్ ఇంప్రెస్ చేసింది. యాంకర్ గా తనకు స్మాల్ స్క్రీన్ పై ఉన్న ఇమేజ్ ని పర్ఫెక్ట్ గా సినిమాల్లో కూడా వాడుతున్నాడు ప్రదీప్. సినిమాలో ఎంటర్టైన్మెంట్ పాళ్లు ఎక్కువే అన్నట్టుగా కనిపిస్తుంది. రథన్ మ్యూజిక్ ఇంకా సినిమాటోగ్రఫీ కూడా బాగానే ఉండేలా ఉన్నాయి. తొలి సినిమా తర్వాత రెండో ప్రయత్నానికి చాలా గ్యాప్ తీసుకున్న ప్రదీప్ ఒక మంచి ప్రాజెక్ట్ తోనే వస్తున్నారని చెప్పొచ్చు. ప్రదీప్ తో పాటుగా సత్య, దీపిక పిల్లి కూడా అలరించేలా ఉన్నారు. ఏప్రిల్ 11న రిలీజ్ అవుతున్న ప్రదీప్ అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి సినిమా ఎలాంటి ఫలితాన్ని అందిస్తుందో చూడాలి. ట్రైలర్ మాత్రం ఆకట్టుకునేలా ఉంది. బుల్లితెర మీద యాంకర్స్ గా అలరించిన ప్రదీప్, దీపిక ఇలా ఒక సినిమాలో కలిసి నటించడం కూడా స్మాల్ స్క్రీన్ ఆడియన్స్ ని ఎగ్జైట్ చేస్తుంది.

## మహానటి ఇక్కడ నిల్.. అక్కడ బిజీ


'మహానటి' సినిమాతో టాలీవుడ్‌తో పాటు పాన్ ఇండియా రేంజ్‌లో గుర్తింపు దక్కించుకున్న హీరోయిన్ కీర్తి సురేష్. మహానటి తర్వాత టాలీవుడ్‌లో బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేసిన కీర్తి సురేష్ గత రెండేళ్లుగా కొత్త సినిమాలు చేయడం లేదు. ఈమె తెలుగులో చివరగా దసరా సినిమాలో హీరోయిన్‌గా నటించింది. నానితో కలిసి నటించిన ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. అయినా కూడా కీర్తి సురేష్‌కి టాలీవుడ్ నుంచి స్టార్ హీరోల సినిమాల్లో నటించే అవకాశాలు దక్కడం లేదు. ఒకటి రెండు చిన్న సినిమాల్లో ఛాన్స్ వచ్చినా వాటిని కీర్తి సున్నితంగా తిరస్కరించిందని తెలుస్తోంది. స్టార్ హీరోలు కీర్తి సురేష్‌ను హీరోయిన్‌గా పరిగణలోకి తీసుకోవడం లేదు అనేది సినీ విశ్లేషకుల మాట. టాలీవుడ్‌లో పెద్దగా సినిమాల్లో అవకాశాలు లేకపోయినా కోలీవుడ్, బాలీవుడ్‌లో కీర్తి సురేష్ వరుస సినిమాలు చేస్తూ బిజీగా ఉంది. కోలీవుడ్‌లో ప్రస్తుతం ఈమె రెండు సినిమాలు చేస్తోంది. మరో రెండు సినిమాలకు సంబంధించిన



చర్చలు జరుగుతున్నాయని సమాచారం అందుతోంది. పెళ్లి తర్వాత కూడా కోలీవుడ్‌లో మోస్ట్ బిజీ హీరోయిన్‌గా కొనసాగుతోంది. తమిళ్ స్టార్ హీరోలకు జోడీగా నటించే అవకాశాలను ఈ అమ్మడు సొంతం చేసుకుంటుంది. తెలుగులో మాత్రం ఈమెకు స్టార్ హీరోల నుంచి పిలుపు రావడం లేదు. మరో వైపు బాలీవుడ్‌లోనూ ఈమె వరుసగా సినిమాల్లో నటించేందుకు రెడీ అవుతోంది. ఈ అమ్మడు బాలీవుడ్‌లో బేబీ జాన్ సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. తమిళ్ సూపర్ హిట్ సినిమాకు రీమేక్‌గా వచ్చిన 'బేబీ జాన్' సినిమా బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద బొక్కబోర్లా పడింది. దాంతో బాలీవుడ్‌లో ఈమెకు ఆఫర్లు రాకపోవచ్చు అనే అభిప్రాయం వ్యక్తం అయింది. కానీ బేబీ జాన్ ఫలితంతో సంబంధం లేకుండా వెంటనే అక్క అనే వెబ్ సిరీస్‌లో రాధిక ఆప్టేతో కలిసి నటించే అవకాశంను సొంతం చేసుకుంది. త్వరలోనే అక్క వెబ్ సిరీస్ స్ట్రీమింగ్ కాబోతుంది. మరో వైపు రివాల్వర్ రీటా గాను కీర్తి సురేష్ కనిపించబోతుంది. బాలీవుడ్‌లో సీరియస్‌గా ప్రయత్నాలు చేస్తున్న కీర్తి సురేష్‌కి ఏకంగా రణబీర్ కపూర్‌కి జోడీగా నటించే అవకాశాలు దక్కాయనే వార్తలు వస్తున్నాయి. బాలీవుడ్ మీడియాలో ఈ విషయమై ప్రముఖంగా కథనా లు వస్తున్నాయి. కీర్తి సురేష్ హిందీ కమర్షియల్‌కి సెట్ కాకపోవచ్చు అనే అభిప్రాయంను మొదట్లో చాలా మంది వ్యక్తం చేశారు. నార్త్ హీరోయిన్స్ మాదిరిగా ఈ అమ్మడు పెద్దగా స్కిన్ షో చేయదు. పైగా రొమాంటిక్ సీన్స్‌లో నటించదు. కనుక బాలీవుడ్ సినిమాల్లోనే కాకుండా సౌత్ సినిమా ఇండస్ట్రీలోనూ ఎక్కువ కాలం కొనసాగడం కష్టం అనే అభిప్రాయంను కొందరు వ్యక్తం చేశారు. కానీ కీర్తి సురేష్ జోరు చూస్తూ ఉంటే బాలీవుడ్‌లో రాబోయే రోజుల్లో వరుసగా సినిమాలు చేసే అవకాశాలు ఉన్నాయి. రణబీర్ కపూర్‌తో సినిమా కన్ఫర్మ్ అయిందనే వార్తలు వస్తున్న నేపథ్యంలో రాబోయే రెండేళ్లలో కీర్తి సురేష్ హిందీ సినిమా ఇండస్ట్రీలో అర డజనుకు పైగా సినిమాలకు కమిట్ అయ్యే అవకాశాలు ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. టాలీవుడ్‌లో ఆఫర్లు లేని ఈ రీల్ మహానటికి బాలీవుడ్, కోలీవుడ్‌లో ఫుల్ బిజీగా ఆఫర్లు చేతిలో ఉన్నాయి. రాబోయే రోజుల్లోనూ అక్కడ బిజీ బిజీగా సినిమాలు చేసే అవకాశాలు ఉన్నాయి.

## మల్లె చెండు ఒళ్లంతా చుట్టుకుని కలకలం రేపిన నటి

కొత్తొక వింత పాతొక రోత! పాత సంవత్సరానికి భాయ్ చెప్పి కొత్త సంవత్సరానికి వెల్ కం చెప్పింది కన్నడ నటి రాగిణి ద్వివేది. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఇదిగో ఇలా కొత్తగా కొంగొత్తగా తనని తాను పరిచయం చేసుకుంది. గతాన్ని తలుచుకుని సమయాన్ని వృధా చేసేందుకు రాగిణి సిద్ధంగా లేదు. భవిష్యత్ గురించి మాత్రమే ఆలోచిస్తోంది. అందుకే రాగిణి ద్వివేది ఉగాది స్పెషల్ ఫోటోషూట్ తో అభిమానుల ముందుకు వచ్చింది. ఇదిగో ఇలా మల్లె చెండును ఒంటికి చుట్టుకుని, జెరీ అంచు బంగారు వర్ణం సిల్కు చీరలో దేవతా సుందరిలా మెరిసిపోతోంది. అలా పానుపుపై జేరబడి, మల్లెలను ముంజేతికి కట్టుకుని సువాసన పీలుస్తూ, అసలు రాగిణి ఇచ్చిన ఫోజ్‌లు కుర్రకారులో కలకలం రేపుతున్నాయి. పానుపుపై బంతిపూల దండల మధ్య రాగిణి రసరమ్యంగా మెరిసిపోతోంది. ఒక కొత్త సంవత్సరం, ఒక కొత్త అధ్యాయం - దానిని ఆశ - దృఢ



సంకల్పంతో స్వీకరించండి! ప్రతి సూర్యోదయం ఒక కొత్త అవకాశాన్ని తెస్తుంది - దీనిని అద్భుత ప్రారంభంగా చేసుకోండి! పండుగ రంగులు మీ జీవితాన్ని ఆనందం, శ్రేయస్సు విజయంతో చిత్రించాలి. కొత్త సీజన్ వికసించినప్పుడు, ఈ పండుగలో మీ కలలు వాస్తవంలోకి వికసించాలి.. అనే అందమైన క్యాప్షన్ ని ఈ ఫోటోలకు జోడించింది.రాగిణి ద్వివేది కన్నడ నాట అగ్ర కథానాయిక. స్టార్ హీరోల సరసన నటించిన ఈ బ్యూటీ పేరు ఇంతకుముందు డ్రగ్స్ స్కాండల్ లో వినిపించింది. కొద్దిరోజుల పాటు జైలు జీవితాన్ని కూడా అనుభవించి బయటకు వచ్చింది. ఇటీవల తిరిగి తన కెరీర్ పై నే ఫోకస్ చేసింది. జీవితంపై పాజిటివ్ ధృక్పథం కలిగి ఉన్న రాగిణికి మునుముందు నటిగా మంచి అవకాశాలు దక్కాలని ఆకాంక్షిద్దాం. రాగిణికి ఉగాది శుభాకాంక్షలు.




దిల్లీ: బీసీ సంక్షేమ సంఘం జాతీయ కమిటీ ఆధ్వర్యంలో దిల్లీ జంతర్‌మంతర్ వేదికగా బీసీ సంఘాల ధర్నా కొనసాగుతోంది. ఈ కార్యక్రమానికి హాజరైన తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "బీసీల గొంతు వినిపించడానికే ఈ కార్యక్రమం ఏర్పాటు చేశాం. జనాభా ఎంతో తెలియకుండా రిజర్వేషన్లు ఇవ్వడానికి లేదని కోర్టులు చెప్పాయి. స్థానిక సంస్థలు, చట్ట సభల్లో రిజర్వేషన్లు కావాలంటే జనాభా తేలాలి. జనగణనతో పాటు కులగణన చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకుంది. దామాషా ప్రకారం నిధులు, నియామకాలు చేపట్టాలనేది మా పార్టీ నిర్ణయం. బీసీలను బలపర్చాలనే ఆలోచనకు భాజపా వ్యతిరేకం. బీసీల లెక్కలు తేల్చాల్సి వస్తుందని 2021 జనాభా లెక్కలను వాయిదా వేశారు. జనగణనతోపాటు కులగణన చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఆ నివేదిక ప్రకారమే రిజర్వేషన్లు అమలు చేయాలి" అని సీఎం అన్నారు.




## కంచ గచ్చిబౌలి భూముల్లో పనులు ఆపాలి: తెలంగాణ హైకోర్టు

హైదరాబాద్: నగరంలోని కంచ గచ్చిబౌలి భూములపై వట ఫౌండేషన్, హెచ్‌సీయూ విద్యార్థులు దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై తెలంగాణ హైకోర్టులో వాదనలు కొనసాగాయి. వాదనలు విన్న ధర్మాసనం.. కంచ గచ్చిబౌలి భూముల్లో ఏప్రిల్ 3 (గురువారం) వరకు పనులు ఆపాలని ఆదేశించింది. పిటిషన్‌పై తదుపరి విచారణను ఏప్రిల్ 3వ తేదీకి వాయిదా వేసింది. కంచ గచ్చిబౌలి భూములను జాతీయ ఉద్యానవనంగా ప్రకటించాలని వట ఫౌండేషన్, హెచ్‌సీయూ విద్యార్థులు ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై ఉన్నత న్యాయస్థానంలో వాదనలు కొనసాగాయి. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) తరఫున ఎల్. రవిశంకర్ వాదనలు వినిపించారు. "గత ఏడాది జూన్‌లో రాష్ట్ర ప్రభుత్వం జీవో 54 తీసుకొచ్చింది. ఈ జీవో ప్రకారం 400 ఎకరాల ప్రభుత్వ భూమిని టీజీఐఐసీ(%ు+××జ%)కి ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఒకవేళ అది ప్రభుత్వ భూమి అయినా సుప్రీంకోర్టు తీర్పులకు లోబడే ప్రభుత్వాలు పని చేయాల్సి ఉంటుంది. కంచ గచ్చిబౌలి భూముల వద్ద భారీ వాహనాలను ఉపయోగించి చెట్లను కొట్టేసి, భూమిని చదును చేస్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అటవీ ప్రాంతాన్ని కొట్టివేయాలంటే నిపుణుల కమిటీ వేయాలి. వన్య ప్రాణులు ఉన్న చోట భూములు చదును చేయాలంటే నిపుణుల కమిటీ పర్యటించాలి. నెల రోజుల పాటు అధ్యయనం చేయాలి. అక్కడ మూడు లేక్‌లు ఉన్నాయి. రాక్స్ ఉన్నాయి. ఎన్నో రకాల అరుదైన జంతువులున్నాయి. వాటిని పరిరక్షించాల్సిన అవసరం ఉంది. అయితే, ఇక్కడ సర్వోన్నత న్యాయస్థానం మార్గదర్శకాలకు విరుద్ధంగా అధికారులు వ్యవహరిస్తున్నారు. కొన్ని రోజులుగా ఈ భూముల దగ్గర ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి" అని కోర్టుకు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. "2004లో ఈ భూమిని ఐఎంజీ అకాడమీకి అప్పగించారు. ఒప్పందం ప్రకారం ఐఎంజీ ఈ భూములను వినియోగించలేదు. దీంతో అప్పటి ప్రభుత్వం కేటాయింపును రద్దు చేసింది. ఆ భూముల్లో అటవీ భూమి అని ఎక్కడా లేదు. దీనికి ఆనుకొని ఉన్న హెచ్‌సీయూ భూముల్లో భారీ భవనాలు నిర్మించారు. నాలుగు హెలీప్యాడ్‌లున్నాయి. హైదరాబాద్‌లోని చాలా ప్రాంతాల్లో పాములు, నెమళ్లు, చెట్లు ఉన్నాయి. పిటిషనర్ల వాదనల ప్రకారం ఆయా ప్రాంతాలను కూడా అటవీ భూములుగా ప్రకటించాల్సి ఉంటుంది. ఈ లెక్కన హైదరాబాద్ మహానగరంలో ఎక్కడా నిర్మాణాలు చేపట్టకూడదు" అని ఏజీ వాదనలు వినిపించారు. ఇప్పటివరకు ఈ భూమి అటవీ భూమి అని ఒక్క వాదన కూడా లేదు. కంచ గచ్చిబౌలి భూములు.. అటవీ భూములని ప్రభుత్వం సైతం ఎక్కడా నోటిఫై చేయలేదన్నారు. ఇది పూర్తిగా పరిశ్రమలు, ఇతర అవసరాలకు కేటాయించిన స్థలం మాత్రమేనని.. అటవీ భూమి కానే కాదన్నారు. నిజాం కాలం నుంచి ఈ భూమి.. బీడు భూమిగానే ఉందని కోర్టుకు తెలిపారు. అయితే, ఈ 400 ఎకరాలు పరిశ్రమల భూమి అని రికార్డుల్లో ఎక్కడైనా ఉందా? అని హైకోర్టు ఏజీని ప్రశ్నించింది. సర్వే నెంబర్ 25లో ఉన్న ఈ భూములను పలు అవసరాలకు కేటాయిస్తూ వచ్చారని న్యాయస్థానానికి తెలిపారు. ఇరువైపుల వాదనలు విన్న ధర్మాసనం రేపటి వరకు ఆ భూముల్లో పనులు ఆపాలని ఆదేశిస్తూ.. పిటిషన్‌పై విచారణను వాయిదా వేసింది.

## ఎల్ఆర్ఎస్ రాయితీ గడువును పొడిగించిన తెలంగాణ ప్రభుత్వం

హైదరాబాద్: లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం(ఎల్ఆర్ఎస్) రాయితీ గడువును తెలంగాణ ప్రభుత్వం పొడిగించింది. ఏప్రిల్ నెలాఖరు వరకు పొడిగిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. గత నాలుగేళ్లుగా పెండింగులో ఉన్న ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేసుకునే వీలును ప్రభుత్వం కల్పించిన విషయం తెలిసిందే. ఎల్ఆర్ఎస్ ఫీజును 25% రాయితీతో చెల్లించేందుకు మార్చి 31 వరకు గడువు ఇచ్చింది. తాజాగా ఆ గడువును ఏప్రిల్ 30 వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. రాయితీపై ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించినప్పటికీ ఆశించిన మేర రిజిస్ట్రేషన్లు జరగలేదు. ప్రజల నుంచి ప్రభుత్వం అనుకున్నంతమేర స్పందన రాలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పొడిగింపు నిర్ణయం తీసుకుంది.



## బీసీ రిజర్వేషన్ల పై సీఎం రేవంత్ రెడ్డికి బండి సంజయ్ కౌంటర్



బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని ఆ అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది కదా అని సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను పెంచేందుకు కేంద్రం ఆమోదం తెలపాలని సీఎం రేవంత్ రెడ్డి ఇవాళ ఢిల్లీ వేదికగా జరిగిన బీసీ మహా గర్జన ధర్నాలో చేసిన వ్యాఖ్యలపై కౌంటర్ ఇచ్చారు బండి సంజయ్. రాజ్యాంగం లోని ఆర్టికల్ 243 ప్రకారం.. ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం సొంతంగా డెడికేషన్ కమిషన్ వేసుకొని చట్ట ప్రకారం బీసీ రిజర్వేషన్లను అమలు చేసుకునే అధికారం ఉందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొందని గుర్తు చేశారు. ఎన్నికల్లో ఆ హామీ ఇచ్చే సమయంలో మోడీ ప్రభుత్వాన్ని సంప్రదించి ఇచ్చారా..? ఇప్పుడు ఎందుకు మోడీ ప్రభుత్వం పై నెట్టి తప్పించుకోవాలని చూస్తున్నారని ప్రశ్నించారు. రాజ్యాంగ పుస్తకాన్ని చేతులు పట్టుకొని షో చేయడం కాదు ఆ రాజ్యాంగంలో ఏముందో అర్థం చేసుకొని అమలు చేయాలని ఇంగిత జ్ఞానం కాంగ్రెస్ నేతలకు లేదని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కాంగ్రెస్కు స్పష్టమైన మెజార్టీ ఉంది. టిఆర్ఎస్ సపోర్ట్ కూడా ఉంది. అలాంటప్పుడు బిజెపి పై నేపము ఎందుకు నేర్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు బండి సంజయ్.

## బీసీలు దేశానికి వెన్నెముక.. రిజర్వేషన్లకోసం గట్టిగా కొట్లాడుదాం: విజయశాంతి

న్యూఢిల్లీ: కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయ శాంతి బీసీ రిజర్వేషన్లపై కీలక వ్యాఖ్యలు చేశారు. బీసీలు దేశానికి వెన్నెముకలాంటి వారు.. బీసీలకు న్యాయం జరగకపోతే దేశానికి న్యాయం జరగనట్లే అవుతుందన్నారు విజయశాంతి. బీసీ రిజర్వేషన్లకోసం ఉడుం పట్టు పట్టాల్సిన అవసరం వచ్చిందన్నారు. బీసీ రిజర్వేషన్లను రాహుల్ గాంధీ లేవనెత్తారు..అందుకు అనుగుణంగా తెలంగాణ అసెంబ్లీలో కూడా బీసీ రిజర్వేషన్లపై తీర్మానం చేశారు. బీసీలకు న్యాయం జరిగే వరకు 42 శాతం బీసీలకు రిజర్వేషన్ల వచ్చే వరకు పోరాటం చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే విజయశాంతి అన్నారు. బుధవారం (ఏప్రిల్2) ఢిల్లీలో జంతర్ మంతర్ దగ్గర బీసీ పోరు గర్జన నిర్వహించారు. బీసి బిల్లుకు అన్ని పార్టీలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ఈ సందర్భంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు అయ్యేందుకు తెలంగాణ ప్రభుత్వంతో కలసి కొట్లాడేందుకు సిద్ధంగా ఉన్నామని డీఎంకే,ఎస్పీపీలు ప్రకటించాయి.

**తెలంగాణ, తమిళనాడు కలిసి కొట్లాడుతాం: కనిమొళి....**

బీసీ రిజర్వేషన్లకు తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు డీఎంకే ఎంపీ కనిమొళి తెలిపారు. బీసీ రిజర్వేషన్ల బిల్లుకు మద్ధతు ఇస్తున్నామని, ఈ విషయంలో తెలంగాణకు ఎల్లవేళలా మద్ధతు ఉంటుందని అన్నారు. తెలంగాణలో 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం సంతోషం.. కేంద్ర పదవుల్లో బీసీలకు ప్రాతినిధ్యం తక్కువగా ఉందని అన్నారు. అందుకోసం దేశవ్యాప్త కులగణన జరపి బీసీలకు వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు.




హైదరాబాద్ : బీఆర్ఎస్ పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలపై కసరత్తు మొదలు పెట్టింది. ఆ పార్టీ చీఫ్ , మాజీ సీఎం కేసీఆర్ కొన్ని రోజుల నుంచి ఉమ్మడి జిల్లాల వారీగా ఎర్రవెల్లిలోని తన ఫామ్ హౌస్ లో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఇవాళ ఏప్రిల్ 2న సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి ఫామ్ హౌస్ లో ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లా నేతలతో కేసీఆర్ సమావేశం ముగిసింది. ఏప్రిల్ 27న వరంగల్ లో జరగనున్న బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ వేడుకలు, మహాసభపై సమావేశంలో చర్చించారు. నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు జరుపుకోవాలని నేతలకు దిశానిర్దేశం చేశారు కేసీఆర్. నియోజకవర్గానికి లక్ష మందికి తగ్గకుండా సభకు తరలి వచ్చేలా ప్లాన్ చేసుకోవాలని ఆదేశించారు. మహాసభ ప్రజలకు మనోధైర్యం వచ్చేలా ఉండాలన్నారు. మహా సభకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చూసుకోవాలని పార్టీ నేతలకు సూచించారు. ఈ సమావేశానికి కేసీఆర్ తో పాటు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్ రావు , సునీతా లక్ష్మారెడ్డి, పద్మాదేవెందర్ రెడ్డి, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, గంపగోవర్ధన్, గణేష్ బిగాల గుప్త, జాజుల సురేందర్ పలువురు మాజీ ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఏప్రిల్ 1న ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో కేసీఆర్ భేటీ అయిన సంగతి తెలిసిందే. ఏప్రిల్ 27న జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లపై నేతలకు దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభ కోసం తెలంగాణ ప్రజలు ఎంతో ఆతృతగా ఎదురు చూస్తున్నారని.. ప్రజలు స్వచ్ఛందంగా బహిరంగ సభకు తరలివస్తారని అన్నారు. సభకు వచ్చే జనానికి అనుగుణంగా విస్తృత ఏర్పాట్లు చేయాలని నేతలను ఆదేశించారు.




దిల్లీ: ఎమ్మెల్యేల అనర్హతపై నాలుగేళ్లు స్పీకర్ చర్యలు తీసుకోకపోయినా కోర్టులు చూస్తూ ఉండాల్సిందేనా అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. కోర్టులు రాజ్యాంగ పరిరక్షకులుగా వ్యవహరిస్తాయని జస్టిస్ బీఆర్ గవాయ్ పేర్కొన్నారు. భారాస ఎమ్మెల్యేలు పార్టీ మారిన వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. తెలంగాణ స్పీకర్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. హైకోర్టు ఆదేశాలు ఇచ్చినా తగిన చర్యలు తీసుకోలేదని సుప్రీంకోర్టులో ఇటీవల భారాస నేతలు పిటిషన్ దాఖలు చేశారు. ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై గత వారం వాదనలు ముగిశాయి. తాజాగా స్పీకర్ తరఫున రోహత్గీ వాదనలు వినిపిస్తూ పలు అంశాలను కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. "స్పీకర్‌కు రాజ్యాంగం కల్పించిన విశేషాధికారాలను కోర్టులు హరించలేవు. ఒకసారి ఆయన నిర్ణయం తీసుకున్నాకే జ్యుడిషియల్ సమీక్షకు అవకాశముంటుంది. స్పీకర్ కాలపరిమితితో నిర్ణయం తీసుకోవాలని కోర్టు చెప్పడం భావ్యం కాదు. ఒకవేళ సూచనలు చేస్తే స్వీకరించాలా? లేదా? అనేది స్పీకర్ నిర్ణయమే. ఒక రాజ్యాంగ వ్యవస్థపై మరో రాజ్యాంగ వ్యవస్థ పెత్తనం చేయలేదు" అని ముకుల్ రోహత్గీ వాదించారు. అనంతరం జస్టిస్ బీఆర్ గవాయ్ స్పందిస్తూ సరైన సమయంలో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు చెప్పలేమా? ఆయనకు విజ్ఞప్తి చేయడమో.. ఆదేశించడమో చేయలేమా అని ప్రశ్నించారు. అనంతరం రోహత్గీ స్పందిస్తూ ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన వారంలోనే పిటిషన్ వేశారన్నారు. ఒకదాని తర్వాత మరొక రిట్ పిటిషన్లు దాఖలు చేస్తూ వచ్చారని.. కనీసం ఆలోచించే అవకాశం కూడా లేకుండా పిటిషన్లు వేశారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ముకుల్ రోహత్గీ వాదనల్లో జస్టిస్ బీఆర్ గవాయ్ జోక్యం చేసుకున్నారు. కోర్టులు రాజ్యాంగ పరిరక్షకులుగా వ్యవహరిస్తాయని చెప్పారు. నాలుగేళ్లు స్పీకర్ చర్యలు తీసుకోకపోతే కోర్టులు చూస్తూ ఉండాల్సిందేనా? అని ప్రశ్నించారు. ఫిరాయింపుపై పిటిషనర్ల ఇష్టానుసారం స్పీకర్ వ్యవహరించలేరని రోహత్గీ అన్నారు. "2024 మార్చి 18న పిటిషనర్లు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. 2025 జనవరి 16న 10 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేశారు. స్పీకర్ తన విధులు నిర్వర్తిస్తున్నారు" అని కోర్టుకు తెలిపారు.




## సీఎం రేవంత్ వ్యాఖ్యలపై సుప్రీం కోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ : ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత కేసు విచారణ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పార్టీలు మారినా ఉప ఎన్నికలు రావు అని రేవంత్ చేసిన వ్యాఖ్యలను బుధవారం విచారణలో ప్రత్యేకంగా ప్రస్తావించిన జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం తీవ్ర వ్యాఖ్యలే చేసింది. పవిత్రమైన చట్టసభలో ఈ వ్యాఖ్యలు చేయడం... రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌ను సీఎం హోదాలో ఉన్న వ్యక్తి అపహాస్యం చేయడం కిందకే వస్తుంది. ఇలాంటి వ్యాఖ్యలు మరోసారి చేయకుండా సీఎంకు హితవు చెప్పండి. ఎట్టిపరిస్థితుల్లో ఈ తరహా వ్యాఖ్యలను ఉపేక్షించబోం. అవసరమైతే కోర్టు ధిక్కారంగా భావించాల్సి వస్తుంది" అని సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీని ఉద్దేశించి జస్టిస్ గవాయ్ అన్నారు. మేం అన్నీ ఆలోచించే కోర్టు ధిక్కార నోటీసులు ఇస్తున్నాం. అంతమాత్రాన మాకు అధికారాలు లేవని కాదు. అసెంబ్లీలో నాయకులు చేసే ప్రకటనలకు ఒక విలువ ఉంటుంది.

అసెంబ్లీలో మాట్లాడే అంశాలను కోర్టులు కూడా తీసుకుంటాయి అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. గత బుధవారం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో సీఎం రేవంత్ ప్రసంగిస్తూ.. రాష్ట్రంలో ఉప ఎన్నికలు వచ్చే ప్రసక్తే లేదని, పార్టీ మారిన ఎమ్మెల్యేలెవరూ ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. "వచ్చే వారమే రాష్ట్రంలో ఉప ఎన్నికలు వస్తాయంటూ బీఆర్ఎస్ నేతలు ఊదరగొడుతున్నారు. కానీ.. ఎట్టి పరిస్థితుల్లోనూ రావు. గత బీఆర్ఎస్ హయాంలో ఉన్న రాజ్యాంగమే ఇప్పుడు కూడా ఉంది. స్పీకర్ వ్యవస్థ, చట్టం అవే ఉన్నాయి. ఏవీ మారలేదు. అలాంటప్పుడు అప్పుడు పార్టీలు మారిన నేతల విషయంలో రాని ఉప ఎన్నికలు ఇప్పుడెలా వస్తాయని వ్యాఖ్యానించారు.

## తెలంగాణ సచివాలయం వద్ద ఉద్రిక్తత .. భాజపా మహిళా నేతల అరెస్టు

హైదరాబాద్: తెలంగాణ సచివాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. సెక్రటేరియట్ ముట్టడికి యత్నించిన భాజపా మహిళా మోర్చా నేతలను సౌత్ గేట్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, మహిళలకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు మహిళలను అడ్డుకుని స్థానిక ఠాణాలకు తరలించారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, సెంట్రల్ యూనివర్సిటీ భూముల వ్యవహారాలకు సంబంధించి నిరసనగా భాజపా మహిళా మోర్చా సెక్రటేరియట్ ముట్టడికి పిలుపునిచ్చింది. మరోవైపు కంచ గచ్చిబౌలి భూవివాదం నేపథ్యంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థులు, అధ్యాపకుల ఆందోళనలు కొనసాగుతున్న విషయం తెలిసిందే.




Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com